# X 808

నవల

- కొమ్మూరి సాంబశివరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 247

కౌముది మాసపత్రికలో

మార్చ్ 2022 సంచిక నుంచి జనవరి 2023 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

(ప్రారంభం)

**"పాకిస్థాన్‌లో** ఆయన ఎక్కడ వున్నారో తెలుసా?" అడిగాడు యుగంధర్, స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్ చెప్పిన విషయాలన్నీ సావధానంగా విన్న తరవాత.

"తెలియదు మిస్టర్ యుగంధర్ లాయల్‌పూర్ జైలులో వున్నారని పాకిస్థాన్ అధికారులు చెపుతున్నారు. ఓ యింట్లో షేక్‌ని బందీగా వుంచారని కూడా వదంతి. ఆయన అసలు ప్రాణాలతో లేరనీ, పాకిస్థాన్ అధికారులు ఆయన్ను చంపేశారనీ కూడా అనుమానం వుంది" జవాబు చెప్పాడు బండార్కర్.

"తటస్థ దేశ రాయబారుల ద్వారానో, మన మిత్ర దేశాల రాయబారుల ద్వారానో తెలుసుకోలేకపోయారా?"

"ప్రయత్నించాము. ప్రయోజనం లేకపోయింది" అన్నాడు బండార్కర్ నిస్పృహతో డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంటూ రాజు చిన్నగా దగ్గాడు.

"ఎస్ రాజు. నీ సందేహం ఏమిటి?" అడిగాడు బండార్కర్.

"మన యింటలిజెన్స్ డిపార్టుమెంటు.."

"నువ్వు అడుగుతావని నాకు తెలుసు. ఇదుగో ఫైలు. షేక్ ముజిబూర్ రహమాన్ పాకిస్థాన్‌లో ఎక్కడున్నదీ తెలుసుకోవడానికి ప్రయత్నించిన మన డిపార్టుమెంటు ఏజంట్లు ముగ్గురు మాయమయ్యారు."

"అంటే?" అడిగాడు యుగంధర్.

"ఏజంటు A21 ని పంపించాను మొదట. అతను కొన్ని రిపోర్టులు పంపించాడు. వారం రోజుల తర్వాత అతని దగ్గిర్నించి ఏ కబురూ రాకపోయేసరికి అతని విషయం, ముజిబూర్ రహమాన్ విషయం ఆరా తీయడానికి X212ని పంపించాము. అతను పాకిస్థాన్ వెళ్ళిన తరవాత ఒకే రిపోర్టు పంపించాడు. అంతే. తరవాత అతన్నించీ కబురులేదు. అప్పుడు మన ఏజంట్లలో కల్లా ఘటికుడు, అనుభవజ్ఞుడూ, పాకిస్థాన్ స్థితిగతులు బాగా తెలిసినవాడూ అయిన నెం.989ని పంపించాము. అతను పాకిస్థాన్ చేరుకున్నాడని మాత్రం తెలిసింది. అంతే, అతని దగ్గర నుంచి ఎటువంటి కబురూ రాలేదు వారం రోజులయినా. ఈ ముగ్గురు ఏజంట్లనీ పాకిస్థాన్ అధికారులు చంపేసి వుంటారని నా అనుమానం. ప్రాణాలతో వుంటే వాళ్ళు ఏదో విధంగా మనకి కబురు అందచేసేవాళ్ళు."

యుగంధర్ అయిదు నిమిషాలు దీర్ఘంగా ఆలోచించాడు.

"ఇక్కడనించి వెళ్ళిన ప్రతి ఏజంటుని వాళ్ళు పట్టుకుని హతమార్చారంటే నాకు ఓ అనుమానం కలుగుతోంది. ఇక్కడ మన డిపార్టుమెంటులో ఎవడో ద్రోహివుండాలనీ, పాకిస్థాన్ అధికారులకి అక్కడికి వెళుతున్న ఏజంట్ల గురించిన వివరాలు అందచేసి వుండాలనీ, అందువల్లే మన ఏజంట్లు పట్టుబడి వుండాలనీ అనుమానం కలుగుతోంది" చెప్పాడు.

"నిజానికి అటువంటి అనుమానానికి ఆధారంలేదు" అన్నాడు బండార్కర్.

"ఆ ఏజంట్లని పాకిస్థాన్‌కి పంపిస్తున్న విషయం నాకు తప్ప యింకెవరికీ తెలియదు. డిపార్టుమెంటులో చర్చించుకుని నిర్ణయించిన విషయం కాదు యిది. వాళ్ళు నాకు తప్ప అంరెవరికీ బాధ్యులుకారు. మేము 'ఫలానిచోటికి, ఫలానా పనిమీద

వెళుతున్నాం' అని వాళ్ళు ఎవరికీ చెప్పి ఉండరు. చెప్పడానికి వాళ్ళు అనుభవంలేని ఏజంట్లు కారు. సీక్రెట్ ఏజంట్లు" చెప్పాడు బండార్కర్.

"అయితే వాళ్ళు అంత సులభంగా అక్కడి అధికారులకి చిక్కిపోవడానికి కారణమేమంటారు?" అడిగాడు యుగంధర్.

"షేక్ మజ్‌బూర్ రహమాన్ని చాలా జాగ్రత్తగా, వెయ్యి కళ్ళతో కనిపెడుతూ వుండాలి అక్కడి అధికారులు. షేక్‌ని గురించి ఎవరు యేం అడిగినా, తెలుసుకోడానికి ప్రయత్నించినా అక్కడి అధికారులకి అనుమానం కలుగుతుంది. అలా అనుమానం కలగడంవల్లే మనవాళ్ళు పట్టుబడి వుండాలి."

యుగంధర్ మౌనంగా వుండిపోయాడు. గోడ గడియారం టకటక చప్పుడు మాత్రం వినిపిస్తోంది ఆ గదిలో.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? నిజమే చాలా ప్రమాదమైన పనే, ప్రాణాలతో తిరిగి వస్తామన్న ఆశ చాలా తక్కువ" అన్నాడు బండార్కర్.

"డోంట్ బి సిల్లీ ప్రాణభయం గురించి కాదు నేను ఆలోచిస్తున్నది. ప్రమాదం వుంటే వుంటుంది. ప్రమాదాలు నాకు కొత్తకాదు."

"అయితే ఏ విషయం గురించి ఆలోచిస్తున్నారు?"

"నేను డిటెక్టివ్‌ని. అపరాధాలు జరిగితే పరిశోధించి నేరస్థుల్ని పట్టుకోవడం నా వృత్తి. దొంగలా యింకో దేశంలోకి జొరబడి"

"ఇంతకు పూర్వం అలా చాలాసార్లు చేశారే" అన్నాడు బండార్కర్.

"ఆ పరిస్థితి వేరు, మనదేశం ప్రమాదంలో వుంది. మన పౌరుడు చిక్కులో యిరుక్కున్నాడు. మన దేశం కోసం, మన జాతికోసం చేశాను."

"ఇప్పుడూ అలాంటి పరిస్థితేగా?"

"కాదు. షేక్ మజ్‌బూర్ రహమాన్ మన దేశస్థుడు కాడు. పాకిస్థాన్ పౌరుడు. రేపో మాపో బంగళాదేశ పౌరుడు కావచ్చు" అన్నాడు యుగంధర్. "యస్ ఐ అండర్ స్టాండ్ యువర్ పాయింట్. దలైలామాని తీసుకుని వచ్చారే"

"అవును. అందులో రాజనీతి- విప్లవము - విప్లవ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు రావడం ఆ విప్లవ నాయకుణ్ణి తీసుకురావడం ఇటువంటి రాజకీయాలు లేవు. బౌద్ధమత గురువు దలైలామా. ఆయన ప్రాణాన్ని రక్షించడమే నేను చేసిన పని. అదీ భారత ప్రభుత్వం తరపున చెయ్యలేదు. నాకై నేను ఒక మనిషి ప్రాణాన్ని కాపాడడానికి పూనుకున్నాను" అన్నాడు యుగంధర్.

"ఇదీ అంతేగా - షేక్ మజ్‌బూర్ రహమాన్ తూర్పు బెంగాలీల నాయకుడు. ఆయన ప్రాణాన్ని రక్షించడానికి -"

"నో- నో అదీ యిదీ ఒకటి కాదు. షేక్ మజ్‌బూర్ రహమాన్ రాజకీయ నాయకుడు. దిస్ యీజ్ ఏ గేమ్ ఆఫ్ పాలిటిక్స్" అన్నాడు యుగంధర్.

"బంగ్లాదేశ్ విముక్తి చెందేనాటికి.."

"అర్థమైంది మైడియర్ బండార్కర్. ఆనాటికి షేక్ మజ్‌బూర్ రహమాన్ తూర్పు బెంగాల్‌లో లేకపోతే బంగ్లాదేశ్ ప్రజల ఆగ్రహానికి అక్కడి పాకిస్థానీయులు - పౌరులు - సైనికులు అందరూ ఆహుతి అవుతారనీ, రక్తం వరదలై

పొరుతుందనీ, ఆ ఘోరాతి ఘోరమైన పరిస్థితి కలగకుండా వుండాలంటే షేక్‌ని ఆ నాటికి బంగ్లాదేశ్‌కి తీసుకు రావాలంటారు. ఏదయినా నేను ఆలోచించుకోవాలి. ఆలోచించి చెపుతాను" అన్నాడు యుగంధర్.

"అలాగే కానివ్వండి. త్వరగా చెప్పాలి."

"త్వరగానే చెపుతాను. ఈ సాయంకాలం లోపున."

"థాంక్యూ" అన్నాడు బండార్కర్.

**2**

బండార్కర్ యిచ్చిన ఫైలు తిరగేస్తున్నాడు రాజు. యుగంధర్ దీర్ఘంగా ఆలోచిస్తూ గదిలో పచార్లు చేస్తున్నాడు. రాజు చదివేసిన కాగితాలని ఫైలులోంచి తీసి, కాత్యాకి యిస్తున్నాడు. కాత్యాకూడా చదివి మళ్ళీ ఫైలులో పెడుతోంది.

అరగంట గడిచింది. కాత్యా ఫైలు మూసేసింది.

"ఇంట్రస్టింగ్ - వెరీ యింట్రస్టింగ్" అన్నాడు రాజు.

"ఏమిటి ఇంట్రస్టింగ్?" అడిగాడు యుగంధర్.

"మన సీక్రెట్ ఏజంట్ల వ్యవహారం" జవాబు చెప్పాడు రాజు.

"అందులో ఇంట్రస్టింగ్‌గా వున్నదేమిటి?" అడిగాడు యుగంధర్.

"రావల్పిండిలో ఒక హోటలున్నదిట. దాని పేరు హోటల్ యూనివర్స్, పెద్ద హోటలు కాదు. పైగా అది బజారు ప్రాంతంలా లేదు. ఒక మారుమూల ఉన్నది. ఆ హోటల్ యజమానురాలి పేరు మిస్ పోలీస్. ఆ హోటల్లో పదిగదులు కూడా లేవుట. పాకిస్థాన్ ఉన్నత సైనికాధికారులు తరుచు ఆ హోటల్‌కి వెళుతూ ఉంటారుట. అలాగే విదేశాలనించి వచ్చే ముఖ్యులు ముఖ్యంగా ప్రభుత్వ ప్రతినిధులని కూడా అక్కడికి తీసుకు వెళుతూ ఉంటారుట. సామాన్యులెవరయినా వెళ్ళి గది అడిగితే ఖాళీ లేదంటుంది. ఆ హోటల్ యూనివర్స్ నిజంగా హోటల్ కాదనీ ఉన్నత పదవులలో వున్న వారికోసం రహస్యంగా వుంచటం కోసం స్థాపించబడిన వ్యభిచార గృహం అనీ మన ఏజంట్ A 21కి తెలిసి, ఆ వ్యభిచారగృహంలో ఉన్న ఒక యువతితో, పేరు మెహరున్నిసా. స్నేహం చేసుకుని ఆమె ద్వారా షేక్ మజిబూర్ రహమాన్ ఎక్కడ వున్నాడో తెలుసుకోవడానికి పన్నాగం పన్నాడు. ఆఖరి రిపోర్టు - చదువుతాను వినండి. 'ఏజంట్ 21 రిపోర్టు నెం.4.

ఈ రాత్రి సరిగ్గా పన్నెండు గంటలకి నేను హోటల్ యూనివర్స్‌కి వెళుతున్నాను. మెహరున్నిసా రమ్మన్నది. తను హోటల్లోంచి వారం రోజులవరకూ బయటికి రావడానికి వీలులేదుట. వారం రోజుల పాటు కమాండర్ ఆఫ్ ది వెస్టరన్ ఫోర్సెస్ జనరల్ టిక్కాఖాన్ హోటల్లో బస చేస్తాడుట. టిక్కాఖాన్ గదిలోనే తను వుండవలసి వస్తుందిట. అందువల్ల రాత్రి పన్నెండు గంటలకి హోటల్ యూనివర్స్ వెనకవైపు వీధిలోకి వెళ్ళి మేడమీద వున్న కిటికీలలో నాలుగో కిటికీ కింద నిలబడమన్నది. షేక్‌ని గురించి తెలుసుకుని, చీటీమీద రాసి, కింద విసిరేస్తాను అన్నది. ఇప్పుడు తొమ్మిది గంటలయింది. నేను బయలుదేరుతున్నాను.' ఇదీ ఏజంట్ A 21 ఆఖరి రిపోర్టు" అన్నాడు రాజు.

"అలాగా! మన X 212 వెళ్ళాడుగా, అతని రిపోర్టు?"

"అదీ యింట్రస్టింగ్‌గా వుంది. A 21 మాయమవడానికి కారణం హోటల్ యూనివర్స్‌లో వున్న మెహరున్నిసా అని తెలుస్తోనే వుంది. కనుక దర్యాప్తు హోటల్ యూనివర్స్‌లోనే, మెహరున్నిసాతోనో ప్రారంభించాలి కదూ.

కానీ X 212 మెహరున్నిసాని కలుసుకోవడానికి కాని హోటల్ యూనివర్స్ ప్రాంతాలకి కానీ వెళ్ళలేదు. బహుశా ఆ విధంగా దర్యాప్తు ప్రారంభిస్తే ప్రమాదం వుందని అయ్యిండాలి. అతను పాకిస్థాన్‌కి వెళ్ళిన వారం రోజుల తర్వాత వ్రాసిన ఒకే ఒక రిపోర్టు - మొదటిది ఆఖరిది యిదే చదువుతాను'' అని రాజు చదవడం ప్రారంభించాడు.

''X 212 రిపోర్ట్ రావల్పిండినించి: వారం రోజులు రిపోర్టు పంపకపోవడానికి కారణం రిపోర్టు యివ్వడానికి ఏమీలేదు. లేకపోవడమే. షేక్‌ని లాయల్ పూర్ జైలులో వుంచారో లేదో నిశ్చయం చేయాలనే ఉద్దేశంతో లాయల్‌పూర్ జైలు సూపరింటెండెంట్‌తో స్నేహం చేసుకున్నాను. లాయల్‌పూర్ జైలులో షేక్ లేడని నిశ్చయం అయింది. రావల్పిండిలోనే సైనిక నిర్బంధంలో వున్నాడని సూచనగా తెలుసుకున్నాను. అందువల్ల రావల్పిండి వచ్చేశాను. నేను రావల్పిండి వచ్చినప్పటినుంచీ ఎవరో నన్ను వెంబడిస్తున్నారనీ - నన్ను ఓ కంట కనిపెడుతున్నారనీ అనుమానంగా వుంది. నేను హోటల్ దీపక్‌లో బసచేశాను. ఈ రాత్రి తొమ్మిది గంటలకి నా గది తలుపు ఎవరో తట్టారు. తెరవగానే అవతల ఒక అందమైన అమ్మాయి నిలుచునున్నది. తన పేరు మెహరున్నిసా అని చెప్పింది. వెంటనే నాకు అనుమానం కలిగింది. పిస్టల్ కోసం జేబులో చెయ్యిపెట్టాను. నవ్వి, తనని చూసి భయపడవద్దని చెప్పింది. లోపలికి వచ్చింది. మెహరున్నిసా చెప్పిన విషయం.

హోటల్ యూనివర్స్‌కి వచ్చిన యిద్దరు పాకిస్థాన్ సైనిక అధికారుల మాటలవల్ల నా గురించి తనకి తెలిసిందని అందుకే వచ్చాననీ చెప్పింది మెహరున్నిసా. నేను భారతదేశ సీక్రెట్ ఏజంట్‌నని అందుకే వచ్చాననీ చెప్పింది మెహరున్నిసా. నేను భారతదేశ సీక్రెట్ ఏజంట్‌నని పాకిస్థాన్ అధికారులకి అనుమానం కలిగిందనీ అందుకే నన్ను కనిపెడుతున్నారనీ కూడా చెప్పింది. నిశ్చయంగా తెలియగానే నన్ను హతమారుస్తారనీ చెప్పింది. ఏజంట్ ఏ 21 వచ్చే సమయానికి జనరల్ టిక్కాఖాన్ కిటికీలోంచి కిందకి చూడడం జరిగిందనీ, అనుమానంతో అతన్ని పట్టుకోమని ఆజ్ఞాపించాడనీ ఏజంట్ A 21 ని పట్టుకున్నారనీ అతన్ని చంపలేదనీ, హోటల్ యూనివర్స్ కింద భూగర్భంలో కట్టిన గదుల్లో ఒక గదిలో ఏజంట్ A 21ని బంధించారనీ చెప్పింది. తను మెహరున్నిసా తూర్పు బెంగాలీ యువతిననీ తను అవామీలీగ్ తరఫున ఒక సీక్రెట్ ఏజెంట్‌గా రావల్పిండికి వచ్చాననీ తన దేశం కోసం మానమే కాదు ప్రాణాన్ని కూడా బలియివ్వడానికి సిద్ధమనీ అయితే A 21ని తను ఒక్కతే విడిపించడానికి అవకాశంలేదనీ నేను సహాయం వస్తే A 21ని విడిపించవచ్చనీ చెప్పింది. మెహరున్నిసాని చాలా అడ్డు ప్రశ్నలు వేశాను. గంటసేపు తరిచి తరిచి ప్రశ్నించాను. ఆమె అబద్ధాలు చెప్పడం లేదని నిశ్చయించుకున్నాను కనుక ఏజంట్ A 21ని విడిపించడానికి యీ రాత్రి హోటల్ యూనివర్స్‌కి వెళుతున్నాను.''

రాజు చదవడం ముగించాడు.

''అవును ఇంట్రస్టింగ్‌గా వుంది. ఏజంట్ A 21, X 212 యిద్దరూ మెహరున్నిసా ద్వారా హోటల్ యూనివర్స్‌కి వెళ్ళి ఆ తర్వాత మాయమయ్యారు'' అన్నాడు యుగంధర్.

''ఏజంట్ 989కి బండార్కర్ యిచ్చిన ఆర్డర్ కూడా చదువుతాను వినండి'' అన్నది కాత్యా.

''ఊ.'' అన్నాడు యుగంధర్.

''ఏజంట్ A 21 అండ్ ఏజంట్ ఎక్స్ 212 వ్రాసిన రిపోర్టులు చదివి మీరు వెంటనే పాకిస్థాన్‌కి బయలుదేరి వెళ్ళండి. ఏ రూపంలో ఏ మారువేషంలో వెళతారో, ఎలా దర్యాప్తు ప్రారంభిస్తారో అది మీకే వొదిలి వేస్తున్నాను. హెచ్చరిక: మీరు పాకిస్థాన్ వెళుతున్నది షేక్ మజిబూర్ రహమాన్ ఎక్కడ వున్నదీ తెలుసుకోవడానికి, అతన్ని విడిపించుకుని

తీసుకురావడానికి. ఏజంట్స్ A 21, X 212ని విడిపించడానికి కాదు. కనుక హోటల్ యూనివర్స్ ప్రాంతాలకి కానీ మెహరున్నిసా జోలికి కాని పోవద్దు, మీ దర్యాప్తుకి అవసరం అయితే తప్ప."

"అంతే సీక్రెట్ ఏజంట్లుగా పనిచేస్తున్నవారు సహాయంకాని, రక్షణ కానీ ఆశించకూడదు" అన్నాడు యుగంధర్.

"అయితే మనమూ హోటల్ యూనివర్స్‌తోనే దర్యాప్తు ప్రారంభిస్తామా?" అడిగాడు రాజు.

యుగంధర్ చిన్నగా నవ్వి, "ఈ వ్యవహారంలో జోక్యం కల్పించుకోవడమా, లేదా అని నేను యింకా నిశ్చయించుకోలేదు" అన్నాడు యుగంధర్.

రాజు నవ్వి వూరుకున్నాడు.

"తూర్పు బెంగాల్ విషయం, షేక్ మజీబూర్ రహమాన్ విషయం, అసలు ఈ గొడవ నాకు తెలియనే తెలియదు. షేని పాకిస్థాన్ నుంచి తీసుకురావడం ఎందుకు అంత ముఖ్యమో సూచనగా చెప్పగలరా నాకు?" అడిగింది కాత్యా.

"చెపుతాను - వివరంగానే చెపుతాను. అప్పుడు ముగ్గురం కలిసి నిశ్చయిద్దాం మనం ఏం చెయ్యాలో" అన్నాడు యుగంధర్.

రాజు బెల్ నొక్కాడు. రూం బాయ్ రాగానే మూడు కప్పులు కాఫీ తెమ్మన్నాడు.

"భారతదేశానికి స్వతంత్రం కావాలనీ, బ్రిటీష్ పాలకులని వెళ్ళిపొమ్మనీ, గాంధీజీ, నెహ్రూ, పటేల్‌ల నాయకత్వంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ స్వాతంత్ర్య ఉద్యమం నడిపిన విషయం నీకు తెలుసుగా. ముస్లింలీగ్ అనే పేరున ముస్లింలతో ఒక పార్టీ నెలకొల్పి, దాని నాయకుడు మహమ్మదాలీ జిన్నా, భారత ఖండంలోనే ముస్లింలకి ప్రత్యేకంగా ఒక దేశం కావాలనీ, హిందువులు, ముస్లింలు కలసి ఒక రాజ్యంగా ఎన్నటికీ వుండలేరని, భారతదేశంలో అధిక సంఖ్యాకులయిన హిందువులు - ముస్లిమ్లని అణగతొక్కుతారనీ, అందువల్ల బ్రిటిష్ వారు మన దేశాన్ని వదలి వెళ్ళక ముందే దేశాన్ని పాకిస్థాన్‌గా హిందూస్థాన్‌గా విభజించి వెళ్ళమనీ చెప్పాడు. తప్పు ఒప్పులు, న్యాయాన్యాయాల విషయం యిప్పుడు ప్రస్తావించను. బ్రిటిష్ వారు భారతదేశాన్ని విభజించి ముస్లింలకి ప్రత్యేక రాజ్యం ఏర్పరచి వెళ్ళిపోయారు. భారతదేశంలో పశ్చిమ ప్రాంతంలో ముస్లింలు అధిక సంఖ్యాకులుగా వున్న రాష్ట్రాలు, యిటు తూర్పు ముస్లింలు అధిక సంఖ్యాకులుగా వున్న ప్రాంతాలు కలిసి పాకిస్థాన్‌గా ఏర్పరచారు. ఇది 1947వ సంవత్సరంలో జరిగింది. కృత్రిమంగా సహజమైన సరిహద్దులు లేకుండా దేశాన్ని ఇలా విభజించడం ఎంత తప్పో, ఈనాడు తెలిసి వచ్చింది. పశ్చిమాన వున్న పాకిస్థాన్‌కీ, తూర్పున వున్న (బెంగాల్) పాకిస్థాన్‌కి మధ్య రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్ రాష్ట్రాలు అంటే భారతదేశం వుంది. అటు ఉత్తరం వేపు అస్సాం వుంది. తూర్పు బెంగాల్‌కి దక్షిణాన మాత్రం బంగాళాఖాతం వుంది. పశ్చిమ పాకిస్థాన్ నించీ తూర్పు పాకిస్థాన్‌కి, భారతదేశం మధ్య నించి ఒక రహదారి కావాలని జిన్నా పట్టుపట్టాడు. భారతదేశం మధ్యన పర ప్రభుత్వానికి యిలా చోటు యివ్వడానికి వీలుకాదని, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యంతరం చెప్పారు. చివరకి అటువంటి రహదారి లేకుండానే పాకిస్థాన్ దేశం స్థాపితమైంది. అంటే ఆ దేశం నిజానికి రెండు విడివిడి దేశాలన్నమాట. సింధ్ - పశ్చిమ పాకిస్థాన్ ఒకవేపు, తూర్పు బెంగాల్ యింకొక వేపు. ఈ రెండు దూరంగా వున్న విడివిడి భూభాగాలనీ కలిపి ఒక రాజ్యంగా పరిగణించడానికి ఆ యిరు ప్రాంతాల దేశ ప్రజల మధ్యన వున్న సాంస్కృతిక సాంఘిక అవినాభావ సంబంధంకాదు. సరిహద్దుల సంబంధం కాదు. ఈ రెండు విడివిడి ప్రాంతాలు ఒక దేశం అనడానికి సూత్రం ఒకటే - మతం. అటు పశ్చిమ పాకిస్థాన్‌లో ఇటు

తూర్పు పాకిస్థాన్ (బెంగాల్)లో ప్రజలలో అధిక సంఖ్యాకులు ముస్లింలు'' యుగంధర్ చెపుతున్నాడు. రూంబాయ్ కాఫీ తెచ్చి బల్లమీద పెట్టాడు.

''కాఫీ త్రాగండి చల్లారిపోతుంది'' అన్నది కాత్యా.

**కాఫీ తాగి** ఖాళీ కప్పు బల్లమీద పెట్టి యుగంధర్ మళ్ళీ ప్రారంభించాడు:

''పశ్చిమ పాకిస్థాన్ కన్నా తూర్పు పాకిస్థాన్‌లో జనాభా ఎక్కువ. పశ్చిమ పాకిస్థాన్ కన్నా తూర్పు పాకిస్థాన్ ప్రజలని పశ్చిమ పాకిస్థాన్ ప్రజలు మొదటినించి చిన్నచూపు చూసేవారు. ప్రభుత్వరంగంలో అయితేనేం దేశాభ్యుదయం విషయంలోనైతేనేం తూర్పు పాకిస్థానీయుల ప్రాంతీయ భాష అయిన బెంగాలీని రూపు మాపి, అక్కడకూడా ఉర్దూనే ప్రాంతీయ భాషగా చెయ్యాలని సర్వప్రయత్నాలూ చేశారు పశ్చిమ పాకిస్థానీయులు తూర్పు పాకిస్థాన్‌నీ అంటే తూర్పు బెంగాల్‌ని ఒక వలస రాజ్యంగా తమ బానిస రాజ్యంగా చూశారు. ఈ తారతమ్యాలు నియంతృత్వం ఈ అన్యాయం దాదాపు యిరవయి మూడేళ్ళు భరించారు తూర్పు పాకిస్థానీయులు. తమకి జరుగుతున్న అన్యాయాన్ని భరించలేక పోయారు. చిరుమంటలు ప్రారంభం అయ్యాయి. అలజడులు, అదికార ధిక్కారమూ మొదలయింది. తూర్పు పాకిస్థాన్‌లో. పశ్చిమ పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం ఏనాడో మాయమైంది. సైనిక ప్రభుత్వం కింద అణిగివుంది పాకిస్తాన్. ఈ సమయంలో అటు పశ్చిమ పాకిస్తానీయులూ, ఇటు తూర్పు పాకిస్తానీయులూ సైనిక ప్రభుత్వం నియంతృత్వం పోవాలనీ, ప్రజా స్వామ్యం నెలకొల్పాలనీ, ప్రజా ప్రభుత్వం రావాలనీ ఉద్యమం ప్రారంభించారు. చివరికి పాకిస్తాన్ నియంత ప్రెసిడెంట్ యాహ్యాఖాన్ ప్రజాభిప్రాయానికి లొంగగ తప్పలేదు. ఎన్నికలు జరిపించి, ఎన్నికల అనంతరం ప్రభుత్వం ప్రజల ప్రతినిధులకి ఒప్పచెప్పుతానన్నాడు. ఎన్నికలు జరిగాయి పశ్చిమ పాకిస్తాన్‌లో. పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధులు అధిక సంఖ్యాకులుగా గెలిచారు. వారి నాయకుడు భూటో. ఇక్కడ తూర్పు బెంగాల్‌లో అవామీ లీగ్ ప్రతినిధులు అందరూ గెలిచారు. వారి నాయకుడు షేక్ ముజీబూర్ రహమాన్. ఎటొచ్చీ తూర్పు పాకిస్థాన్ జనాబా ఎక్కువ కనుక. షేక్ మజీబూర్ రహమాన్‌కి శాసన సభలో బలం ఎక్కువుంది. అంటే షేక్ మజీబూర్ రహమాన్ పాకిస్థాన్‌కి ప్రధానమంత్రి అవ్వాలి. కాని ఇన్నేళ్ళుగా అధికారం చేజిక్కించుకుని, తూర్పు బెంగాల్‌ని ఒక బానిస దేశంగా చూస్తున్న పశ్చిమ పాకిస్తానీయులు అందుకు సమ్మతించలేకపోయారు. షేక్ మజిబూర్ రహమాన్‌కి అధికారం ఒప్పచెప్పితే తూర్పు పాకిస్థానీయుల చేతికి అధికారం ఒప్పచెప్పడం అని భయపడ్డారు. తూర్పు పాకిస్తాన్‌ని బీదగా అట్టిపెట్టి, వాళ్ళ డబ్బుతో ఇన్నేళ్ళుగా తమ ప్రాంతాన్ని, పశ్చిమ పాకిస్తాన్‌ని నిలబెట్టుకుంటున్న పశ్చిమ పాకిస్తాన్ నాయకుడు భూటో అసలు సమ్మతించలేదు. అధికారం షేక్ మజీబూర్ రహమాన్‌కి ఒప్పచెప్పితే పశ్చిమ పాకిస్తాన్‌లో రక్తం వరదలుగా పారుతుందని హెచ్చరించారు. యాహ్యాఖాన్‌కి యింతకన్నా యేం కావాలి పిల్లి. పిల్లి పోట్లాడితే కోతి వెన్నంతా తిన్నట్లు అయితే ఎవరికీ అధికారం యివ్వనన్నాడు.

ఇన్నేళ్ళుగా దాదాపు, దాస్యాన్ని భరిస్తున్న తూర్పు పాకిస్తానీయులు అంటే బెంగాలీలు యిక భరించరనీ ఎదురు తిరుతామనీ- షేక్ మజీబూర్ రహమాన్‌తో సంప్రతించడానికి యాహ్యాఖాన్ తూర్పు పాకిస్తాన్ స్థానిక ముఖ్యపట్టణం ఢాకాకి వెళ్ళి, షేక్‌తో సంప్రతింపు జరుపుతున్నట్టు నటించి ఆ వ్యవధిలో పాకిస్తాన్ నించి సైన్యాలని రప్పించాడు. బాగా సైన్యం తూర్పు పాకిస్తాన్‌కి చేరుకున్న తర్వాత, షేక్ మజీబూర్ రహమాన్‌తో సంప్రతింపులు జయప్రదం కాలేదనీ ప్రజాప్రభుత్వం

నెలకొల్పడం ప్రస్తుతానికి వాయిదా వేశాననీ అన్నాడు. తూర్పు పాకిస్తాన్‌ని ఎల్లకాలమూ, పశ్చిమ పాకిస్తాన్‌కి బానిసదేశంగా వుంచదలచుకున్నారు. పశ్చిమ పాకిస్తానీయులు అని తేటతెల్లమైంది షేక్ మజీబూర్ రహమాన్‌కి. తూర్పు పాకిస్తాన్ అంటే తూర్పు బెంగాల్ పాకిస్తాన్‌లో ఒక ప్రాంతంగా వుండదనీ ఆనాటి నించి, తూర్పు బెంగాల్ సర్వస్వతంత్ర రాజ్యంగా బంగ్లా దేశంగా రూపొందుతుందనీ, ఆనాటి నించీ బంగ్లాదేశం సర్వస్వతంత్రమైన రాజ్యం అనీ ప్రకటించాడు. వెంటనే పాకిస్థాన్ సైనికాధికారులు, షేక్ మజీబూర్ రహమాన్‌నీ అతని అనుచరులనీ దేశద్రోహులుగా ప్రకటించి వారిని బందీలు చేశారు. తూర్పు బెంగాల్ ప్రజలకి ఏకైక నాయకుడయిన షేక్ మజీబూర్ రహమాన్ ప్రకటనతో తూర్పు బెంగాల్ ప్రజలు వుప్పెనలా పశ్చిమ పాకిస్థాన్ సైనికుల మీద ఎదురుతిరిగారు. ప్రజా ఉద్యమం ప్రారంభం అయింది. షేక్‌ని రాత్రికి రాత్రి పశ్చిమ పాకిస్థాన్ అధికారులు తూర్పు బెంగాల్‌నించి పశ్చిమ పాకిస్తాన్‌కి తీసుకువెళ్ళి బందీ చేశారు. పశ్చిమ పాకిస్థాన్ సైనికులు తూర్పు బెంగాల్ ప్రజలమీద తమ తుపాకులు గురిపెట్టారు. అధికారం కోసం ప్రారంభం అయిన అలజడి స్వాతంత్ర్య సమరంగా రూపొందింది. షేక్ మజీబూర్ రహమాన్ నినాదం "స్వతంత్ర బంగ్లాదేశ్" తూర్పు బెంగాల్ ప్రజల చెవులలో గణగణ మోగింది. తూర్పు బెంగాల్ ప్రజలు ఒక పెద్ద కెరటంలా లేచారు పాకిస్తాన్ సైనికుల మీద. ఆనాడు ప్రారంభం అయింది సర్వ స్వతంత్ర బంగ్లాదేశ్ సమరం. ఆయుధాలు లేని సామాన్య ప్రజ ఒకవైపు అమెరికా చైనా ఉచితంగా యిచ్చిన మారణాయుధాలతో ప్రజలని అణచివేయడానికి కర్కశంగా ప్రజలని చంపుతున్న పాకిస్తాన్ సైనికులు యింకొకవైపు. ఈ ప్రజా ఉద్యమాన్ని అణిచి వెయ్యడానికి పాకిస్తాన్ సైనికులు తూర్పు బెంగాల్‌లో చెయ్యని అత్యాచారాలు, చెయ్యని ఛండాలపు పని, చెయ్యని రాక్షసకృత్యం అంటూ లేదు. పసిపిల్లల్ని చంపేశారు. తల్లిదండ్రుల కళ్ళముందు. అన్నల ముందు చెల్లెళ్ళని, భర్తల ముందు భార్యలని, తండ్రుల కళ్ళముందు కూతుళ్ళని బలాత్కారంగా చెరిచి, వాళ్ళ శవాలని వీధిలో పారేశారు. వేలకు వేల ప్రజలని వరసగా నిలబెట్టి కాల్చి చంపారు. వారి నాయకుడు షేక్ మజీబూర్ రహమాన్ దేశంలో లేడు. అయినా నాయకుడు వెలిగించిన స్వాతంత్ర జ్యోతి తూర్పు బెంగాలీ ప్రతి పౌరుడిలో రగుల్కొని, పశ్చిమ పాకిస్థాన్ సైనికులు ఎంత దారుణంగా హింసాకాండని జరిపినా నిస్పృహ చెందకుండా, స్వాతంత్ర్య సమరం ప్రారంభించారు. పశ్చిమ పాకిస్థాన్ సైనికులు తూర్పు బెంగాల్‌లో చేసిన హింసాకాండ రాక్షస కృత్యాల గురించి వింటూంటే హిట్లర్ జ్యూల మీద జరిపిన హింసాకాండకి పదిరెట్లు అనిపిస్తుంది. అసలు అటువంటి రాక్షసత్వం ఏ మనిషిలోనైనా వుంటుందా అనిపిస్తుంది. పాకిస్థాన్ సైనికుల రాక్షసత్వానికి తట్టుకోలేని సరిహద్దు ప్రాంతాలలో వున్న తూర్పు బెంగాలీ ప్రజలు తండోపతండాలుగా భారతదేశానికి పారిపోయి వచ్చారు. ఈ కాందిశీకుల సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోయింది. చివరికి ఒక కోటి జనం భారతదేశానికి వచ్చేశారు. ఈ నిర్భాగ్యులకి తిండీ, బట్టా, నివాసమూ ఏర్పరచవలసిన బాధ్యత భారత ప్రభుత్వం మీద పడింది. అసలే అధిక జన సంఖ్యతో తికమక పడుతున్న ఆర్థిక అభివృద్ధికి ప్రణాళికలకి డబ్బు చాలని స్థితిలో లేదు. అయినా మానవత్వం అనేది కోల్పోలేదు మన నాయకులు. ప్రాణ రక్షణ మాన రక్షణ కొరకు వచ్చిన ప్రజని మన దేశంలోకి రాకుండా, తుపాకీలతో కాల్చి చంపగలమా?" యుగంధర్ చెప్పడం ఆపాడు. ఒక సిగరెట్ వెలిగించాడు.

"మీరు యింతవరకు చెప్పిన విషయాలన్నీ పాకిస్థాన్‌కి సంబంధించినవే కానీ మనకి సంబంధించినవి కావు. వాళ్ళు కొట్టుకుంటే మనకెందుకు?" అడిగింది కాత్యా.

"కులాన్ని, మతాన్ని, జాతినీ, ప్రాంతీయతనీ భాషనీ విస్మరించి ఒక జాతిగా వుండడం గొప్ప. అదే భారతదేశం గొప్ప. అంతకన్నా గొప్ప ఏమిటో తెలుసా? దేశాన్ని దేశ సరిహద్దులని విస్మరించి అందరూ మనుష్యులేనని ఆలోచించడం.

భారతదేశం అలాగే ఆలోచించింది. తూర్పు బెంగాల్ ప్రజలు ఒకప్పుడూ పాకిస్థానీయులని వాళ్ళని ద్వేషించలేదు. సర్వస్వతంత్ర బంగ్లాదేశ ప్రజలు కాబోతున్నారు కనుక వాళ్ళతో మనకేం అని వూరుకోలేదు. కష్టాల్లో వున్న ప్రజలు హింసకి ఆహుతి అవుతున్న ప్రజలు అన్నీ వదిలి ప్రాణాలతో పారిపోయి వచ్చిన ప్రజలు వాళ్ళకి నీడ తిండీ యివ్వడం మానవ ధర్మం. ఆ ధర్మం వహించింది భారతదేశం. కానీ ఎంతకాలం ఈ బరువు మొయ్యగలదు. ఈ కాందిశీకులు వెనక్కి బంగ్లాదేశానికి వెళ్ళాలంటే భారతదేశమే ఏదో ఒకటి చెయ్యాలి. బంగ్లాదేశంలో స్వాతంత్ర్య సమరం సాగించడానికి పశ్చిమ పాకిస్తాన్ సైన్యాలని తరిమిగొట్టడానికి ప్రజలు "ముక్తి బహని" అనే పేరుతో బెంగాలీ సైన్యాన్ని స్థాపించారు. ఆ సైన్యానికి ఆయుధాలు లేవు. ఎలా సంపాదించారో, సంపాదిస్తున్నారో మొత్తానికి ఆయుధాలు సంపాదించి పశ్చిమ పాకిస్తాన్ సైనికులతో యుద్దం చేస్తున్నారు. ప్రజలు ముక్తి బహని వేపు వున్నారు. పశ్చిమ పాకిస్తాన్ సైనికులు బంగ్లాదేశ్‌లో విదేశీయులు, ప్రజలకు అండ సహకారం వారికిలేదు. పశ్చిమ పాకిస్తాన్ సైనికుల ఓడిపోతున్నాడు. బంగ్లాదేశ్ యింక కొద్దికాలంలో సర్వస్వతంత్రం అయ్యే సూచనలున్నాయి. తాము చేసిన తప్పుకి యెవరో బాధ్యులనీ నేరం యింకొకళ్ళమీదకి తోస్తేనే తప్ప తమ మనుగడకి ప్రమాదమనీ పాకిస్థాన్ పాలకులు భారతదేశమేముక్తి బహనీకి ఆయుధాలు సరఫరా చేస్తున్నదనీ తూర్పు బెంగాల్‌లో ప్రజల తిరుగుబాటుకి పరోక్షంగాను, ప్రత్యక్షంగాను భారతదేశం సహాయం చేస్తున్నదనీ ఇలా సాగితే భారతదేశంతో యుద్ధం తప్పదనీ పాకిస్తాన్ సైనిక నాయకులు హెచ్చరిస్తున్నారు. ఇదీ ఈనాటి పరిస్థితి" అని ముగించాడు యుగంధర్.

"మీరెంత చెప్పినా షేక్ మజిబూర్ రహమాన్‌ని ఎందుకు విడిపించుకురావాలో బంగ్లాదేశ్ నాయకుణ్ణి, పశ్చిమపాకిస్తాన్ నించి విడిపించుకు రావడం మనకెందుకో అర్థం కావడంలేదు" అన్నది కాత్యా.

"పాకిస్తాన్‌కీ, భారతదేశానికీ యుద్దం తప్పేటట్టు లేదు. యుద్ధం వస్తుంది. రాగానే మన సేనలు బంగ్లాదేశ్‌లోకి వెళ్ళి ముక్తి బహనీతో చెయ్యి చెయ్యి కలిపి అక్కడవున్న పాకిస్థాన్ సైనికుల్ని ఓడించి తూర్పు బెంగాల్ సర్వ స్వతంత్ర దేశంగా అవడానికి సహాయపడుతుంది. అందులో సందేహం లేదు. అప్పుడే యీ ఒక కోటి కాందిశీకులు తూర్పు బెంగాల్‌కి తిరిగి వెళతారు. అప్పుడే అంతమందికి తిండీ, బట్టా పెట్టే బాధ్యత మనకి తగ్గుతుంది. బంగ్లాదేశం సర్వ స్వతంత్రం అయ్యేనాటికి వాళ్ళ నాయకుడు షేక్ మజిబూర్ రహమాన్ బంగ్లాదేశంలో లేకపోతే - ఆ బంగ్లా దేశ్ ప్రజలకి తండ్రిలాంటివాడు, వారికి నాయకుడు వుండడు. పైగా పశ్చిమ పాకిస్తాన్‌లో బందీగా వుంటే బంగ్లాదేశ్ ప్రజల ఆగ్రహానికి అంతు వుండదు. తూర్పు బెంగాల్‌లో వున్న పశ్చిమ పాకిస్తానీయులపట్ల పశ్చిమ పాకిస్తాన్ సైన్యాలమీద బంగ్లాదేశ్ ప్రజలు తమ కసి తీర్చుకుంటారు. అంటే కనిపించిన ప్రతి పశ్చిమ పాకిస్తానీయుణ్నీ ముక్కలు ముక్కలుగా కోసేస్తారు. రక్తం ఆ దేశంలో వరదలయి పారుతుంది. పశ్చిమ పాకిస్తాన్ సైనికులు చేసిన హింసాకాండకి అది తగిన శిక్ష అని అనవచ్చు. కొందరు. కానీ మన ప్రభుత్వం ఒప్పుకోదు. హింస అనేది రక్తపాతం అనేది ఘోరం. వీలయినంత వరకు అది జరగకుండా చూడాలి. బంగ్లాదేశ్ ముక్తిచెందే నాటికి షేక్ మజిబూర్ రహమాన్ అక్కడ వుంటే 'ద్వేషంతో కక్షతో మనం మనదేశం స్వాతంత్ర్య జీవనం ప్రారంభించవద్దు. జరిగినది ఒక పీడకల. అది మర్చిపోయి పశ్చిమ పాకిస్తానీయులని వాళ్ళ దేశానికి పంపి మనదేశాన్ని మనం అభివృద్ధి పరుచుకుని బంగ్లాదేశ్ ప్రజల సుఖశాంతి జీవనానికి కృషిచేద్దాం' అని చెపితే ఆ ప్రజలు వింటారు. అందుకే ఆయన్ని ఎలాగయినా విడిపించుకుని తీసుకు రమ్మని మన ప్రభుత్వం కోరుతోంది. ఇంకో రాజకీయ ఉద్దేశం లేదని

ఇందులో కుట్ర అసలు లేదనీ కేవలం మానవత్వం మనుష్యులు చంపుకోడం ఆపేందుకేననీ బండార్కర్ చెప్పారు. ప్రధాని చెప్పారని'' అని ముగించాడు యుగంధర్.

యుగంధర్ చెప్పిన విషయాన్ని నెమరువేసుకుంటూ అరగంటసేపు మౌనంగా వుండిపోయారు రాజు, కాత్యా.

''ఏమంటారు? మీ అభిప్రాయం ఏమిటి?'' అడిగాడు చివరికి యుగంధర్.

''మీకు ఒప్పచెప్పిన పని ఒక మహోన్నతమైనపని. ఒక దేశానికి సేవ చెయ్యడానికాదు, ఒక రాజకీయ ప్రయోజనం కోసం కాదు. కొన్ని వేలమంది ప్రాణాలు కాపాడడానికి. ఈ పని మనం చెయ్యమని ఎలా అనగలం? ఇందులో ఆలోచించడానికి ఏముంది?'' అన్నది కాత్యా.

''అవును. ఇందులో రాజనీతి రాజతంత్రం లేదు. ఇది కేవలం హింసా అహింసలకి సంబంధించిన విషయం. పాకిస్తాన్ సైనికులు ఎంత రాక్షసకృత్యాలు చేసినా వాళ్ళను ప్రాణాలతో వాళ్ళ దేశాలకి పంపించడానికి ముందుగానే మన ప్రభుత్వం జాగ్రత్తపడుతోంది అంటే మన నాయకులలో వున్న మానవత్వమే దానికి కారణం. ఒప్పుకుందాం వెళదాం'' అన్నాడు రాజు.

''అయితే బండార్కర్‌కి ఒక షరతు చెపుతాను. మనం భారతదేశం తరపున వెళ్ళడంలేదు, బంగ్లాదేశ్ తరపున వెళ్ళడంలేదు, జరగబోయే హింసాకాండని ఆపడానికి షేక్ ముజిబూర్ రహమాన్ బంగ్లాదేశంలో ప్రత్యక్షంగా వుండాలి కనుక ప్రపంచ పౌరులుగా వెళదాం'' అన్నాడు యుగంధర్.

3

''థాంక్ యు యుగంధర్. నాకు తెలుసు మీరు యీ బాధ్యత తీసుకుంటారని. ప్రధాని తరపున థాంక్స్'' అన్నాడు స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్.

యుగంధర్ నవ్వి వూరుకున్నాడు.

''యు నో వెరీ వెల్ ది రూల్స్ ఆఫ్ ది గేమ్. మీరు పాకిస్తాన్‌లో అడుగుపెట్టిన మరుక్షణం నించీ ఏది చేసినా మీ స్వంత బాధ్యతమీదే చేస్తారు. మా డిపార్టుమెంటు కాని, మన ప్రభుత్వం కాని, పాకిస్తాన్‌లో వున్న మన రాయబారికాని, ఆ కార్యాలయం కాని మీకు ఏ విధంగానూ సహాయపడదు. మీరు సహాయం అడగకూడదు. మీరేదయినా చిక్కుల్లో ఇరుక్కుంటే ఇప్పుడే హెచ్చరిస్తున్నాను. 'మాకేమీ తెలియదు' అంటుంది మన ప్రభుత్వం. ఒక వేళ ఏదయినా వార్త అతి ముఖ్యమైనది మాకు అందచేయాలంటే జ్ఞాపకం వుంచుకోండి. మరీ అవసరమైతే మీ కోడ్ ఎక్స్, నెం 808. ఈ కోడ్ నెంబర్ ఉపయోగించి, కోడ్ ఏ1 - ఏ 26 ఉపయోగించండి'' అన్నాడు బండార్కర్.

''థాంక్స్ మిస్టర్ బండార్కర్. వస్తాను'' అని లేచి నిలబడ్డాడు యుగంధర్.

''విష్ యు గుడ్‌లక్ యుగంధర్'' అని బండార్కర్ షేక్ హేండ్ యిచ్చాడు.

''నేను, రాజూ వెళతాము. నువ్వు రావడం చాలా అనవసరం కాత్యా'' అన్నాడు డిటెక్టివ్ యుగంధర్.

''అనవసరం అంటే నేను ఒప్పుకోను. ఒకొక్కప్పుడు ఆడది చెయ్యగలిగే పనులే వుంటాయి. మీకు ఆ దేశంలో సహాయపడే స్త్రీ ఎక్కడ దొరుకుతుంది?'' అన్నది కాత్యా.

"చాలా ప్రమాదం. పాకిస్థాన్ చైనా దేశాలు చాలా స్నేహంగా వున్నాయి. నువ్వు పాకిస్తాన్ వారికి దొరికితే నిన్ను చైనా ప్రభుత్వానికి ఒప్పచెపుతారు"

"ఈ దేశంలో వున్నా ఏ చీకటిలోంచో ఏ మారుమూలనించో ఏ చైనా గూఢచారో నన్ను కాల్చి చంపే ప్రమాదం వుండనే వుంది. ప్రమాదం అనేది నాకు నీడలా వుండిపోతుంది. ఈ జీవితమంతా" అన్నది కాత్యా నవ్వుతూ.

"ఆల్ రైట్ - నీతో చర్చించి ప్రయోజనం లేదు. ప్లాన్ ఆఫ్ ఆక్షన్ ఆలోచిద్దాం" అన్నాడు యుగంధర్. "ముగ్గురం కలిసి వెళదామా? విడివిడిగానా?" అడిగాడు రాజు.

"కలిసి వెళ్ళామంటే దొరికిపోతాం. విడివిడిగానే వెళ్ళాలి. ఇవ్వాళ 22 తేదీ. జ్ఞాపకముంచుకోండి. డిసెంబర్ మూడో తేదీ రావల్పిండిలో మనం ముగ్గురం ఒక చోట కలుసుకుందాం. ముగ్గురం మన మన దర్యాప్తు విడివిడిగా చేద్దాం. రావల్పిండిలో ప్రభుత్వ కేంద్ర కార్యాలయం వెనకవైపు మహమ్మదాలీ జిన్నా పార్కు చాలా విశాలమైనది ఒకటి వుంది. డిసెంబర్ 3 వ తేదీన జిన్నా పార్కులో స్విమ్మింగ్ పూల్‌కి సాయంకాలం రండి మీరిద్దరూ. ఏ కారణాలవల్లనైనా 3 వ తేదీ రాలేకపోతే 4వ తేదో, 5వ తేదో రెండు రోజులూ అదే సమయానికి నేను అక్కడికి వస్తాను. ఆ మూడురోజులూ రాలేకపోతే ఏదో ప్రమాదం జరిగిందని నిశ్చయించుకుంటాను. చేతనయితే తెలిస్తే సహాయానికి వస్తాను. కానీ నేను సహాయానికి రాగలనని మాత్రం ఆశించకండి" అన్నాడు యుగంధర్.

"ఆల్‌రైట్ మనం మళ్ళీ డిసెంబర్ 3వ తేదీ కలుసుకుంటాం" అన్నాడు రాజు.

## 4

విమానం టర్కీ దేశపు ముఖ్య నగరం అంకారా విమానాశ్రయంలో దిగింది. ఒక ముసలతను అతి కష్టంతో కూర్చున్న సీటులోంచి లేస్తున్నాడు. ఏర్ హోస్టెస్ అతని చెయ్యి పట్టుకుని "షల్ ఐ హెల్ప్ యు" అడిగింది.

"థాంక్ యు డియర్" అని ఆమె భుజం మీద చెయ్యివేసి లేచి నిలబడ్డాడు ఆ ముసలతను. నెరసిన చిన్న పిల్లిగడ్డం, దట్టమైన కనుబొమలు, ఫుల్ సూటు, ఫెల్ట్ హేట్, చేతిలో కర్ర, ఆజానుబాహువు, వయస్సువల్ల బాగా వొంగిపోయాడు. హోస్టెస్ మెట్లవరకు సహాయం వెళ్ళింది ఆ ముసలతనికి. అతను నెమ్మదిగా మెట్లు దిగి ఏర్‌పోర్ట్ బిల్డింగ్ వైపు నడిచాడు.

ప్రయాణీకులు ఎవరూ అతని విషయం పట్టించుకోలేదు. కస్టమ్స్ లాంఛనాలు ముగించుకుని, టాక్సీ ఎక్కాడు సామానుతో.

"హోటల్ కుమ్రూ" డ్రయివర్‌కి చెప్పాడు. ముప్పావుగంట తర్వాత హోటల్ కుమ్రూ ముందు ఆగింది టాక్సీ.

"రూమ్ రిజర్వ్ చేసుకున్నారా? మీ పేరు?" అడిగాడు హోటల్ రెసెప్షనిస్ట్.

"రిజర్వ్ చేసుకోలేదు. నాకు సింగిల్ రూం కావాలి" అన్నాడు ముసలతను.

"క్షణం వుండండి. ఖాళీ వుందో లేదో చూసి చెపుతాను"

పది నిమిషాల తర్వాత "యు ఆర్ లక్కీ సార్. ఇప్పుడే ఒక గది ఖాళీ అయింది" అంటూ రిజిష్టర్ యిచ్చాడు.

"వెరీగుడ్" అంటూ ముసలతను రిజిష్టర్లో తన పేరు "హసన్ ఆలీ, మర్చంట్, బొంబాయి, ఇండియా" అని వ్రాసి సంతకం పెట్టి, పర్సు తీయబోయాడు.

"అవసరం లేదు సార్. మీరు ఖాళీ చేసేటప్పుడు బిల్ యివ్వవచ్చు" అన్నాడు రిసెప్షనిస్ట్. రూమ్ బాయ్ హసన్ ఆలీని గదికి తీసుకెళ్ళాడు. సామాను బల్లమీద పెట్టి, "లంచ్ సర్?" అడిగాడు.

"నో నో డైనింగ్ రూంకి వస్తాను" అన్నాడు. బట్టలు మార్చుకున్నాడు హసన్ ఆలీ. అరగంట తర్వాత డైనింగ్ రూంకి వెళ్ళి, భోజనం చేసి, వీధిలోకి వెళ్ళాడు. టాక్సీ ఎక్కి "బీగం బజార్" అన్నాడు డ్రయివర్‌తో. బీగం బజార్లో ఒక పెద్ద బట్టల దుకాణం ముందు టాక్సీ ఆపించి డబ్బు యిచ్చి పంపేసి, లోపలికి వెళ్ళాడు.

"యస్ సర్. ప్లీజ్ కమ్ యిన్" అంటూ షాప్ అసిస్టెంటు ఆహ్వానించాడు.

"మీ ప్రొప్రయిటర్ వున్నారా?" అడిగాడు హసన్ ఆలీ.

"మీకు ఆయనతో ఏం పని?"

"నేను బొంబాయినించి వచ్చాను. కొన్ని బట్టల మిల్లుల తరపున."

"అయితే మేనేజర్‌ని కలుసుకోండి."

"నేను. ప్రొప్రయిటర్ స్నేహితులం. ఎప్పుడూ ఆయనతోనే మాట్లాడుతాను. ప్లీజ్ కార్డు యివ్వండి" అన్నాడు హసన్ ఆలీ. అయిదు నిమిషాల తర్వాత "ప్రొప్రయిటర్ రమ్మన్నారు" అన్నాడు అసిస్టెంట్.

**అది చిన్న ఏర్** కండిషన్డు గది. తలుపు తెరిచి లోపలికి వెళ్ళి తలుపు మూశాడు హసన్ ఆలీ.

"కమిన్ మిస్టర్ హసన్ ఆలీ. మనం స్నేహితులం అని చెప్పారుట క్షమించాలి. నాకు జ్ఞాపకం "

హసన్ ఆలీ నవ్వాడు. "హసన్ ఆలీ అనే అతను మీకు పరిచయం వుండడు."

"అంటే ఎవరు మీరు?" అడిగాడు ఆ షాపు ప్రొప్రయిటర్ కాస్త కంగారుతో.

"మిస్టర్ ఇమ్‌తియాజ్ - కంగారు పడకండి. నేను మీకు స్నేహితుణ్ణి" అంటూ ఒక కాయితం తీసి, దానిమీద 'డిటెక్టివ్ యుగంధర్' అని వ్రాసి ఆ కాయితం ఇమ్‌తియాజ్‌కి యిచ్చి, "చింపి పారేయండి" అన్నాడు.

ఇమ్‌తియాజ్ చూసి, ఆశ్చర్యంతో "నమ్మలేకుండా వున్నాను. రూపమూ, భాషా, ఉచ్చారణ, గొంతు చూపు కూడా ఎలా మార్చేశారు?" అడిగాడు.

యుగంధర్ నవ్వి "ఆ నేర్పు మాకు చాలా అవసరం. ఎలా వున్నారు? వ్యాపారం ఎలా వుంది? ఈ మధ్య మీరు మా దేశం రానేలేదు" అన్నాడు యుగంధర్.

"వ్యాపారం బాగానే వుంది. ఏదీ యిక్కడ పనులతో సరిపోతోంది. అంతేకాక యీ మధ్య మా ప్రభుత్వం కొన్ని నిర్బంధాలు పెట్టింది. వీలయినంతవరకు, సరుకు పశ్చిమ పాకిస్తాన్‌నించే కొనమంటోంది. అందువల్ల తరచు కరాచీ, లాహోర్, రావల్పిండి వెళుతున్నాను. ఇంతకీ మీరు ఎప్పుడు వచ్చారు? ఈ మారువేషం ఎందుకు?" అడిగాడు ఇమ్‌తియాజ్.

"ఇప్పుడే రెండు గంటల క్రితం దిగాను. హోటల్లో సామాను దింపి భోజనం చేసి తిన్నగా యిక్కడికి వచ్చాను. నాకు ఏ సహాయం కావలసినా మీరు చేస్తానని అన్నారు. అది జ్ఞాపకం పెట్టుకుని వచ్చాను" అన్నాడు యుగంధర్.

"ఐ యామ్ వెరీ గ్లాడ్ నాకు బొంబాయిలో మీరు చేసిన సహాయం ఎన్నటికీ మర్చిపోను. అప్పుడు మీరు సమయానికి వచ్చి వుండకపోతే ఆ పాకిస్థాన్ గూఢచారులు నన్ను చంపేసేవారే."

"అవును. పాకిస్థాన్ గూఢచారిగా చాలాకాలం పనిచేసితన ప్రభుత్వం అవలంబిస్తున్న విధానా హర్షించలేక భారతదేశంలో ఆశ్రయం కోరిన పాకిస్థాన్ గూఢచారికీ మీకూ రూపంలో చాలా పోలికలుండడం మీ దురదృష్టం" అన్నాడు యుగంధర్.

"మీకు కావలసిన సహాయం ఏమిటీ?" అడగండి. చెయ్యడానికి కాచుకున్నాను.

"నేను పాకిస్థాన్ వెళ్ళాలి. అక్కడ కొన్నిరోజులుండాలి. అధికారులతో సన్నిహితం ఏర్పడాలి. నేను భారతీయుణ్ణి అని కాని, డిటెక్టివ్ యుగంధర్‌ని అని కానీ ఎవరికీ తెలియకూడదు. మీరు సహాయం చెయ్యగలరా?" అడిగాడు యుగంధర్.

"ఇమ్‌తియాజ్ మొహంలో మార్పు వచ్చింది. "యుగంధర్ మా ప్రభుత్వం, పాకిస్థాన్ ప్రభుత్వంతో చాలా స్నేహ సంబంధాలు పెంచుకున్నది. పాకిస్థాన్ ప్రభుత్వానికి ద్రోహం చెయ్యడానికి నేను మీకు సహాయపడితే ఆ విషయం బయటపడితే మరుక్షణం నా ప్రాణం ఈ అగ్గిపుల్లతో సమానం" అన్నాడు ఇమ్‌తియాజ్

"అవును. ఆ విషయం నాకు తెలుసు. నేను భారతీయుణ్ణని కాని, డిటెక్టివ్‌ని అని కాని బయటపడకుండా జాగ్రత్త పడతాను.

"యుగంధర్ నేను చెయ్యగలిగిన సహాయం ఏమిటో ముందు చెపుతాను వినండి. పాకిస్థాన్, మేము కలిసి ఒక పెద్ద అధునాతనమైన బట్టల మిల్లు కడుతున్నాం. ఇందులో నా పెట్టుబడి చాలా వుంది. పాకిస్థాన్ వ్యాపారస్థుల పెట్టుబడి చాలా వుంది. మా ప్రభుత్వాల సహాయమూ వుంది. కనుక మా పార్టనర్ పాకిస్థాన్‌లోకల్లా ధనికుడూ, పరపతి కలవాడు అయిన నూర్‌మియాకి ఉత్తరం యివ్వగలను. మీరు టర్కీలో ఒక వ్యాపారస్థుడనీ మోటారు కార్ల ఫాక్టరీ పెట్టడానికి ప్రయత్నిస్తున్నారనీ పెట్టుబడి సహాయం కావాలనీ మాట్లాడడానికి వస్తున్నారనీ నాకు స్నేహితులనీ, పాకిస్థాన్ ప్రభుత్వం మినిస్టరీ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ డెవలప్‌మెంట్ చీఫ్ సెక్రటరీ సులీద్దీన్‌కి ఉత్తరం ఇవ్వగలను. అంతేకాదు. నా పెద్ద కొడుకు టర్కిష్ ఆర్మీలో కమాండర్. బహుశా కొద్ది రోజులలో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అవుతాడు. అతనినించి పాకిస్థాన్ ఆర్మీ కమాండర్ టిక్కాఖాన్‌కి ఒక ఉత్తరం యిప్పించగలను. వాళ్ళు ఇద్దరూ స్నేహితులు."

"వెరీ వెరీ గుడ్ అంతకన్నా నాకేం కావాలి?" అన్నాడు యుగంధర్.

"కానీ యుగంధర్ మీరు పాకిస్థాన్‌కి ఎందుకు వెళుతున్నారో మీరు నా ప్రాణానికి భయపడి కాదు నేను జంకుతున్నది. టర్కిష్ ప్రభుత్వంలో మా కుటుంబానికి చాలా పరపతి వున్నది. నేను తప్పు చేస్తే నా కొడుకులు నా తమ్ముళ్ళు అందరూ కష్టాలపాలవుతారు. కనుక పాకిస్థాన్‌కి మీరు వెళ్ళడానికి గల కారణం చెప్పండి. అది విన్న తర్వాత మీకు సహాయం చెయ్యగలనో లేనో చెపుతాను" అన్నాడు ఇమ్‌తియాజ్.

యుగంధర్ అయిదు నిమిషాలు ఆలోచించాడు.

"మీరు ఒకవేళ సహాయం చెయ్యడానికి అంగీకరించకపోతే నే చెప్పిన విషయాలు మర్చిపోవాలి."

"నమ్మి మీరు నాకు చెప్పే విషయాలు యెవరికీ చెప్పను" అన్నాడు ఇమ్‌తియాజ్. యుగంధర్ తను పాకిస్థాన్‌కి వెళ్ళడానికి గల కారణం వివరంగా చెప్పాడు.

"థాంక్ గాడ్ ఇప్పుడు నా మనస్సు కుదుటపడింది యుగంధర్. పాకిస్థాన్ సైనికాధికారులు, తూర్పు బెంగాలులో ముస్లిమ్లు పైన, హిందువుల పైన జరుపుతున్న హింసాకాండ గురించి మాకు తెలుసు. పాకిస్థాన్ తూర్పు బెంగాలుని తన బానిసదేశంగా వుంచుకోడానికి చేస్తున్న ప్రయత్నమూ మాకు తెలుసు. షేఖ్ మజిబూర్ రహమాన్, ఆయన పార్టీ, అవామీలీగ్

పట్ల మాకు సానుభూతి వుంది. మీ ప్రయత్నానికి నేను నా శాయశక్తులా సహాయపడతాను. ఎటొచ్చీ భగవంతుడు అలా జరగకుండా మిమ్మల్ని కాపాడాలి. మీరు పాకిస్థాన్ అధికారులకి చిక్కిపోయి, నిజం బయటపడితే మీరు నన్నూ, నా కొడుకునీ కూడా మోసం చేశారనీ, మీరు భారతదేశ గూఢచారని మాకు తెలియదనీ చెపుతాను'' అన్నాడు ఇమ్‌తియాజ్.

5

రాత్రి పది గంటలయింది. వీధిలో జనసమ్మర్దం బాగా తగ్గింది. తను బసచేసిన హోటల్లోంచి రాజు వీధిలోకి వచ్చాడు. నిమిషం పాటు వీధిలో అటూ ఇటూ చూసి, చకచకా నడవడం మొదలు పెట్టాడు.

అది రావల్పిండి. పాకిస్థాన్ ముఖ్యనగరం. రాజుకి ఆ వూరితో పూర్వ పరిచయం వుంది. అందుకే యెవర్నీ దారి అడగనవసరం లేకుండా బయలుదేరాడు. బజారు వీధి దాటి, నివాస గృహాలు వుండే ప్రాంతాలకి వెళ్ళాడు. అది హౌసింగ్ సొసైటీ కాలనీ. ఇళ్ళన్నీ ఒకేరకంగా వున్నాయి. మెయిన్‌రోడ్ మీద కొంతదూరం వెళ్ళి, నాలుగవ క్రాస్‌రోడ్‌లో తిరిగాడు. రెండవ యింటిముందు ఆగాడు. లోపల దీపాలు వెలుగుతున్నాయి.

కాలింగ్‌బెల్ నొక్కాడు. 'ఎవరు'? లోపల్నించి ఒక స్త్రీ ప్రశ్న.

''మిస్టర్ ఎడ్వర్డ్ ఉన్నారా?'' అడిగాడూ రాజు.

''ఉన్నారు'' అంటూ తలుపు తెరిచింది పాతికేళ్ళ స్త్రీ.

మూడేళ్ళ కుర్రాడు ఆమె కాళ్ళని పట్టుకుని వేళ్ళాడుతున్నాడు.

''మీ పేరు?'' అడిగింది.

''స్నేహితుణ్ణి - పేరు చెపితే గుర్తుపట్టరు. చాలాకాలం అయింది కలుసుకుని.''

''ఎవరు?'' లోపల్నించి పురుష కంఠం వినిపించింది.

''మీ కోసం స్నేహితులట'' అన్నదామె తలుపుకి అడ్డం తొలగి. అడుగుల చప్పుడు .. లోపల తలుపు తెరిచిన చప్పుడు ఎడ్వర్డు వచ్చాడు. రాజుని చూసి నిర్ఘాంతపోయి, నిమిషం పాటు నిశ్చలంగా వుండిపోయి ''యు...యు...వాట్ ఎ ఫెల్లో యు ఆర్. ఇదా సమయం నువ్వు యీ దేశానికి రావడానికి?'' అన్నాడు.

రాజు 'ఉష్' అన్నాడు పెదిమలమీద వేలు పెట్టుకుని.

''ఆల్ రైట్. రా లోపలికి రా, తలుపు వెయ్యి. నేను భోజనానికి కూర్చుంటున్నాను రా, ఇద్దరం కలిసి భోజనం చేద్దాం'' అని తన భార్యవేపు తిరిగి ''ఏం అలా మొహం వేలాడేశావ్? చాలదా? ఉన్నది సర్దుకుంటాంలే యిద్దరం. నాకు చాలా ఆత్మీయుడు ఇతను'' అని రాజు చెయ్యి పట్టుకుని నువ్వు చూడలేదు కదూ వాడే మా ప్రిన్స్ ఆఫ్ వేల్స్. ఒక్కడే'' అన్నాడు కొడుకుని ఎత్తుకుని. భోజనానికి కూర్చున్నారు రాజు, ఎడ్వర్డు.

''ఇప్పుడు చెప్పు ఎప్పుడు వచ్చావు? ఎందుకు వచ్చావు? నీకు బతకాలని లేదా? యీ రెండు దేశాల మధ్య పచ్చి గడ్డి వేస్తే భగ్గుమని మండే రోజులు ఇవి. సరిహద్దుల మీద సైన్యాలు తుపాకులు గురిపెట్టుకుని కూర్చున్నారు. ఏ క్షణాన్నయినా..''

''ఆపు ..ఆపు అవన్నీ నాకు తెలుసు. చాలా ముఖ్యమైన పనుండి వచ్చాను.

''ఎందుకు వచ్చావో చెప్పు?'' అడిగాడు ఎడ్వర్డు.

''మనం కలుసుకుని అప్పుడే అయిదేళ్ళయింది. నువ్వు పెళ్ళి చేసుకున్నావని కానీ, నీకు కొడుకని కానీ నాకు తెలియనే తెలియదు'' అన్నాడు రాజు.

''అది సరేలే. నువ్వు వచ్చిన పనేమిటో చెప్పు'' పురమాయించాడు ఎడ్వర్డు.

''ఒక పనిమీద వచ్చినమాట నిజం. నీ సహాయం అడుగుదామని వచ్చాను. కాని నువ్వు ఇప్పుడు ఒక యింటివాడయ్యావు. నిన్ను ఇటువంటి విషయాల్లోకి దింపడం న్యాయంకాదు. అందువల్ల చెప్పదలచుకోలేదు'' అన్నాడు రాజు.

''డోంట్ బి ఏ ఫూల్, నేను జర్నలిస్టుని. పెళ్ళి చేసుకున్నంత మాత్రాన ఒక కొడుకు పుట్టినంత మాత్రాన పరిస్థితి ఏమీ మారలేదు.''

''చాలా డేంజరస్.''

''మై డియర్ రాజూ. పదిహేనేళ్ళుగా మనం స్నేహితులం, నా తత్వం నీకు తెలుసు''

''అలాకాదు. నువ్వు పాకిస్తాన్ యువతిని పెళ్ళి చేసుకున్నావు.''

''అదా! అయితేనేం నన్ను పెళ్ళి చేసుకోవడంతో నా భార్య ముంతాజ్ కూడా బ్రిటిష్ పౌరురాలయింది. కనుక ఏ యిబ్బందీ లేదు మాకు. అంతగా అయితే మమ్మల్నీ దేశంలోంచి పొమ్మంటారు అంతే''

''అయితే చెపుతాను'' అంటూ రాజు వివరంగా తను వచ్చినపని చెప్పాడు.

''షేఖ్ ముజిబూర్ ఎక్కడ వున్నారో తెలుసుకోవడానికి యిప్పటికి ఆరునెలలుగా నేను ప్రయత్నిస్తూనే ఉన్నాను. రహస్యంగా వుంచారు'' అన్నాడు ఎడ్వర్డు.

రాజు అయిదు నిమిషాలు ఆలోచించి, ''జర్నలిస్టుగా నాకు'' అంటున్నాడు.

''అదెంతసేపు మా న్యూస్ ఏజన్సీలో నీకు వెంటనే ఉద్యోగం యివ్వగలను. ఎటొచ్చీ నువ్వు భారతీయుడవని కాకుండా, ఇంకొక దేశస్థుడవయినట్టు కాయితాలు''

''ఓ యస్ మలయాదేశస్థుడిగా నిరూపించే కాయితాలున్నాయి నా దగ్గర.''

''దటీజ్ ఆల్ రైట్. కాని ఒక విషయం అడుగుతాను. నేను కనుక్కోలేని విషయాన్ని నువ్వు ఎలా కనుక్కుంటావు రాజూ''

''మైడియర్ ఎడ్వర్డు. నేను శిక్షణ పొందిన డిటెక్టివ్‌నని మర్చిపోక'' అన్నాడు రాజు.

''సరే చూద్దాం. రేపట్నించి నువ్వు ఇంటర్నేషనల్ న్యూస్ ఏజన్సీ రిపోర్టర్. పొద్దున్నే నీకు ఎప్పాయింట్‌మెంట్ ఆర్డరు యిస్తాను'' అన్నాడు ఎడ్వర్డు.

6

''గదా! బస చేసేందుకా? ఇక్కడా? ఐ యామ్ సారీ. ఖాళీ లేదు'' అన్నది హోటల్ యూనివర్సల్ యజమానురాలు మిస్ పోలీ.

కాత్యా చిన్న నవ్వు నవ్వింది.

''అవును. అలా అంటారని మేజర్ చెప్పారు.''

''ఎవరా మేజర్?'' అడిగింది పోలీ.

"ఇప్పుడు ఆయన మేజర్ కాదనుకుంటాను. ఇంకా పెద్ద రేంక్. ఆయన పేరు చెప్పడానికి వీల్లేదు. గదిలేదంటే వెళ్ళిపోతాను" అన్నది కాత్యా వెనక్కి తిరుగుతూ.

"తొందరపడతారెందుకు? మాట్లాడదాం రండి" అంటూ ఒక గదిలోకి తీసుకు వెళ్ళింది కాత్యాని.

"మీ పేరేమిటన్నారు?" అడిగింది పోలీ.

"నా పేరు టీనా" అన్నది కాత్యా.

"ఎక్కడ్నించి వస్తున్నారు?"

"హాంగ్‌కాంగ్."

"ఏ దేశస్తులు? ఏ జాతి?"

కాత్యా విసుగ్గా చూసింది. "నాకు దేశంలేదు. జాతిలేదు. నాన్న బ్రిటిష్. అమ్మ చైనీస్."

"ఈ దేశం ఎందుకు వచ్చారు?"

"బతకడానికి. ఈ ఊరికి వచ్చి, మీ హోటల్‌కి వస్తే మీరు గది యిస్తారనీ, ఈ దేశంలో చాలా సుఖంగా వుండవచ్చుననీ మేజర్ చెప్పారు."

"మా హోటలు గురించీ, నా గురించీ యింకేం చెప్పారు?" అడిగింది పోలీ.

"అంతే. అంతకన్నా ఏమీ చెప్పలేదు. నా మీద మీకేదో అనుమానంగా వుంది. హాంగ్‌కాంగ్‌లో నేను ది ఓరియంటల్ ప్లెజర్ హౌస్‌లో వుండేదాన్ని. అర్ధమైందా?" అడిగింది కాత్యా.

మిస్ పోలీ కాత్యాని పరీక్షగా చూస్తోంది. సన్నని నడుం. వొంపులు తిరిగిన వొళ్ళు. నున్నని మెడ, తడిగా ఎర్రగా వున్న పెదిమలు, నిండు బుగ్గలు. మత్తుగా వున్న కళ్ళు. అలలు అలలుగా భుజాలమీదికి పడుతున్న కురులు.

"ఏమిటీ పరీక్ష?" అడిగింది కాత్యా.

"ఆశ్చర్యం ప్లెజర్ హౌస్‌లో వున్నానంటున్నావ్. నీ వొళ్ళు కొంచెం కూడా నలగలేదు. నేను చూడలేదు సుమా నీ అంత అందమైన ఆడదాన్ని. నిన్ను చూస్తే నా కస్టమర్స్‌కి పిచ్చెక్కుతుంది" అన్నది పోలీ.

"థాంక్స్" అన్నది కాత్యా.

"ఇది అందరికీ అందుబాటులో వుండే చోటు కాదు. ఇక్కడికి పెద్ద పెద్ద ఆర్మీ ఆఫీసర్స్ వస్తారు. కనుక సెక్యూరిటీ చాలా వుంది. ఆ మేజర్ ఎవరో చెబితే కాని"

"నిజం చెప్పాలంటే ఆ మేజర్ ఎవరో నాకు తెలియదు. ఆయనతో నా పరిచయం ఒక్క రాత్రి అంతే."

"అలాగా నీకు ఈ హోటలు విషయం ఎందుకు చెప్పాడు? సరే సాయంకాలం వరకు నువ్విక్కడే వుండు. ఒక ఆర్మీ ఆఫీసర్ వస్తారు, నీతో మాట్లాడతారు నిన్ను యీ హోటలులో వుండనీయమంటే ఉండనిస్తాను."

"ఒకవేళ వుండనిస్తే షరతులు, వ్యాపార నిబంధనలు ఏమిటి?" అడిగింది కాత్యా.

"సగానికి సగం. రొక్కం రూపంలో వచ్చినా వస్తువు రూపంలో వచ్చినా, నువ్వూ నేనూ సమానంగా పంచుకోవాలి" అన్నది పోలీ.

కాత్యా తల ఊపింది.

యుగంధర్ టాక్సీ దిగి అక్కడే నిల్చుని, దీపాలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఆ యింటివైపు చూశాడు. లీలగా సంగీతం వినిపిస్తోంది. అప్పుడప్పుడు నవ్వులు.

రావల్పిండిలో దిగగానే యుగంధర్ నూర్‌మియాను కలుసుకున్నాడు. ఇమ్‌తియాజ్ యిచ్చిన ఉత్తరం చదివి యుగంధర్‌ని కావలించుకున్నాడు నూర్‌మియా.

''ఇమ్‌తియాజ్ నాకు ఆప్తుడు. చెప్పండి. నేను మీ దాసుణ్ణి'' అన్నాడు నూర్‌మియా.

''పాకిస్తాన్ ప్రభుత్వంతోనూ పాకిస్తాన్ పారిశ్రామిక వేత్తలతోనూ కలిసి అంకారాలో కొన్ని భారీ పరిశ్రమలు స్థాపించాలని నా ఉద్దేశం'' చెప్పాడు యుగంధర్.

''వెరి వెరీ గుడ్ మన ఇస్లామిక్ దేశాల మధ్య యిటువంటి ఆర్థిక సంబంధాలు పెంచుకుంటేనే, వెనకబడ్డ మన ముస్లిమ్ దేశాలు అభివృద్ధి చెందుతాయి. సాయంకాలం ఆరుగంటలకు మా యింట్లో పెద్ద పార్టీ వుంది తప్పకుండా రండి.''

''పార్టీ? ఎవరికి? ఎందుకు?'' అడిగాడూ యుగంధర్.

''మిస్టర్ సయ్యద్ ఆలీ'' అని యుగంధర్ చెయ్యి పట్టుకుని ''మేము ఓ యిరవైమందిమి ఉన్నాము. మా దేశం ఆర్థిక వ్యవస్థ అంతా మా ఇరవైమంది చేతుల్లోనే వుంది. మా సైనిక నాయకులు కూడా మా అనుమతి లేనిదే ఏమీ చేయరు. తూర్పు పాకిస్తాన్‌లో జరిగిన అలజడి గురించి చర్చించుకునేందుకు మా యింట్లో సమావేశమౌతున్నాం యివాళ. ప్రెసిడెంట్ యాహ్యాఖాన్, జనరల్ టిక్కాఖాన్, మరికొందరు సైనికాధికారులూ వస్తారు.''

''మీరు మీ దేశ వ్యవహారాల గురించి మాట్లాడుకుంటే నేనెందుకు?'' అన్నాడు యుగంధర్.

''మిస్టర్ సయ్యద్ ఆలీ. రాత్రి పన్నెండు గంటలవరకూ పార్టీ వుంది. కులాసాగా కబుర్లు చెప్పుకోవడం, తినడం, తాగడం అదీ అర్ధరాత్రి వరకూ కార్యక్రమం. ఆ తరువాత ఎప్పుడో వుంటుంది మా సమావేశం. మా దేశంలోని ముఖ్య పారిశ్రామిక వేత్తల్నీ, ప్రభుత్వోద్యోగుల్నీ కలుసుకోవచ్చు మీరు'' అన్నాడు నూర్‌మియా.

ఇప్పుడు సరిగ్గా ఆరుగంటలైంది. నూర్‌మియా ఇంటిముందు నిలుచున్నాడు యుగంధర్. సయ్యద్ ఆలీ అనే మారు పేరు పెట్టుకున్నాడు.

**చాలా జాగ్రత్తగా** రూపమూ, వేషమూ మార్చుకున్నాడు. తనను ఎవరూ గుర్తుపట్టలేరన్న ధైర్యం వుంది. అయినా ఎన్నడు లేని జంకు. ముఖాముఖిని యాహ్యాఖాన్‌ని కలుసుకుంటానన్న జంకు కాదు. తను పట్టుబడతాననే ప్రాణభయమూ లేదు. తను పట్టుబడితే, తను వచ్చిన పని?

''కమిన్! సుస్వాగతం మిస్టర్ సయ్యద్ ఆలీ'' రెండు చేతులూ పట్టుకుని యుగంధర్‌ని ఆహ్వానించాడు నూర్‌మియా. విస్కీ బ్రాందీ సీసాలు తెరుస్తూనే వున్నారు. గ్లాసులు నింపుతూనే వున్నారు. ఓ యాభై మంది వున్నారు ఆ హాల్లో.

అరగంట తరువాత సైరన్ వినిపించింది.

అందరూ మాట్లాడ్డం మానేశారు.

''ఏమైంది'' అడిగాడు యుగంధర్ తన పక్కనున్న అతన్ని.

''ప్రెసిడెంట్ యాహ్యాఖాన్ వస్తున్నారు'' అన్నాడతను.

బయట కార్లు ఆగిన శబ్దం. బూట్స్ చప్పుడు. ఇద్దరు సాయుధ సైనికులు వచ్చి గుమ్మానికి అటూ యిటూ నిలబడ్డారు. వారి వెనక యింకో యిద్దరు సైనికాధికారులు వచ్చి లోపల హాల్లో నిలబడ్డారు.

తర్వాత వచ్చాడు పాకిస్తాన్ ప్రెసిడెంట్ యాహ్యాఖాన్. ఆయన వెనకే వచ్చారు మరి కొందరు సైనికాధికారులు. అందరూ మళ్ళీ మాట్లాడ్డం ప్రారంభించారు. సైనికాధికారులూ, పారిశ్రామిక వేత్తలూ చాలా చనువుగా కబుర్లు చెప్పుకుంటున్నారు. యుగంధర్ పక్కగా నిలుచుని చూస్తున్నాడు, వింటున్నాడు.

"హిందుస్థాన్‌తో యుద్ధం తప్పదు" ఒకళ్ళు.

"తూర్పు పాకిస్తాన్‌ను కబళిద్దాం అని చూస్తున్నారు" మరొకళ్ళు.

"ఢిల్లీ ఎర్రకోటపై మన జెండా ఎగరవేయాలి" అన్నారు మరొకరు.

"ఇంకో పదిరోజుల్లో స్వయంగా తనే యుద్ధరంగానికి వెళ్తానని ప్రెసిడెంట్ చెప్పారు. ఇంకేముంది. ఉత్తర హిందూస్థానమంతా ఆక్రమించుకుంటాం, తూర్పు బెంగాలు, పశ్చిమ పాకిస్థాన్ అప్పుడు విడివిడిగా వుండవు" ఇలా మాట్లాడుకుంటున్నారు.

"మీ దేశానికి ఆ కష్టం తెచ్చిపెట్టిన ఆ విప్లవ నాయకుడు, అతని పేరేమిటి?" అడిగాడు తన పక్కనున్న ఒక సైనికాధికారిని యుగంధర్.

"షేక్ మజిబూర్ రెహమాన్. అతను విప్లవ నాయకుడు కాదు. దేశద్రోహి" అన్నాడా సైనికాధికారి.

"దేశద్రోహిని మా దేశంలో వెంటనే ఉరితీస్తాం. మీరెందుకు?"

"మేమూ ఉరితీస్తాం. ఎటొచ్చీ యీ షేక్ ఎన్నికల్లో గెలిచాడు గనుక, విచారణ అనేది జరిపించాలి."

"అయితే షేక్‌ని కోర్టులో హాజరు పరుస్తారన్నమాట" అన్నాడు యుగంధర్.

"మిలటరీ కోర్టులో. విచారణ జరిగే సమయాన ఎవరూ వెళ్ళడానికి వీల్లేదు."

ఇంతలో ఎవరో సైనికాధికారి యుగంధర్ దగ్గరకు వచ్చి, "ఐ యామ్ కర్నల్ హక్. మిమ్మల్ని ఎప్పుడో ఎక్కడో చూసినట్లు అనిపిస్తోంది" అన్నాడు.

యుగంధర్ చెయ్యి అందించి "గ్లాడ్ టు మీట్ యు. నా పేరు సయ్యద్ ఆలీ. నేను అంకారా నుంచి వచ్చాను. మనం అక్కడ కలుసుకున్నామేమో" అన్నాడు.

"అయ్యుండవచ్చు. చాలాసార్లు నేను అంకారా వచ్చాను. విదేశాలనుంచి వచ్చిన మీలాటి గొప్పవారికి అసలు విషయాలు చెప్పాలి. చెబితేనే మా దేశం పట్ల సానుభూతి చూపగలరు. షేక్ మజిబూర్ రహమాన్ గురించి ఏమో అడుగుతున్నారు"

"నేనేమీ అడగడం లేదు. వీరు చెప్తుంటే వింటున్నాను" అన్నాడు యుగంధర్.

"షేక్ మజిబూర్ రహ్మాన్ కేసు నా ఛార్జీలో వుంది. షేక్ దేశద్రోహి. పాకిస్తాన్‌ను రెండుగా విభజించాలని ప్రయత్నిస్తున్నాడు. ప్రభుత్వం మీద ఎదురు తిరగమని ప్రజల్ని రెచ్చగొడుతున్నాడు" అన్నాడు కర్నల్ హక్.

"అదే చెబుతున్నాను. మా దేశంలో యిలాంటి దేశద్రోహుల్ని తక్షణం ఉరి తీస్తాం."

"ఇప్పుడు యిక్కడి పరిస్థితి వేరు. షేక్‌కి ప్రజల ఆదరణ చాలా వుంది. కనుక చేతనయితే షేక్‌కి మనసు మార్చాలి. పాకిస్తాన్‌ను రెండుగా విభజించడం తప్పనీ, దేశద్రోహమనీ, ఇస్లామ్‌కే అపచారమనీ మీలాటివారు నలుగురు చెప్పగలిగితే ఎంత బాగుంటుంది."

"షేక్‌లాటి వాడికి నాలాటి సామాన్యుడు నీతులు చెప్పగలడా?" అన్నాడు యుగంధర్.

"మిస్టర్ సయ్యద్ ఆలీ. ఇస్లామ్ పేరుతో, అల్లా పేరుతో షేక్‌కి నచ్చ చెప్పి చూస్తారా?" అడిగాడు కర్నల్ హక్.

"ఆయన వింటారని నమ్మకం ఏమిటి?"

"ప్రయత్నించడంలో నష్టం ఏమిటి?" అంటూ యుగంధర్‌ని ఒక పక్కకు తీసుకెళ్ళాడు కర్నల్ హక్. "ఈ పార్టీ రాత్రంతా వుంటుంది. నిజానికి యిప్పుడే ప్రారంభమైంది. మనం వెళ్ళివద్దామా? దగ్గర్లోనే వున్నాడు షేక్."

"తొందరెందుకు? ఆలోచించి రేపో ఎల్లుండో" అంటున్నాడు యుగంధర్.

"ఒకవేళ మనం షేక్‌ని ఒప్పించగలిగితే, యీ రాత్రే షేక్‌ని యిక్కడికి పిల్చుకువచ్చి తూర్పు బెంగాల్ పాకిస్తాన్‌నించి విడిపోదని షేక్ ప్రకటిస్తే భారతదేశం నవ్వుల పాలవుతుందయ్యా" అన్నాడు హక్.

"సరే పదండి" అన్నాడు యుగంధర్.

ఇద్దరూ బయటకు వచ్చారు.

ఆర్మీకారు దగ్గరలోనే వుంది. కర్నల్ హక్, యుగంధర్ వెనుక సీటులో కూర్చున్నారు. పది నిముషాల తర్వాత కారు ఓ యింటిముందు ఆగింది.

"ఇదే యిల్లు, బయట ఎవరూ కాపలాలేరని ఆశ్చర్యపడుతున్నారా? అందరికీ తెలిసేందుకు బయట కాపలా ఎందుకు? లోపల కాపలా వున్నారు రండి" అంటూ తలుపు మీద కర్నల్ హక్ మునివేళ్ళతో కొట్టాడు. లోపల్నుంచి మళ్ళీ మునివేళ్ళతో ఎవరో టకటకా కొట్టారు.

జవాబుగా కర్నల్ మళ్ళీ తలుపు మీద కొట్టాడు. తలుపు తెరుచుకుంది. గుమ్మానికి చెరో పక్క తుపాకులు పట్టుకుని యిద్దరు సైనికులు కనిపించారు.

యుగంధర్, హక్ లోపలికి వెళ్ళారు.

మేడమీదికి వెళ్ళగానే ఒక గది తలుపు తెరిచి "కమిన్" అన్నాడు హక్ యుగంధర్ లోపలికి రాగానే తలుపు మూసేశాడు.

యుగంధర్ చుట్టూ చూశాడు. అది చిన్న గది. గది మధ్యన ఒక బండ బల్ల వెనక ఒక కుర్చీ, ఇంకెవ్వరూ లేరు. యుగంధర్ హక్ వైపు చూశాడు. కర్నల్ హక్ చిన్నగా నవ్వి బల్ల వెనక వున్న కుర్చీ పక్కకు లాగుతూ, "షేక్ ముజిబూర్ రహ్మాన్ కోసం చూస్తున్నారా? కూర్చోండి మిస్టర్ యుగంధర్ అన్నాడు.

"థాంక్యూ" అంటూ కూర్చున్నాడు యుగంధర్.

యుగంధర్ తుళ్ళిపడతాడనీ, భయంతో వొణికిపోతాడనీ ఆశించిన హక్ తనే ఆశ్చర్యపోయాడు. జేబులోంచి సిగరెట్ పేకెట్ తీసి యుగంధరుకూ ఒకటిచ్చి, తనొకటి తీసుకుని యిద్దరి సిగరెట్లూ వెలిగించి, "మీరు డిటెక్టివ్ యుగంధర్ అని నేను గ్రహించానని మీకు ముందే తెలుసా?" అడిగాడు.

యుగంధర్ తల ఊపాడు.

"అయితే కిక్కురుమనకుండా యిక్కడి కెందుకొచ్చారు? ఎదురు తిరగలేదెందుకు?"

"ప్రయోజనం ఉండదు కనుక."

"మిస్టర్ యుగంధర్ నిజంగా మీ ధైర్య సాహసాలని మెచ్చుకుంటున్నాను. మారు వేషంలో, మారు పేరుతో యిలా మా దేశంలోకి రావడానికి ఎంతో గుండె ధైర్యం కావాలి. మీ విషయం నాకు అరగంట క్రితమే తెలిసింది. లేకపోతే ఎయిర్‌పోర్ట్ దగ్గరే పట్టుకునేవాణ్ణి. మీరు సయ్యద్ ఆలీ కారనీ, డిటెక్టివ్ యుగంధర్ అనీ నాకెలా తెలిసిందో మీరు గ్రహించారా?" అడిగాడు కర్నల్ హక్.

"ఎలా తెలిస్తేనేం?" అన్నాడు యుగంధర్. కర్నల్ హక్ విరగబడి నవ్వాడు.

"అప్పుడే అంత నిస్పృహ? మారు వేషంలో చైనాలోకి వెళ్ళి చౌ - ఎన్ - లే కళ్ళల్లో కారం గొట్టి కాత్యా అనే అందమైన యువతిని బహుమానంగా తెచ్చుకున్న యుగంధర్‌కి టిబెట్‌లోంచి దలైలామాను విడిపించుకు వచ్చిన గొప్ప గూఢచారి యుగంధర్‌కి – ఘటికుడూ, అమోఘమైన తెలివైన వాడూ, గూఢచారుల్లోకల్లా గొప్పవాడూ అయినటువంటి యుగంధర్‌కి అప్పుడే నిస్పృహా? షేక్ మజిబూర్‌ని విడిపించి తీసుకువెళ్ళే ప్రయత్నం అప్పుడే మానుకుంటున్నారా?" అన్నాడు కర్నల్ హక్.

"అయితే, ఇమ్‌తియాజ్ పాకిస్థాన్ గూఢచారి అన్నమాట?" అన్నాడు యుగంధర్.

"ఈ విషయం చాలా ఆలస్యంగా గ్రహించారు" అంటూ హక్ ఒక మీట నొక్కాడు. మరుక్షణం తలుపు తెరుచుకుంది. ఇమ్‌తియాజ్ గదిలోకి వచ్చాడు. యుగంధర్ని చూసి, వెక్కిరింపుగా నవ్వి, "మిస్టర్ యుగంధర్ అవును. నేను పాకిస్థాన్ గూఢచారిని. ఆనాడు బొంబాయిలో మీరు నా ప్రాణం కాపాడ్డానికి కారణం మీ ఔదార్యంకన్నా, నా తెలివితేటలే అని అనుకోండి. పాకిస్థాన్ గూఢచారి పోలికలో వున్న టర్కిష్ పౌరుణ్ణి నేను అని మిమ్మల్ని నమ్మించి మోసం చేశాను ఆనాడు. మళ్ళీ మొన్న అంకారాలో ఇమ్‌తియాజ్ అనే ఒక టర్కిష్ పారిశ్రామికవేత్తనని నమ్మించాను. మహా మేధావి అయిన యుగంధర్‌ని రెండుసార్లు మోసం చేశాను."

"అవును మోసపోయాను. ఒప్పుకుంటున్నాను. ఫస్టు అండ్ సెకెండ్ రౌండ్సులో గెలుపు మీదే" అన్నాడు యుగంధర్.

"ఏమిటీ? మూడో రౌండు కూడా వుంటుందని ఆశిస్తున్నారా యుగంధర్? మీరు పొరబడుతున్నారు. మీరున్నది పాకిస్థాన్ నడిగడ్డిమీద. పాలాక్షుడు వచ్చినా మీ ప్రాణం కాపాడలేడు" కర్నల్ హక్ పిస్టల్ తీసి యుగంధర్ ఛాతీ మీద గురిపెట్టి, "ఖ్యాతి గాంచిన డిటెక్టివ్ యుగంధర్‌ను పట్టుకుని హతమార్చిన గౌరవం నాది. ఈశ్వరుణ్ణే తల్చుకుంటారో, అల్లానే తల్చుకుంటారో మీ యిష్టం. పది లెక్కపెడుతున్నా. ఒన్...టు...త్రీ..."

8

దాదాపు వందమంది పత్రికా ప్రతినిధులతో ప్రెస్ రూము కిటకిటలాడుతోంది. పాకిస్థాన్ ప్రెసిడెంటు అతి ముఖ్యమైన ప్రకటన చేస్తారని అంతమంది రిపోర్టర్లు అక్కడికి వచ్చారు.

"జెంటిల్‌మెన్ ఆఫ్ ది ప్రెస్" అంటూ యాహ్యాఖాన్ ప్రారంభించాడు. "తూర్పు పాకిస్థాన్‌లో బెంగాలీలు ప్రభుత్వంపై ఎదురు తిరిగారని, పాకిస్థాన్ నించి విడిపోయి సర్వస్వతంత్ర బంగ్లాదేశ్ నెలకొల్ప నిశ్చయించారని, హిందూస్థాన్ చేస్తున్న ప్రచారం అబద్ధం. హిందూస్థాన్ రౌడీలనీ, దుండగులనీ రహస్యంగా తూర్పు బెంగాల్‌లోకి పంపి, పాకిస్థాన్‌ని విచ్ఛిన్నం చేయాలనే దురుద్దేశంతో అలజడి లేవదీస్తోంది. అంతేకాక యిక్కడికీ పశ్చిమ పాకిస్థాన్‌కి కూడా, తన

గూఢచారులను పంపి గోతులు తవ్వడానికి ప్రయత్నిస్తోంది. మీకు ప్రపంచ పత్రికా ప్రతినిధులకు ఈ విషయం యీనాడు రుజువు చేయబోతున్నాం'' అని పక్కనున్న సైనికాధికారిని చూసి, ''తీసుకు రండి'' అన్నాడు.

రిపోర్టర్లందరూ ఊపిరి బిగబట్టి కళ్ళప్పగించి చూస్తున్నారు. ఆజానుబాహువయిన ఒక మనిషిని చెరొక చెయ్యి పట్టుకు తీసుకువచ్చారు ఇద్దరు మనుషులు. అతని చేతికి సంకెళ్ళున్నాయి. రిపోర్టర్లలో ఒకడుగా నిలబడ్డ రాజుకి గుండె ఆగిపోయినంత పనైంది, ఆ మనిషిని చూడగానే.

యాహ్యాఖాన్ మళ్ళీ ప్రారంభించాడు.

''ఇతనెవరో మీరు గుర్తుపట్టారా? ఇతని పేరు మీకు బాగా తెలిసుంటుంది. హిందూస్థాన్‌లో ఖ్యాతి గాంచిన డిటెక్టివ్. పేరు యుగంధర్. తరచూ హిందూస్థాన్ తరపున గూఢచారిగా వ్యవహరిస్తూ వుంటారు. పాకిస్థాన్ యింటెలిజెన్స్ డిపార్టుమెంట్ డైరెక్టర్ కర్నల్ హక్ స్వయంగా యుగంధర్ని పట్టుకున్నాడు. వివరాలు అతనే చెప్తాడు.''

కర్నల్ హక్ సెల్యూట్ చేసి, ''మిస్టర్ నూర్‌మియా యింట్లో పెద్ద పార్టీ జరిగింది. ఆ పార్టీకి ప్రెసిడెంట్ కూడా వెళ్ళారు. సయ్యద్ ఆలో అనే మారు పేరున యుగంధర్ మన దేశానికి వచ్చాడని మా ఏజెంటు ద్వారా తెలిసింది. వెంటనే నేను నూర్‌మియా యింటికి వెళ్ళాను. మజిబూర్ రహమాన్ గురించి అందర్నీ తరచి తరచి ప్రశ్నిస్తున్నాడు యుగంధర్. నేను పట్టుకుని బయటకు తీసుకువెళ్ళాను. ఇక తను పట్టుబడి పోయానని తెలిసిన తరవాత యీ యుగంధర్ యే పంటి సందులోనో దాచుకున్న విషపు మాత్రను కరకర నమిలేశాడు. వెంటనే డాక్టర్ని పిలిపించి ప్రథమ చికిత్స చేయించాను. ప్రాణం నిలబెట్టాను. ఇంకా మత్తుగానే వున్నాడు. అయినా ప్రశ్నలకి సమాధానం చెప్పగలడనుకుంటాను'' సంకెళ్ళతో నిలబడ్డ మనిషి వేపు తిరిగాడు. అతని కళ్ళు మూతలు పడుతున్నాయి. మూలుగుతున్నాడు.

''నీ పేరు చెప్పు. యుగంధరేనా?'' అడిగాడు హక్.

''అవును.'' ముద్దగా వున్నాయి అతని మాటలు.

''నువ్వు యీ దేశానికి ఎందుకు వచ్చావ్? షేక్ మజిబూర్ రహమాన్‌ని చంపడానికా?''

''అవును.''

''మా ప్రెసిడెంట్‌ని చంపడానికా?''

''అవును.''

''చంపి మా దేశంలో అల్లకల్లోలం కలగజేయడానికా?''

''అవును.''

''సారీ జెంటిల్‌మెన్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. సరిగా సమాధానం చెప్పలేకుండా వున్నాడు. మత్తు వదిలిన తరువాత యితన్ని మళ్ళీ మీ ముందు హాజరు పరుస్తాను'' అన్నాడు కర్నల్ హక్.

''చెప్పాను కదా రాజూ. ఈ దేశంలోకి రావడం చాలా మూర్ఖమైన పని'' అన్నాడు ఎడ్వర్డు.

ఎడ్వర్డు ఆఫీసులో ఎడ్వర్డూ, రాజూ మాట్లాడుతూ కూర్చున్నారు.

లాహోరునించి యిద్దరు ఆ రోజే రావల్పిండికి వచ్చారు. ప్రెస్ కాన్ఫరెన్స్‌కి వెళ్ళి వచ్చారు.

''యుగంధర్‌ని యిక్కడ వదిలేశా? వాట్ డు యు మీన్ బై దట్'' అన్నాడు రాజు.

"ఏం చేయగలవయ్యా నువ్వు? కర్నల్ హక్ యుగంధర్ని వేయికళ్ళతో కాచుకుని వుంటాడు. ప్రెసిడెంట్ భవనమున్న ఆవరణలో ఒక ఔట్‌హౌస్‌లో సైనిక కాపలాతో నిర్భంధించి వుంచారు. అక్కడ్నించి యుగంధర్ని ఎలా రక్షిస్తావ్?" అన్నాడు ఎడ్వర్డు.

"అవును. యుగంధర్ని అక్కడ్నుంచి విడిపించడం చాలా కష్టమని నేనూ వొప్పుకుంటాను."

"కష్టమంటావేమిటి? అది అసాధ్యం. మంత్రమో తంత్రమో తెలుసుంటే తప్ప. నువ్వు యెలకగానో, పిల్లిగానో మారి లోపలికి వెళ్తే తప్ప, యుగంధర్ని కలుసుకోలేవు."

"అవసరమైతే ఎలకగానో, పిల్లిగానో మారవలసిందే యుగంధర్ని నేనిక్కడ వదలి ఎలా వెళ్ళిపోగల్ను. సిల్లీగా మాట్లాడకు ఎడ్వర్డు" అన్నాడు రాజు.

9

"ఎస్" అంటూ కాత్యా రెండు తలుపులూ తీసింది.

"నాతోరా" అన్నది మిస్ పోలీ. కాత్యాని యింకో గదిలోకి తీసుకు వెళ్ళింది.

"ఈమె పేరు టీనా. కొత్తగా వచ్చిందీమె" మిస్ పోలీ ఏదో చెప్పబోతోంది.

కుర్చీలో కూర్చున్న సైనికాధికారి కాత్యాని పరీక్షగా చూసి, "పోలీ నువ్వెళ్ళు, నేను విచారిస్తాను" అన్నాడు.

పోలీ బయటకు వెళ్ళి తలుపులు మూసేసింది.

"నీ పేరు టీనా? బావుంది. నువ్వూ బాగున్నావు" అన్నాడు ఆ సైనికాధికారి, పెదిమలు తడిచేసుకుంటూ.

"థాంక్స్" అన్నది కాత్యా అతనికి దగ్గరగా జరుగుతూ.

"ఎవరో మేజర్ నీకు యీ హోటలు పేరు చెప్పాడట. అతని పేరు తెలియదన్నావట. పోనీ అతన్ని గుర్తుపట్టగలవా?"

"తప్పకుండా."

"అయితే ఈ ఆల్బమ్ చూడు" అన్నాడు, బల్లమీద వున్న ఒక పెద్ద ఫోటో ఆల్బమ్ చూపించి. కాత్యా చూస్తోంది. ఒక్కొక్క అట్టమీద ఆరుగురు సైనికాధికారుల ఫోటోలున్నాయి. అతని ఊపిరి ఆమె మెడమీద వెచ్చగా పడుతోంది.

"దయచేసి మీరు కాస్త దూరంగా నిలుచోండి" అన్నది కాత్యా.

అతను కోపంగా, "ఎందుకు? ఏమయింది?" అడిగాడు.

"ఇంత దగ్గరగా, ఇంత ఆకర్షణ, ఇంత అందం, మీ విగ్రహం. మీరు నిలబడి వుంటే నా మనస్సు ఈ ఫోటోల మీద నిలవడంలేదు."

"మరి దేనిమీద నిలుస్తోంది?" అడిగాడు.

వెనక్కి తిరిగి అతని కళ్ళల్లోకి చూసి నిట్టూర్చి, "మీ మీద" అంటూ కొద్దిగా అతని మీదకు వాలింది.

"డేమ్ దట్ మేజర్. వాడి విషయం తర్వాత చూడవచ్చు" అంటూ అతను కాత్యాని రెండు చేతుల్లో బిగించాడు. గట్టిగా కావలించుకుని, రెండు చేతుల్లో ఎత్తి, సోఫా కమ్ బెడ్ మీద పడేసి ఆత్రంగా ఆమె వొంటిమీద బట్టలని వొలవడం ప్రారంభించాడు.

"ఒక్క క్షణం."

"ఎందుకు?"

"తలుపు లోపల గడియపెట్టి వస్తాను" అంటూ అతని చేతుల్లోంచి తప్పించుకుని వెళ్ళి తలుపు గడియబెట్టి వచ్చి, అతన్ని నెమ్మదిగా వెనక్కి తోసి పక్కన కూర్చున్నది. అతని జుట్టు సవరిస్తూ, అతని ఛాతీమీద చెయ్యిబెట్టి, ముందుకు వొంగి అతన్ని లేతగా పెదిమలమీద ముద్దుపెట్టుకుంది. ఆమె పెదిమలను తన పెదిమలతో పట్టుకున్నాడు. వదలడంలేదు.

నిమిషం తర్వాత వదల్చుకుంది.

"మరీ ఊపిరాడకుండానా?" అంది నవ్వుతూ.

"తియ్యగా ఉన్నాయ్" అన్నాడు మత్తుగా నవ్వి.

"ఇప్పుడే చాక్లెట్ తిన్నాను."

"కాదు, నీ పెదిమల తీపి"

"అలాగా ఆవేశం ఎక్కితే అందరి ఆడవాళ్ళ పెదిమలు అలాగే వుంటాయ్."

"నువ్వు అందరి ఆడవాళ్ళలాంటిదానివి కావు. స్పెషల్. పోలీకి చెప్పాలి."

"ఏమని?"

"నిన్ను నాకే రిజర్వు చేసి వుంచమని. అడ్డమయిన మొగాడూ నీమీద చేతులు వేయడం నాకిష్టం లేదు."

"ఏమో మీకన్నా పెద్ద ఆఫీసరు వస్తే...?"

"డామిట్ నేనెవర్ననుకున్నావ్? జనరల్ టిక్కాఖాన్ని."

కాత్యా గుండె దడదడమన్నది. పాకిస్థాన్ సైనికాధికారుల్లో కల్లా క్రూరుడూ, ఘటికుడూ, తూర్పు బెంగాల్లో అమాయక ప్రజల్ని కొన్ని లక్షలమందిని చంపిన టిక్కాఖాన్ ఇతనేనా?

టిక్కాఖాన్ బద్ధకంగా కళ్ళు మూసుకున్నాడు. "ఏమిటీ నిద్ర? అప్పుడే ఇంకా" అంటూ ఆమె పెదిమల్ని అందించింది. అయినా అతను కళ్ళు తెరవలేదు. గాఢనిద్రలోకి వెళ్ళిపోయాడు. తట్టిలేపి చూసింది. అయినా అతను లేవలేదు.

కాత్యా నీళ్ళ గదిలోకి వెళ్ళి నోరు కడుక్కుంది శుభ్రంగా. తలుపు మూయడానికి వెళ్ళినపుడు కాత్యా, అతనికి కనిపించకుండా ఘాటైన నిద్రమందు నోట్లో పెట్టుకుంది. తడి చేసుకుని ఆ తడిని టిక్కాఖాన్ నోటికి అందించింది. అదే తియ్యగా ఉందన్నాడతను. ఇంకో అరగంటలో లేస్తాడు. అప్పుడేం చెయ్యాలి? టిక్కాఖాన్ లాంటి వాడి ఆదరణా, ఆపేక్ష సంపాదించుకునేందుకు ఇది మంచి అవకాశం. తన కార్యసాధనకి యితడు బాగా ఉపయోగపడతాడు. కానీ, తను చెల్లించుకోవాల్సిన రుసుము? అంటే, తన ఒళ్ళు అతనికి అప్ప చెప్పాలి. తల్చుకుంటేనే వొంటి మీద జెర్రులు ప్రాకుతున్నట్టుంది. యుగంధర్ కోసం, తాను వచ్చిన పని సఫలం కావటం కోసం, ఆ అసహ్యం దిగమింగుకుని టిక్కాఖాన్తో ప్రేమ కలాపం సాగించలా? సాగిస్తే, యీ రాక్షసుడి చేతులు తన వొంటిమీద పడ్డ తర్వాత తనంటే తనకే అసహ్యం వేస్తుందేమో, ఇంకా అరగంట ఉంటుంది ఎటూ తేల్చుకోవడానికి.

టిక్కా ఖాన్ మొహం చూస్తూ కూర్చుంది కాత్యా.

10

**"థేంక్యూ ఎడ్వర్డ్!** ఇంతవరకూ నువ్వు చేసిన సహాయం చాలు. ఇహ నువ్వెళ్ళు" అన్నాడు రాజు.

"వెళతాను. నువ్వు ప్రాధేయపడినా అర అంగుళం నీతో ముందుకురాను. తెలివైన వాడివి, అనుభవమున్న వాడివి. యుగంధర్ శత్రువులకి చిక్కిపోయాడనగానే నువ్వు మతి పోగొట్టుకున్నావ్. ఆత్మహత్య చేసుకుంటున్నావ్" అన్నాడు ఎడ్వర్డు.

ప్రెసిడెంటు భవనం తోటలో చెట్టుకింద నిలుచున్నారిద్దరూ. దూరానవున్న ఒక ఔట్‌హౌస్ వేపు చూస్తున్నాడు రాజు.

"చూడు రాజూ! తుపాకీలు గురిపెట్టి నిలుచున్నారు తలుపు దగ్గర. సైనికుల దరిదాపులకు వెళ్తే నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేస్తారు. నా మాట విని వెనక్కి తిరుగు" అన్నాడు ఎడ్వర్డ్ మళ్ళీ.

"యుగంధర్నిక్కడ పాకిస్తాన్ వాళ్ళ బందీగా వదలి నేను వెళ్ళనని లక్షసార్లు చెప్పాను. ఎడ్వర్డ్ నువ్వు వెళ్ళు. వీలుంటే తప్పక కలుసుకుంటాను" అన్నాడు రాజు.

ఎడ్వర్డ్ రాజు భుజం తట్టి "ఆల్ రైట్. విష్‌యు గుడ్‌లక్. గుడ్ బై" అంటూ వెళ్ళిపోయాడు.

యుగంధర్ని విడిపించే ప్రయత్నంలో తన ప్రాణం పోవచ్చు. ఈ విషయం రాజుకు తెలియకకాదు. శత్రువులు యుగంధర్ని నానా హింసలూ పెడతారు. రాజుకు యిదీ తెలుసు. తను యుగంధరున్న స్థితిలో వుంటే, యుగంధర్ తనని వదలి వెళ్ళిపోతాడా? ఎన్నడూ వెళ్ళడు.

ఐదు నిమిషాల తర్వాత, ఔట్‌హౌస్‌లోంచి బయటకు వచ్చాడు కర్నల్‌హక్. అతన్నికూడా యిద్దరు సైనికాధికారులు వున్నారు. రాజు చెట్ల వెనక నక్కి దాక్కున్నాడు. కర్నల్ హక్ ప్రెసిడెంట్ భవనంలోకి వెళ్ళేంతవరకూ కాచుకున్నాడు, చూస్తూ. తర్వాత ధైర్యంగా ఔట్‌హౌస్ వేపు నడిచాడు. తుపాకీలు పట్టుకున్న సెంట్రీలు అనుమానంగా చూశారు రాజుని. రాజు జేబులోనుంచి పత్రికా ప్రతినిధి ఐడెంటిఫికేషన్ కార్డు తీసి చూపించాడు వాళ్ళకి.

"కర్నల్ హక్ నాకు యింటర్వ్యూ యిస్తానన్నారు. లోపల కాచుకుని వుండమన్నారు" అన్నాడు రాజు.

"సారీ సర్. ఎవర్నీ లోపలికి వెళ్ళనివ్వవద్దని కర్నల్ ఆర్డర్స్" చెప్పాడు ఒక సెంట్రీ.

"బహుశా మీకు ఆర్డర్స్ అంతకు ముందు యిచ్చి వుంటారు. ప్రెసిడెంట్ భవనంలోకి వెళ్తూ నాతో యిప్పుడే చెప్పారు. తర్వాత కర్నల్ మిమ్మల్ని తిడతారు. సరే నేను వెళుతున్నాను" అని రాజు వెనక్కి తిరిగాడు.

"సార్! క్షణమాగండి." అన్నాడు ఓ సెంట్రీ.

సెంట్రీ లిద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకున్నారు.

"సరే వెళ్ళి ముందుగదిలో కూర్చోండి" అన్నాడు ఒక సెంట్రీ.

రాజు లోపలికి వెళ్తున్నాడు. తను వెళ్తున్నది పద్మవ్యూహంలోకా? మళ్ళీ తను ప్రాణాలతో బయటికి రాడా? రాకపోతే సరే. యుగంధర్‌తో పాటు తనూ.

లోపల హాల్లో యింకో సైనికాధికారి కూర్చుని వున్నాడు.

"నేను పత్రికా ప్రతినిధిని. కర్నల్ హక్ నన్ను వెయిట్ చెయ్యమన్నారు. హిందుస్తాన్ నుంచి వచ్చిన గూఢచారి యుగంధర్ని యింటర్వ్యూ చెయ్యడానికి" అన్నాడు రాజు.

"అలాగా! కూర్చోండి" అన్నాడు ఆ సైనికాధికారి.

"థేంక్యూ" అన్నాడేగాని రాజు కూర్చోలేదు. గోడలకు తగిలించి వున్న ఫోటోలు చూస్తూ అటూ యిటూ తిరుగుతున్నాడు. నెమ్మదిగా ఆ సైనికాధికారి వెనక్కి చేరుకున్నాడు. గుమ్మానికి అవతల వుండడంవల్ల సెంట్రీలిద్దరికీ

కనిపించదని నిర్ణయించుకున్నాడు రాజు. పిడికిలి బిగించాడు. బలమంతా కూడదీసుకున్నాడు. ఆ సైనికాధికారి వెనక మెడమీద గుద్దాడు ఒకే ఒక గుద్దు. ఆ ఒక్క దెబ్బకే ముందుకు వాలిపోయాడా సైనికాధికారి కిక్కురుమనకుండా. ఇక రాజు సందేహించలేదు. క్షణం ఆలస్యం చేయలేద్.

ప్రతి గదీ వెతికాడు. యుగంధర్ కనిపించలేదు. మేడమీదకు వెళ్ళాడు. ఒక గదికి పెద్ద తాళంవేసి వుంది. తలుపుని పట్టుకుని చేతులమీద పైకి లేచి వెంటిలేటరులోంచి లోపలికి చూశాడు. కటిక నేలమీద పడుకున్నాడు యుగంధర్. చేతులకీ కాళ్ళకీ సంకెళ్ళు. నోరుకూడా కట్టేసి వుంది. యుగంధర్ పక్కన యింకెవరో పడున్నారు అలాగే. ఎవరైతేనేం? తమ శత్రువులకి శత్రువు అంటే తమకి మిత్రుడు అనుకున్నాడు రాజు. ఏ క్షణాన ఎవరొస్తారోనన్న భయం. మారు తాళం చెవులతో తాళం తీయడానికి ప్రయత్నించాడు. ఒకటీ పట్టలేదు. ఇంకొకటి పట్టినా తిరగలేదు. క్షణం ఓ యుగంలా వుంది. చివరికి తాళం తెరుచుకుంది.

చప్పుడు చేయకుండా లోపలకి వెళ్ళాడు.

"సర్ సర్ నేను రాజును" అన్నాడు తట్టి.

లాభం లేదు. యుగంధర్ కళ్ళు తెరవలేదు. చేతులకీ, కాళ్ళకీ వున్న సంకెళ్ళు ఊడదీశాడు. తరువాత నోటికి కట్టిన కట్టు విప్పేశాడు. జేబులోంచి సిరంజి తీసి, అందులోకి మందెక్కించి, ఇంజెక్షన్ యిచ్చాడు. అప్పటికీ యుగంధర్ కళ్ళు తెరవలేదు. ఏ క్షణాన ఎవరొస్తారోననే భయం. ఆలోగా యుగంధర్ లేస్తే - కళ్ళు రెపరెపలాడుతున్నాయ్.

"సర్ లేవండి మనం త్వరగా వెళ్ళాలి, వ్యవధి లేదు" అన్నాడు రాజు.

రాజును తీక్షణంగా చూశాడు.

"ఎవరు నువ్వు?"

చాలా ఎక్కువ మోతాదు మత్తుమందు యిచ్చి వుండాలి యుగంధర్‌కి.

తనను 'ఎవరు నువ్వ'ని అడుగుతారేమిటి?

"నేను రాజుని. మీ అసిస్టెంటును."

"నా అసిస్టెంటా? రాజా?"

మందులవల్ల గొంతుకూడా మారింది అనుకున్నాడు రాజు.

"సర్! యుగంధర్ లేవండి" అంటూ లేవనెత్తడానికి ప్రయత్నిస్తాడు రాజు.

అంతలో మెట్లమీద అడుగుల చప్పుడు వినిపించింది. యుగంధర్ తనకు సహాయం చేసే స్థితిలో లేడు. రాజు పిస్టల్ బయటికి తీశాడు. మరుక్షణం రాజు మోకాళ్ళ మీద ఒక్క తన్ను తగిలింది. చెట్టు విరిగి కింద పడ్డట్టు నేలమీద పడ్డాడు రాజు. పిస్టల్ వున్న చేతిమీద బూటుకాలు బరువు పడింది.

"హేండ్సప్" అన్నమాట వినిపించగానే రాజు తలుపు వేపు చూశాడు.

హాల్లో తను కొట్టిన సైనికాధికారి తుపాకితో నిలుచున్నాడు తలుపు దగ్గర.

"యూ ఫూల్ తుపాకీ నా మీద గురిపెడతావేం. నేను యుగంధర్ని కాను. ఆ యుగంధర్ మోసం చేసి పారిపోయాడు. నేను కర్నల్ హక్‌ని" రాజుతల యిటు తిప్పి చూశాడు. తను యుగంధర్ అని అనుకున్న మనిషి, తను యింజెక్షన్ యిచ్చి, స్పృహ తెప్పించిన మనిషి యుగంధర్ కాడు. అతికించి వున్న జుట్టుని పీకిపారేస్తున్నాడు. మొహం మీద

అక్కడక్కడ అతికించిన ప్లాస్టిక్ జిలిటెన్ పీకిపారేస్తున్నాడు. అతను యుగంధర్ కాదు. యుగంధర్‌ని రక్షించడానికి వచ్చిన తను పట్టుబడ్డాడు. తన బుద్ధి తక్కువే. యుగంధర్ అంత సులభంగా శత్రువులకి దొరుకుతాడని తనెందుకనుకోవాలి?

"ఈ హిందూస్థాన్ గూఢచారులు చాలా మోసగాళ్ళు. క్షణమాలశ్యం చెయ్యకు. షూట్ హిమ్" అని అరిచాడు కర్నల్ హక్.

తలుపు దగ్గర నిలబడ్డ సైనికుడు తుపాకి రాజు మీద గురిపెట్టాడు. మీట మీద వేలు పెట్టాడు. నొక్కాడు.

"ఢాం' అని తుపాకి పేలింది.

11

ప్రెసిడెంట్ భవనంలోంచి పరిగెత్తుతున్నాడు యుగంధర్. పరిగెత్తుతూ, జరిగినదంతా జ్ఞాపకం చేసుకుంటున్నాడు.

"ఈశ్వరుణ్ణే తల్చుకుంటావో, అల్లానే తల్చుకుంటావో నీ యిష్టం. పదిలెక్కపెడుతున్నా. వన్.. టు.. త్రీ.."

"ఆగండి. జాగ్రత్త నా ప్రాణంతోపాటు మీ ప్రాణాలు ఎందుకు తీసుకుంటారు?" అన్నాడు యుగంధర్.

యుగంధర్ని కాల్చి చంపడానికి తయారయిన హక్, అనుమానంగా "నీ ప్రాణం తీస్తే నా ప్రాణం ఎందుకుపోతుంది?" అడిగాడు.

యుగంధర్ తన బూటుకాలు కొద్దిగా పైకెత్తి, అడుగుభాగం చూపించి, "ఇదేమిటో చూశారా?" అన్నాడు.

హక్ పిస్తోలు యుగంధర్ ఛాతీమీద గురిపెట్టే వుంచాడు. ఇమ్‌తియాజ్ మాత్రం యుగంధర్ దగ్గరగా వెళ్ళి బూట్స్ పరీక్ష చేసి, ఈ యుగంధర్ బూటు అడుగున చేతి గడియారం పెట్టుకున్నాడు" అన్నాడు.

యుగంధర్ నవ్వి "యీ గడియారం వున్న బూట్ నేలకేసి నొక్కానంటే చాలా ప్రమాదం" అన్నాడు.

"ఎవరికి?" అడిగాడు హక్.

"ముందు మన ముగ్గురికి. కాలు నొక్కిన మరుక్షణం నా కాలు పిక్కకి కట్టివున్న బాంబు పేలుతుంది. తరవాత అరక్షణంలో మన ముగ్గురి ప్రాణాలు పోతాయి. ఇంకో అయిదు నిముషాల్లో యీ యింట్లో వాళ్ళంతా చస్తారు. తెల్లారే లోపు ఈ యింటికి పదిమైళ్ళ విస్తీర్ణంలో మనుష్యులు, జంతువులు కీటకాలు జీవమనేది లేకుండా నాశనమవుతుంది. ఇది చాలా ప్రమాదకరమైన విషం" అన్నాడు యుగంధర్.

"నీ మీ మాటలు నమ్మేందుకు మేం పసిపిల్లలం కాము" అన్నాడు ఇమ్‌తియాజ్.

"మీ యిష్టం. మీరు ఆత్మహత్య చేసుకుంటానంటే నేనేం అడ్డుపడగలను?" అన్నాడు యుగంధర్.

హక్, ఇమ్‌తియాజ్ ఒకళ్ళ మొహాలు ఒకరు చూసుకున్నారు.

యుగంధర్ గురించి వాళ్ళు చాలా విన్నారు. శత్రు దేశంలోకి ఏ రక్షణా లేకుండా వచ్చాడంటే, ఇటువంటి జాగ్రత్త ఏదో తీసుకుని వుంటాడు.

హక్, ఇమ్‌తియాజ్ సందిగ్ధంలో పడ్డారు.

"నేను అబద్ధం చెప్పడంలేదు. నా జేబులో ఒక కాయితం వుంది. పోనీ అది చదవండి" అన్నాడు యుగంధర్.

"వద్దు ఈ యుగంధర్ జిత్తులమారి" అన్నాడు ఇమ్‌తియాజ్.

"అవును. ఇతనితో మనం మాట్లాడుతూ కూర్చోవడం కన్నా షూట్ చేయడం" అన్నాడు హక్.

యుగంధర్ పెదిమలమీద చిరునవ్వు అలాగే వుంది. ఆ చిరునవ్వు చూసి వాళ్ళిద్దరూ ఖంగారు పడ్డారు.

"ఆ కాయితం ఏదో చూస్తే?" అన్నాడు హక్.

"యుగంధర్ రెండు చేతులూ పైకెత్తి పెట్టు" అన్నాడు ఇమ్‌తియాజ్.

"ఆ కాయితం ఎక్కడ వుంది?" అడిగాడు కల్నల్.

"కోటు లోపలి జేబులో వుంది" అంటూ రెండు చేతులూ పైకెత్తి పెట్టాడు యుగంధర్. వెనకనుంచి వెళ్ళి యుగంధర్ కోటు జేబులోంచి ఓ చిన్న కాయితం తీశాడు ఇమ్‌తియాజ్. చిన్న చిన్న మడతలు మడిచి వుంది. జాగ్రత్తగా మడతలు విప్పాడు. ఆ కాయితంలోంచి తెల్లని పొడి, చిన్న చిటికెడు కిందపడింది.

"నేను చెప్పలేదూ, యుగంధర్ జిత్తులమారని. ఇది ఉత్త తెల్లకాగితం" అన్నాడు కోపంగా ఇమ్‌తియాజ్.

యుగంధర్ నవ్వి "క్షణమాగండి అక్షరాలు కనిపిస్తాయి. పాకిస్థాన్ డైరెక్టర్ ఆఫ్ యింటిలిజెన్స్ కెమికల్ యింక్‌ను గురించి మీరెప్పుడూ వినలేదా?" అన్నాడు.

"హక్ ఇది చూడండి. ఏవో అక్షరాలు వస్తున్నాయి అన్నాడు ఇమ్‌తియాజ్.

ఇదరూ ఆ కాయితాన్ని చూస్తున్నారు.

"విషం - ప్రమాదం" అనే అక్షరాలు వచ్చాయి కాయితం మీద.

యుగంధర్ ఊపిరి బిగపట్టాడు. ఊపిరితిత్తులు బ్రద్దలౌతున్నట్టుంది. అయినా ఊపిరి విడవలేదు, పీల్చలేదు. ఇమ్‌తియాజ్, హక్, ఇద్దరూ తూలుతున్నారు. కళ్ళు తేలిపోతున్నాయి.

"వాత్, లీజ్ -"

"ఐ దోంత్ నో."

ముద్ద మాటలు. మైకం కమ్ముకుని ఆ ఇద్దరు కుప్పగా నేలమీద కూలిపోయారు. వెంటనే యుగంధర్ జేబులోంచి చిన్న మాస్క్ తీసుకుని ముక్కుకి తగిలించుకుని పడిపోయిన వాళ్ళిద్దర్నీ పరీక్ష చేశాడు. వాళ్ళకి స్పృహ రావడానికి ఒక గంటపడుతుంది. యుగంధర్ వాళ్ళని బెదిరించాడే కానీ అది విషం కాదు. మత్తుమందు. సిగరెట్ వెలిగించి వాళ్ళిద్దర్నీ చూస్తూ నిల్చున్నాడు. ప్రస్తుతానికి తప్పించుకున్నాడు ప్రమాదంలోంచి. అయితే ఏమిటి లాభం? ముందు యిక్కడ్నించి బయటపడాలి. ఒకవేళ ఎలాగో బయటపడినా తర్వాత? పోనీ, ఎలాగో తను వాళ్ళకి చిక్కకుండా తనదేశం చేరుకుంటాడు. అదేం ప్రయోజనం? తను వచ్చిన పనేమౌతుంది? స్పృహలేని వాళ్ళిద్దర్నీ తను చంపడం చాలా సులభం. చంపాడు తను కొందర్ని యిదివరలో తన ప్రాణమా? శత్రువు ప్రాణమా? అనే సమస్య వచ్చినప్పుడు ఆత్మరక్షణ కోసం శత్రువుల్ని హతమార్చాడేగాని, స్పృహలేకుండా పడివున్న యిద్దరు మనుషుల్ని తనెలా చంపగలడు? యుగంధర్ కర్నల్ హక్‌నే చూస్తున్నాడు. హక్, తనంత పొడువు, తనంత భారీగానూ వున్నాడు.

యుగంధర్‌కు ఒక ఆలోచన స్ఫురించింది. హక్‌ని యుగంధర్‌గా మార్చి బందీగా వుంచి తను హక్‌గా మారితే, తను వచ్చిన పని సాధించడానికి గొప్ప అవకాశం లభిస్తుంది. యుగంధర్ గొప్ప వెంట్రిలోక్విస్ట్. ఒక మనిషి మాట్లాడ్డం ఒకసారి వింటే చాలు, అతనిలా గొంతు మార్చి మాట్లాడ్డంలో మంచి నేర్పరి. కంఠస్వరాన్ని బట్టి తను హక్ కాదని ఎవరూ పోల్చుకోలేరనే ధైర్యం వుంది. కాని మిగతావి? అతని యిల్లెక్కడ? అతని మిత్రులెవరు? అతని అలవాట్లేమిటి - చాలా ప్రమాదం.

తనలో తను నవ్వుకున్నాడు. ఈ వృత్తి తీసుకున్న నాటినుంచీ ప్రమాదం అనేది తనను నీడలా, క్షణం వదలకుండా తోడుగా వుంటూనే వుంది.

వెంటనే జేబులోంచి ఒక ప్లాస్టిక్ పెట్టె తీశాడు. అందులోంచి మేకప్ సామాను తీశాడు. క్షణంలో తను హక్‌గానూ, హక్‌ను యుగంధర్‌గానూ మార్చేశాడు. వాళ్ళిద్దరికి సంకెళ్ళు బిగించాడు. నోటిలో గుడ్డలు కుక్కి కట్టేశాడు. జేబులోంచి యింకొక చిన్న పెట్టె తీసి సెంట్రల్ నెర్వస్ సిస్టమ్ మీద పనిచేసే ఘాటైన మందు ఇంజక్షన్ యిచ్చాడు. దానికి విరుగుడు మందిస్తేగానీ నాలుగైదు రోజులవరకు వాళ్ళు మామూలు మనుషులు కారు. ఏమడిగినా అవునని తల ఊపడం తప్ప ఏమీ చేయలేరు.

గది బయట తాళం వేసి ధీమాగా వెళ్ళాడు కిందకి. కింద హాల్లో వున్న సైనికుడు లేచి నిలబడి సెల్యూట్ చేశాడు. ఇద్దరు సైనికులు కూడా బయల్దేరారు. పక్కకి జరిగి దారిచ్చారు సెంట్రీలు.

మొదటి గండం గడిచింది.

ప్రెసిడెంట్ భవనంలోకి వెళ్ళబోతూ యుగంధర్ తటపటాయించాడు. తను చేస్తున్న పని మూర్ఖమైందేమో. అనే సందేహం కలిగింది. మరుక్షణం తనకి తనే ధైర్యం చెప్పుకున్నాడు. అనుమానంతో అవకాశాన్ని పోగొట్టుకోకూడదు.

"నేను ప్రెసిడెంట్‌ని అవసరంగా కలుసుకోవాలి" అన్నాడు ఎ.డి.సి.తో.

"జనరల్ టిక్కా ఖాన్‌తో జనరల్ హమీద్ ఖాన్‌తో మాట్లాడుతున్నారు. చెప్పి వస్తాను" ఏ.డి.సి.ప్రెసిడెంట్ గదిలోకి వెళ్ళాడు. ఐదు నిమిషాల తర్వాత వచ్చి, యుగంధర్ని వెళ్ళమన్నాడు లోపలికి.

తలుపు తెరిచాడు. లోపలికి అడుగుపెట్టాడు యుగంధర్.

"ఆఁ ఏమిటి హక్?" అడిగాడు ప్రెసిడెంట్.

"అతని పేరు మీరు వినే వుంటారు. హిందూస్తాన్ గూఢచారుల్లో కల్లా ఘటికుడు యుగంధర్. అతన్ని పట్టుకున్నాం. మన బందీగా వున్నాడు."

"ఎక్సలెంట్ హక్ అతని ద్వారా కొత్త విషయాలేమైనా తెలిశాయా?" అడిగాడు ప్రెసిడెంట్.

"లేదు చెప్పడు. ఆరితేరిన గూఢచారి."

"అయితే టైం వేస్ట్ చెయ్యకు. చంపించేశెయ్."

"ఒక చిన్న సలహా ప్రెసిడెంట్. ఈ యుగంధర్ని చంపడం కన్నా" చెప్పాడు యుగంధర్.

"బ్రిలియంట్ ఐడియా హక్. ఏర్పాటు చేయండి. ఏ.డి.సి.కి చెప్పండి."

యుగంధర్ సంతోషంగా బయటకి వచ్చాడు. తన పాచిక సగం పారింది. తనని హక్‌గా అందరూ నమ్మారు. హక్‌ని యుగంధర్‌గా నమ్మించి, అతన్ని బైటికి రాకుండా చేసేస్తే దాదాపు తన పని పూర్తయినట్టే. ఇక మిగిలిందల్లా షేక్ ముజిబూర్ రహమాన్ ఎక్కడున్నదీ తను తెలుసుకోవడమే. పాకిస్తాన్ డైరెక్టర్ ఆఫ్ ఇంటిలెజెన్స్ కర్నల్ హక్‌గా తను వెళ్తున్న పనికి ఎవరూ అడ్డుపెట్టరు. షేక్‌ను కలుసుకోవడం, బయటకు తీసుకురావడం మిగిలిందంతే.

పత్రికా ప్రతినిధుల సమావేశం యేర్పాటు చేశాడు. హక్‌ని నిలబెట్టాడు వాళ్ళ ముందు యుగంధర్‌గా. ఆ పాచికా పారింది. హక్‌ని మళ్ళీ ఆ అవుట్ హౌస్‌లోకి తీసుకువెళ్ళి, గదికి తాళం ప్రెసిడెంట్ భవనానికి వచ్చాడు. షేక్ ముజిబూర్ రహ్మాన్ ఎక్కడ వున్నాడో తెలుసు కోవడానికి ప్రెసిడెంట్ ఏ.సి.డి.ని అడగాలి. ఏమని అడగాలి? ఎలా అడగాలి.

''యుగంధర్ షేక్ మజిబూర్ రహ్మాన్‌ని కలుసుకోడానికి వచ్చాడు. వాడి ధైర్యం చూడండి'' అన్నాడు ఏ.సి.డి.తో

''యుగంధర్ కాదు గదా షేక్‌ని కలుసుకోడానికి చీమైనా వెళ్ళలేదు'' అన్నాడు ఏ.డి.సి.

''ఈ యుగంధర్ మనకు చిక్కాడు కనక సరిపోయింది గాని, లేకపోతే ఎలాగో ఓలాగ షేక్ దగ్గరికి వెళ్ళిపోయేవాడు.''

''అంత గొప్పవాడా? అందుకనే అనుకుంటాను షేక్ తప్పించుకోకుండా పటిష్టమైన సెక్యూరిటీ యేర్పాటు చేసే బాధ్యత ఒప్పచెప్పమన్నారు మీకు''

యుగంధర్ గుండె దడ దడలాడింది.

''షేక్‌ని ఎక్కడ బంధించిందీ ఆరుగురికే తెలుసు. ప్రెసిడెంట్, జనరల్ టిక్కాఖాన్, జైలు వార్డర్‌కి. ప్రెసిడెంట్‌కి మీమీద చాలా నమ్మకం ఏర్పడింది. అందుకే మీకూ చెప్పమన్నారు.''

అంతలో బజర్ మోగింది.

''ఎక్స్‌క్యూజ్ మీ. ప్రెసిడెంట్ పిలుస్తున్నారు కర్నల్ హక్. మీరిక్కడే వుండండి'' అని ఏ.డి.సి ప్రెసిడెంట్ గదిలోకి వెళ్ళాడు.

ఇంత సులభంగా షేక్ ఎక్కడున్నాడో తెలుస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఇది అదృష్టమై వుండాలి. ఇంకో ఐదు నిమిషాల్లో వస్తాడు ఏ.డి.సి. షేక్ ఎక్కడున్నాడో చెప్పేస్తాడు. అంతలో బల్లమీద టెలిఫోన్ మోగింది. రిసీవర్ తనే తీసుకున్నాడు యుగంధర్.

అవతలి గొంతు వినగానే చకితుడయ్యాడు. గొంతు మార్చి ''ఐ యామ్ ఏ.డి.సి స్పీకింగ్'' అన్నాడు

అవతలనుంచి అరుస్తున్నాడు యుగంధర్.

''ఐ యామ్ కర్నల్ హక్ హియర్. ఆ యుగంధర్ మోసం చేసి పారిపోయాడు. తన వేషం నాకు వేశాడు. అంటే నాలా తయారయి వుంటాడు. యుగంధర్ కర్నల్ హక్‌గా చలామణీ అవుతున్నాడన్నమాట. యుగంధర్ అసిస్టెంటు రాజును పట్టుకున్నాను కాని అబ్బా! నా జబ్బలో పిస్తోలు గుండు దిగింది. వివరాలు తర్వాత చెప్తాను. పురుగు కూడా ప్రెసిడెంట్ భవనంలోంచి బయటికి పోనీయకుండా తక్షణం సెక్యూరిటీ ఏర్పాటు చేయించకండి.''

''యస్. వెంటనే చెప్తాను'' అని యుగంధర్ టెలిఫోన్ హుక్ మీద పెట్టేశాడు.

నాలుగురోజుల వరకూ తెలివి రాదనుకున్న హక్‌కి తెలివి ఎట్లా వచ్చింది? రాజు అక్కడికెందుకొచ్చాడు? ఎలా వచ్చాడు? వాళ్ళకెలా చిక్కాడు? వాళ్ళ బందీగా ఉన్నాడా లేక? ఇవన్నీ ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు సమాధానం వెతుక్కోడానికి వ్యవధి లేదు. షేక్ మజిబూర్ రహమాన్ ఎక్కడున్నాడో ఏ.డి.సి. వచ్చి చెప్పేంతవరకూ కాచుకోడానికి వ్యవధి లేదు. అయిదు నిమిషాల్లో కర్నల్ హక్ వస్తానన్నాడు. ఆ లోగా ఈ ప్రాంతాల్లో వుండకూడదని నిశ్చయించుకుని బయలుదేరాడు యుగంధర్.

''కర్నల్ హక్.. కర్నల్ హక్ ఎక్కడికి వెళ్ళిపోతున్నారు?'' వెనకనించి పిలిచాడు ఏ.డి.సి.

నాలుగడుగులు వెనక్కి వేస్తే, షేక్ మజిబూర్ రహమాన్ ఎక్కడున్నాడో చెబుతాడు. ఏ.డి.సి. ఔట్ హౌస్ వేపు చూశాడు. తుపాకీలు పట్టుకున్న ఇద్దరు సైనికులతో వస్తున్నాడు హక్.

''కాసేపట్లో తిరిగి వస్తాను నేను. వెంటనే వెళ్ళాలి'' అన్నాడు యుగంధర్.

"ఏమిటంత అవసరం" అడిగాడు ఏ.డి.సి.

"యుగంధర్ తప్పించుకున్నాడట" అని, వెళ్ళిపోయాడు నవ్వుకుంటూ యుగంధర్.

**తలుపు** దగ్గర నిలుచున్న సైనికుడు తుపాకి రాజు మీదికి పేల్చాడు. 'ఢాం' అని పేలింది. పిస్తోలు పట్టుకున్న తన చేతిని బూట్స్ కాలుతో అదిమిపట్టి నిల్చున్న హక్‌ని తుపాకీ పేలుతున్న సమయంలో కిందకి తనమీదకు లాగాడు. హక్ జబ్బలో దిగబడింది.

హక్ ఒక్క పొలికేక పెట్టాడు బాధతో. తుపాకీ పట్టుకున్న సైనికుడు బెదిరిపోయి "సార్ సార్" అంటూ ముందుకు వచ్చాడు. తన కుడిచేతి మీంచి హక్ పాదం బరువు పోగానే రాజు పిస్తోలు తీసుకున్నాడు. ఇప్పుడు రాజుకు దయాదాక్షిణ్యాలు లేవు. సంకోచం లేకుండా ఆ సైనికుణ్ణి కాల్చి చంపేశాడు.

ఖంగుమని తుపాకి కిందపడింది. సైనికుడు నేలకూలాడు. రాజు లేచి నిలబడ్డాడు. పిస్తోలు తీసి హక్ వేపు గురిపెట్టాడు. మీట నొక్కబోతున్నాడు.

"వొద్దు. నాకు ముగ్గురు పిల్లలున్నారు" ఏడుస్తున్నాడు హక్.

అతని జబ్బలోంచి రక్తం కారుతోంది. ప్రాధేయపడుతున్నాయి అతని కళ్ళు, ప్రాణభిక్ష పెట్టమని. ఆ కళ్ళల్లోకి చూస్తూ అతన్ని కాల్చి చంపలేడు రాజు. మొహం పక్కకి తిప్పుకుని మీట నొక్కుతున్నాడు.

"ప్లీజ్"

అతని వేపు చూడక తప్పలేదు రాజుకి. పిస్తోలు వెనక్కి తిప్పిపెడితా అతని తలమీద కొట్టాడు. అతనికి పది నిమిషాలవరకూ స్పృహరాదు.

అంతలో మెట్లమీదనించి పైకి ఎవరో వస్తున్న అలజడి వినిపించింది. రాజు గదిలోంచి బయటకు పరిగెత్తాడు.

"కర్నల్ హక్ గాయపడ్డారు. యుగంధర్ కర్నల్ హక్‌ని షూట్ చేసి పారిపోయాడు" అరిచాడు రాజు.

"ఎప్పుడు? ఎటు?" వాళ్ళు అడుగుతున్నారు.

"మీ వెధవ ప్రశ్నలకి జవాబు చెప్పేందుకు నాకు టైంలేదు. క్విక్. రండి ఆ యుగంధర్ని పారిపోనివ్వగూడదు. పట్టుకోవాలి" రాజు మెట్లమీదనించి కిందికి పరుగెత్తాడు.

ఆజ్ఞలిస్తే తక్షణం ఆచరించాలని శిక్షణ పొందిన సైనికులికి స్వయంగా ఆలోచించే శక్తి ఏనాడో పోయింది.

రాజు ఎవరు? తమకెందుకు ఆజ్ఞలిస్తున్నాడు, అసలేం జరిగింది? ఇవేవీ ఆలోచించకుండా, రాజు వెనక గొర్రెలమందలా వెళ్ళారు. బయటికి వెళ్ళాక రాజు ఆగి, "మీ యిద్దరూ యిటు వెళ్ళండి, నువ్వు ఈ కుడివేపుకిపో, కనిపిస్తే వదలకండి, జాగ్రత్త. ఆ యుగంధర్ తెగించిన వాడు, నేనిటూ వెళతాను" తనే వాళ్ళ సైనికాధికారి అయినట్టు రాజు పరిగెత్తాడు.

## 12

టిక్కాఖాన్ మొహం చూస్తూ కూర్చుంది కాత్యా. అప్పుడే కదులుతున్నాడు. ఇంకో అయిదు నిమిషాలలో లేస్తాడు. తను యింకా ఎటూ తేల్చుకోలేదు.

అంతలో చెవులు చిల్లులు పడేటట్లు టెలిఫోన్ గణగణ మోగింది. రిసీవరు తీసుకుంది కాత్యా.

"హల్లో! జనరల్ టిక్కాఖాన్‌ని పిలు" అవతలినుంచి పోలీ.

"నిద్రపోతున్నారు" అన్నదో లేదో ఆమె చేతినుంచి రిసీవర్ తీసుకున్నాడు టిక్కాఖాన్.

"జనరల్ టిక్కాఖాన్ స్పీకింగ్" అయిదు నిమిషాల పాటు అవతలనించి మాట్లాడుతున్న మాటలు విని, "కర్నల్ హక్! మీరింత అసమర్ధులని అనుకోలేదు నేను. నగరం నించి ఎవరూ ఎటూ వెళ్ళకుండా కట్టుదిట్టాలు చెయ్యండి" చేతికి చిక్కిన వాళ్ళను పోగొట్టుకున్న కోపంతో టెలిఫోన్ పెట్టేసి "స్టుపిడ్స్, ఫూల్స్, ఇన్ ఎఫిషియెంట్ డఫర్స్" అన్నాడు.

"ఎవర్ని తిడుతున్నారు?" అడిగింది కాత్యా.

"మా ఇంటిలిజెన్స్ డిపార్టుమెంటు వాళ్ళను. యుగంధర్, రాజు యిద్దరు హిందూస్థాన్ గూఢచారులు మాకు దొరికారు. ఇద్దర్నీ చంపేయవలసింది. చంపలేదు సరికదా వాళ్ళచేత మోసగింపబడ్డారు. మా దేశానికి వచ్చి, కళ్ళల్లో కారం కొడతారా వాళ్ళు."

"పారిపోయారుగా, ఇంకేం చేస్తారు?"

"ఈ రాత్రిలోగా పట్టుకుంటాం. ఎక్కడికి పోతారు" అంటూ టిక్కాఖాన్ కాత్యా భుజం మీద చెయ్యివేసి దగ్గరికి లాక్కోబోయాడు. అతని చెయ్యి ఒక్క దులుపు దులిపి దూరంగా జరిగింది కాత్యా.

"ఎందుకీ కోపం?"

"జరిగిన అవమానం చాలు. నన్నెవరూ ఇంత అవమానించలేదు. ప్లీజ్ లీవ్ మీ ఎలోన్" అన్నది కాత్యా.

"అవమానమా? నిన్నా? నేనా?"

కాత్యా ఏడుస్తోంది.

"చెప్పు" అన్నాడు.

"నా అంత అందమైన ఆడదాన్ని చూడలేదన్నారు. ఇంకా యేవేవో మాటలు చెప్పారు. దగ్గరికి తీసుకుని, నాలో ఆవేశం పెంచి, వాంఛను రేకెత్తించి మీరు మాత్రం హాయిగా నిద్రపోయారు. ఒక ఆడదాని కింతకన్నా అవమానమేముంది?"

టిక్కాఖాన్ విరగబడి నవ్వి, "అదా! ఐయామ్ సో సారీ. ఇలా నాకు ఇదే మొదటిసారి జరగడం. అందమూ, వయస్సూ, వొళ్ళూ వున్న ఆడది పక్కనుంటే నేనెప్పుడూ నిద్రపోను. సొమ్మసిల్లి ఆడది నిద్రపోయింది గాని."

"ఇవ్వాళెందుకు జరిగింది? మీలో నేను వాంఛ కలిగించలేకపోయానా? ఆడదిగా నేను"

"ఛఛ అలా అనుకోక. నేను అలసిపోయి ఉండాలి. వయసు కూడా ముదిరిందేమో.."

"వయసు ముదిరిన మీలాంటి సైనికాధికారుల్ని పెట్టుకుని పాకిస్తాన్ హిందూస్తాన్‌తో యుద్ధం ఎలా గెలుస్తుంది? ఓడిపోతుంది" అన్నది కాత్యా.

ఛెళ్ళుమని కాత్యా నోటిమీద కొట్టాడు టిక్కాఖాన్. కాత్యా పెదిమ మీద రక్తం కారింది.

"ఈసారి అలా అన్నావంటే, గొంతు పిసికి కిటికీ అవతల పారేస్తాను జాగ్రత్త. ఒక్క పాకిస్తాన్ సైనికుడు వెయ్యి హిందుస్తాన్ సైనికుల్ని చంపగలడు" అరిచాడు టిక్కాఖాన్.

"ఉన్నమాటంటే అంత రోషమెందుకు? ఇద్దరు హిందూస్తాన్ గూఢచారులు పాకిస్తాన్ నడిగడ్డమీదికి వచ్చి, ముఖ్య నగరం రావల్పిండిలో ప్రవేశించి, హేమాహేమీలైన మీ అందర్నీ మోసం చేసి పారిపోయారని మీరే చెప్పారు. వాళ్ళు వచ్చిన

పనేదో, జయప్రదంగా చేసేసి వెళతారు. హిందూస్తాన్ వాళ్ళు, మీరు చెప్పినంత దద్దమ్మలు అనిపించడంలేదు'' అన్నది కాత్యా.

టిక్కాఖాన్ విరగబడి నవ్వి ''ఇంపాజిబుల్ వాళ్ళని పుట్టించిన దేవుడు వచ్చినా ఆ పని సాధించలేడు. అదేమిటో తెలియక మాట్లాడుతున్నావ్. షేక్ ముజిబూర్ రహ్మాన్‌ని యిక్కడ్నుంచి విడిపించుకుని తీసుకుపోవడానికి వచ్చారు వాళ్ళు.''

''ఏం? ఆ షేక్‌ని ఒంటి స్థంభం మేడలో అట్టే పెట్టారా, పాతాళంలో దాచారా?'' అడిగింది కాత్యా.

''అలాటి చోటే ఒక చోట దాచాం. షేక్‌ని భద్రంగా వుంచడం నా బాధ్యత. నేను అసమర్ధుణ్ణి కాను. అయినా టైం వృధా చేస్తున్నాం. నీ చిన్నబుర్రకి ఇంత పెద్ద విషయాలెక్కవు. నిన్నవమానించానన్నావు. అందుకు పరిహారంగా నీ వొంటికి నా జోహారులర్పిస్తాను రా'' అంటూ ఆమె గౌను ఊడదీయడం ప్రారంభించాడు.

అయ్యో! అంతవరకు వచ్చి ఆపేశాడే ఇంకొంచెం రెచ్చగొట్టి వుంటే షేక్ ఎక్కడుందీ చెప్పేసేవాడేమో. ఒక్క క్షణం కళ్ళు మూసుకుంది కాత్యా.

'భగవంతుడా ఈ పాపాత్ముడి చేతుల్లో నేను పూర్తిగా మలినం కాకముందే అతనిచేత చెప్పించేయ్' అని ప్రార్ధించింది.

కళ్ళు తెరిచి అతని కళ్ళల్లోకి చిలిపిగా చూసి అతని కోటు గుండీలూడదీసి, అతని ఛాతీమీది వెంట్రుకల్ని తన ముఖానికి రుద్దుకుంటూ, ''వయసు ముదిరిందన్నారు, ఉక్కు కవచాల్లా వున్నాయి మీ కండలు'' అన్నది కాత్యా.

అతను మురిసిపోయాడు.

ఆమె గౌనును నేలమీదికి జారవిడిచాడు. తరువాత ఆమెను పూర్తిగా వివస్త్రను చేశాడు. కటిక నేలమీద ఆమె పాదాల దగ్గిర చతికిలబడ్డాడు. మత్తుగా ఆమెను చూశాడు.

''నేను జనరల్ టిక్కాఖాన్‌ని. ప్రెసిడెంట్ యాహ్యాఖాన్ తర్వాత సైనికవర్గంలో ముఖ్యుణ్ణి. మొదటి ప్రపంచ యుద్ధం నించీ యిప్పటికి పదహారు రంగాలలో నా నైపుణ్యాన్ని నిరూపించిన నేను, నీ అందానికి ముగ్ధుణ్ణయి నీకర్పిస్తున్న జోహారులివి'' అంటూ ఆమె తొడల చుట్టూ చేతులు వేశాడు.

''ఛఛ! ఇదేమిటి లేవండి తప్పు''

''తప్పు లేదు.''

''ఛీఛీ అసహ్యం''

టిక్కాఖాన్‌ని వొదిలించుకుని మంచం వెనక్కి పారిపోయింది కాత్యా. ఇక వూరుకోడు. తనని వెంబడించి వస్తాడు. పట్టుకుంటాడు. నీచమైన, అసహ్యమైన పనులు చేస్తాడు, చేయిస్తాడు. భగవంతుడు తన ప్రార్ధనలు వినలేదు. ఇది మలినం కావడమే కాదు. మురుగు కాలువలో పడి దొర్లడం, చిన్నమూలుగు, నిట్టూర్పు వినిపించి కాత్యా వెనక్కు తిరిగి చూసింది.

అతనక్కడే కూర్చుని వున్నాడు. అతని భుజాలు ఎగిరెగిరి పడుతున్నాయి. అర్ధమైంది కాత్యాకి. తూర్పు బెంగాల్‌లో లక్షలాది ప్రజల్ని చంపించిన టిక్కాఖాన్, రాక్షసుడు, కర్కోటకుడు అయిన జనరల్ టిక్కాఖాన్ ఏడుస్తున్నాడు. అతను పూర్తిగా పురుషుడు కాడు. అల్పసంతోషి. ఒకసారి భగవంతుణ్ణి జ్ఞాపకం చేసుకుంది. తన ప్రార్ధన విన్నాడు. కాత్యాకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

అతని దగ్గరకెళ్ళి, అతని తల నిమురుతూ –

''ఎందుకేడుస్తారు రండి'' అంటూ చెయ్యి పట్టుకుని లేవదీసి, మంచం దగ్గరికి తీసుకువెళ్ళి కూర్చోబెట్టి ఒక్క ముద్దు పెట్టుకుని, లాలనగా అతన్ని దిండుమీదికి వాల్చి, కళ్ళు తుడుస్తూ ''ఐ లవ్ యూ'' అన్నది మళ్ళీ.

''అవును నాలో దయా, ప్రేమా చాలా వున్నాయి. ఎవరూ నమ్మరు. నేను ఢక్కాలో వున్నప్పుడు ఒక బెంగాలీ కుర్రాణ్ణి చంపించడానికి ఆర్డరు వేశాను. ఆ కుర్రాడి తల్లీ, తండ్రీ, భార్యా యిద్దరు పిల్లలూ, ఒక అక్కా. నా దగ్గరకు వచ్చి మొరపెట్టుకున్నారు. అతను లేనిదే బతకలేమని. నిజంగా నాకు చాలా జాలి వేసింది వాళ్ళమీద.''

''జాలివేసి?'' అడిగింది కాత్యా.

''వాళ్ళందర్నీ చంపించేశాను, అప్పుడే, అక్కడే''

కాత్యాకి ఏడవాలో నవ్వాలో తెలియలేదు.

అతని జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి, అతని ఛాతీమీద తలవాల్చి, ''హిందూస్థాన్‌నుంచి వచ్చిన ఆ గూఢచారుల గురించి నాకేదో భయంగా వుంది'' అన్నది.

''నీకు భయమెందుకు? వాళ్ళు నిన్నేం చేస్తారు?''

''నన్నేమో చేస్తారని కాదు. షేక్ ముజిబూర్ రహమాన్‌ని తప్పించుకోకుండా, బంధించి వుంచడం మీ బాధ్యతని చెప్పారు. ఒకవేళ ఆ గూఢచారులు షేక్‌ని తప్పించగలిగితే, మీ ఉద్యోగం?''

''చెప్పానుగా. నేను ఉత్తరమిస్తేగాని ఆ దరిదాపులకెవరూ వెళ్ళలేరని'' అన్నారు.

''ఎవరయినా దొంగ ఉత్తరం సృష్టిస్తే?''

''ఓసి పిచ్చిపిల్లా నేను సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌కి రాసిచ్చే ఉత్తరం కోడ్‌లో వుంటుంది. అంతేకాదు. జైలు సూపరింటెండెంటూ నాకు ఫోన్ చేసి అడుగుతాడు, నేను నిజంగా ఉత్తరం యిచ్చానో లేదో'' అన్నాడు టిక్కాఖాన్.

కాత్యా ఒక్క నిట్టూర్పు వదలి ''అమ్మ నా మనసిపుడు కుదుటపడింది. రాక్షసుడు ప్రాణం సముద్రం మధ్యలో వున్న కొండ శిఖరం మీద, ఒక గుహలో కాత్యా నవ్వి, ''కాశీ మజిలీ కథలాగా వుంది కదూ. ఈ యేర్పాటు మీరే ఆలోచించారా?'' అన్నది.

టిక్కాఖాన్ గర్వంగా తలుపాడు.

''మై డియర్ టిక్కా! యు ఆర్ ఎ వెరీ క్లవర్ అండ్ ఇంటెలిజెంట్ మేన్.''

ఆ పొగడ్తకి టిక్కా ఖాన్ ఉబ్బిపోయి, ''నిజంగా కథల్లోలాగే ఏర్పాటు చేశాను తెలుసా? సెంట్రల్ జెయిల్ సూపరింటెండెంట్ క్వార్టర్స్ పక్కన ఒక చిన్న బంగళా వుంది. ఆ బంగళాకి తలుపు ఒకటే. వెనకగానీ పక్కన గానీ తలుపుల్లేవు. కిటికీలకు ఇనపకిటలకు ఇనపకడ్డీలు, దళసరి ఉక్కు జల్లెడ వేయించాను. ఆ తలపుకి రెండు తాళాలు. రెండు తాళాలు తీస్తేగాని ఎవరూ లోపలికి వెళ్ళలేరు. ఒక తాళం చెవి సూపరింటెండెంట్‌కి, ఒక తాళం చెవి జెయిల్ వార్డర్‌కి యిచ్చాను. అంటే, ఒకడు లోపలికి వెళ్ళాలంటే రెండోవాడి తాళం చెవి అడగాలి. రెండోవాడివ్వకూడదు. కూడా వెళ్ళి తాళం తియ్యాలి. జెయిలు సూపరింటెండెంట్, వార్డర్ యిద్దరూ ఆరితేరిన ఆర్మీ ఆఫీసర్స్. డూప్లికేట్ తాళం చెవులు నా దగ్గర వున్నాయి.''

''వెరీగుడ్! వెరీగుడ్'' అన్నది కాత్యా.

"పిచ్చిదానా అంతేకాదు. ఆ యింటి చుట్టూ పది అడుగుల కొకడు చొప్పున రాత్రింబగళ్ళు తుపాకీలు పట్టుకున్న సైనికులు కాపలా వున్నారు. జెయిలు సూపరింటెండెంటు, వార్డర్ కూడా లేకపోతే వాళ్ళు కూడా యిరవై గజాల దూరం నించి, ఒక సిగ్నల్ ఇవ్వకపోతే, ఆ ప్రాంతాలకు ఎవరు వెళ్ళినా సరే, కాపలా వున్న సైనికులు తుపాకీలతో తూట్లుగా కాల్చి చంపేస్తారు."

"మీరు వెళితే కూడానా?"

"ఆఁ నాలాగ ఎవడయినా వేషం వేసుకుని వెళితే? అందుకే నేను వెళ్ళినా, జెయిలు సూపరింటెండెంట్‌నీ, వార్డర్‌నీ వెంట తీసుకెళ్ళాలి."

"కోటికొకళ్ళుంటారు మీలాటి వాళ్ళు - ధైర్యమూ, శౌర్యమూ కాక మేధస్సు కూడా ఉన్నవాళ్ళు" అంటూ అతని చెంపమీద చెంప ఆనించి, అతని మెడ నిమురుతోంది కాత్యా.

అది యుగంధర్ నేర్పించాడు. మెడ వెనక ఒక నరాన్ని ఒక నిమిషం మృదువుగా మునివేళ్ళతో నిమిరితే, కొన్ని గంటలసేపు గాఢ నిద్రపోతారు.

టిక్కాఖాన్ కళ్ళు మూసుకున్నాడు. తాపీగా ఊపిరి పీలుస్తున్నాడు, విడుస్తున్నాడు.

"టిక్కా! నిద్రపోతున్నావా?" అంటూ అతని పెదిమలకి తన పెదిమలానించింది. అతని చేతుల్ని తన అరచేతుల్లోకి. అతను పలకలేదు. కదలలేదు. గాఢనిద్రలో వున్నాడు.

కాత్యా మంచం మీద నించి వెళ్ళి బట్టలు వేసుకుంది. ఈ టిక్కాఖాన్ యిక నుంచీ తన చేతుల్లో మైనం ముద్ద. తను అతనికి యివ్వవలసింది యేమీలేదు. అతను తీసుకోలేడు కనుక. యుగంధర్, రాజులను గురించి ఆలోచిస్తోంది. బైటపడిపోయారు. వాళ్ళను పట్టుకోడానికి బ్రహ్మ ప్రయత్నం చేస్తున్నారు శత్రువులు. ఈసారి దొరికారో. అంతే పాపం ఎక్కడున్నారో, ఏం చేస్తున్నారో, అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని ఎలా బతుకుతున్నారో.

## 13

"పట్టుకోండి. చంపండి. పదివేల రూపాయల బహుమానం. ఇతను హిందూస్థాన్ నుంచి వచ్చిన గూఢచారి. ఇతని పేరు యుగంధర్. మన దేశానికి ముప్పు తెచ్చిపెట్టడానికి వచ్చాడు. మారువేషంలో, మారుపేరుతో తిరుగుతున్నాడు. ఆరడుగుల మూడంగుళాల పొడుగు. భారీ మనిషి. ఈ యుగంధర్‌ని ఎవరు పట్టుకున్నా, చంపినా, పౌరుడయినా, పోలీసయినా, సైనికుడయినా సరే పదివేల రూపాయల బహుమానమిస్తారు" అది ఒక పోస్టర్, పెద్ద ఫోటో కూడా అచ్చువేశారు. ఆ పోస్టర్ పక్కనే మరొక పోస్టర్. అందులో రాజు ఫోటో వేశారు.

"శ్రోతలకి ఒక ముఖ్య హెచ్చరిక. జాగ్రత్తగా వినండి. యుగంధర్, రాజు అనే ఇద్దరు హిందూస్థాన్ గూఢచారులు మనదేశంలో ప్రవేశించారు. ప్రస్తుతం రావల్పిండి నగరంలో యెక్కడో దాక్కున్నారు. మన ప్రెసిడెంట్ యాహ్యాఖాన్‌ని హత మార్చాలని, దురాలోచనలతో వచ్చారు వీళ్ళు. ఈ యిద్దరూ, ఉర్దూ ధారాళంగా మాట్లాడగలరు. క్షణాలమీద వేషాలు మార్చుకోగలరు. ఇద్దరూ కలిసే తిరుగుతున్నారో, విడివిడిగా తిరుగుతున్నారో ఇంకా తెలియదు. రావల్పిండి నగరంలోంచి పారిపోకుండా కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకుంది ప్రభుత్వం. ఒకతని పేరు యుగంధర్. ఆరడుగుల మూడంగుళాల పొడుగుంటాడు. భారీ మనిషి. వయస్సు 40-50 మధ్య. ఇంకొకతని పేరు రాజు. 5 అడుగుల 11 అంగుళాల పొడుగు.

ఉక్కు తీగలా వుంటాడు. వయసు 25-30 మధ్య వుంటుంది. ప్రతి పౌరుడూ, ప్రతి పోలీసూ ప్రతి సైనికుడూ వెయ్యి కళ్ళతో చూస్తూ వుండాలి. ఎవరిమీద అనుమానం కలిగినా ముందు పోలీసులకు పట్టివ్వండి. సందేహించకండి. పదివేలు బహుమానం వస్తుంది'' ఇది పాకిస్తాన్ రేడియోలో ప్రకటన. పదిహేను నిమిషాల కొకసారి ఇదే హెచ్చరిక ప్రకటిస్తున్నారు.

పత్రికల్లో ముందు పేజీల్లో యుగంధర్, రాజుల ఫోటోలు అచ్చు వేశారు. ఇదే ప్రకటన, ఇదే హెచ్చరిక వాటిల్లోను. జనం ఎక్కడ పడితే అక్కడ ఇద్దరో ముగ్గురో చేరి, యుగంధర్ గురించే మాట్లాడుకుంటున్నారు రావల్పిండి నగరమంతా. భారతదేశానికి, పాకిస్తాన్‌కి వస్తుందనుకున్న యుద్ధం గురించి మరిచిపోయారు ఆ రోజుకి.

''ఏయ్ తాతా! ఏంటా పని?'' అన్నాడు పోలీసు కానిస్టేబుల్ చేతికర్రను పట్టుకుని వొంగి నిలుచున్న వృద్ధుణ్ణి చూసి. గోడకి అతికించి వున్న ఆ 'హెచ్చరిక' పోస్టర్ మీద ఆ వృద్ధుడు పొగాకు తమలపాకుతో యుగంధర్ ఫోటోలో మొహం మీద ఎర్రగా ఉమ్మిపడింది. అందుకే ఆ పోలీస్ కానిస్టేబుల్ ఆ వృద్ధుణ్ణి గదమాయించాడు. వృద్ధుడు కానిస్టేబుల్ని కోపంగా చూసి ''ఏం, కోప్పడుతున్నావ్? వుమ్మి వేయకపోతే పూలు వేయమంటావా? యీ హిందూస్తాన్ బద్మాష్ మీద?'' అన్నాడు. జనం ఘొల్లున నవ్వారు.

''ఈ కర్రతోనే వాడి తల బద్దలు కొడతాను నాకు కనిపిస్తే'' ఆ వృద్ధుడు ఈ మాట అనగానే జనం సంతోషం పట్టలేక ''పాకిస్తాన్ జిందాబాద్'' అని కేకలు వేస్తూ నలుగురు కలిసి ఆ వృద్ధుణ్ణి భుజాల కెత్తేసి 'పాకిస్తాన్ జిందాబాద్' 'హిందూస్తాన్ సైన్యాన్ని సమూలంగా సంహరించటానికి యీ తాత ఒక్కడు చాలు' అంటూ ఆ వృద్ధుణ్ణి వీధుల్లో వూరేగించడం ప్రారంభించారు. ఆ వృద్ధుడెవరో కాదు, యుగంధర్.

**రావల్పిండిలో** అతి ముఖ్యమైన బజారు వీధి. నగరం మధ్య వున్న వీధి. నగరంలో ఏ వైపునుంచి ఏ వైపుకి వెళ్ళాలన్నా ఆ వీధిలోంచి వెళ్ళాల్సిందే. దాదాపు యిరవైమంది యువకులు ఆ సెంటర్ వద్ద నిలబడ్డారు. ఆపుతున్నారు వచ్చిపోయే కార్లను. ఒకడు విండ్‌షీల్డు మీదో, మడ్గార్డు మీదో జిగురు పూస్తాడు. ఇంకొకడు 'క్రష్ ఇండియా' అన్న చీటీ అతికిస్తాడు దానిమీద.

''ఎక్స్‌క్యూజ్‌మీ'' అన్నాడు, అప్పుడే అక్కడికి వచ్చిన ఒక యువకుడు బెల్ బాటమ్స్, గురు షర్ట్, భుజాల మీద కొబ్బరి పీచులాంటి జుట్టూ, అడ్డదిడ్డంగా పెరిగిన మీసాలూ, గెడ్డం. దుమ్ము పట్టిన మొహం. ఆ వచ్చిన యువకుడు హిప్పీ.

''విత్ ప్లెజర్'' అంటూ కాయితాలు పట్టుకున్న యువకుడు క్రష్ ఇండియా చీటీలు కొన్ని ఆ హిప్పీ కిచ్చాడు.

''థేంక్యూ'' అని ఆ హిప్పీ కూడా కార్లను ఆపి, 'క్రష్ ఇండియా' చీటీలను అతికిస్తున్నాడు వాటిమీద.

అంతలో అటు ఒక ఊరేగింపు వచ్చింది 'పాకిస్తాన్ జిందాబాద్' అంటూ అరుస్తున్నారు ఆ ఊరేగింపులో వాళ్ళు. కార్లు ఆగిపోయాయి. జనం తప్పుకున్నారు. సైకిళ్ళు పక్కకి వెళ్ళిపోయాయి. ఒక వృద్ధుణ్ణి భుజాలమీద కూర్చో పెట్టుకుని వూరేగిస్తున్న దృశ్యాన్ని, ఆశ్చర్యంగా చూస్తున్నారు అందరూ.

ఎవరో అడిగారు. ఎవరో చెప్పారు. నిమిషంలో అందరికీ తెలిసిపోయింది కారణం. హిప్పీకి కూడా తెలిసింది.

చొరవచేసుకుని హిప్పీ ఆ గుంపులో చొరబడ్డాడు. ఆ వృద్ధుడి వీపుమీద ఒకటీ, ఛాతీ మీద ఒకటీ అతికించాడు 'క్రష్ ఇండియా' చీటీలని.

అందరూ చప్పట్లు కొట్టారు.

ఆ హిప్పీ వెనక్కు వచ్చేశాడు.

ఆ హిప్పీ ఎవరో కాదు.

యుగంధర్ అసిస్టెంట్ రాజు.

ఆ వృద్ధుడు యుగంధరని, రాజు గుర్తుపట్టలేదు. ఆ హిప్పీ తన అసిస్టెంట్ రాజని, యుగంధరూ గుర్తుపట్టలేదు.

మారువేషాలు వేసుకోవడంలో, రూపాన్ని మార్చుకోవడంలో, ఆ యిద్దరూ ఒకరికొకరు తీసిపోరు - ప్రవీణులు.

ఆ నైపుణ్యమే లేకపోతే యిద్దరూ ఎప్పుడో పాకిస్తాన్ సైనికులకు చిక్కేవాళ్ళు.

ఇంకో నాలుగు వీధులు తిరిగిన తర్వాత ఆ గుంపులో జనం ఒకొక్కళ్ళే జారుకున్నారు.

"ఇంక నన్ను దింపండ్రా" అన్నాడు యుగంధర్.

ఆ నలుగురు యువకులూ పకపకా నవ్వి, "అయ్యో! తాతా, నిన్ను చాలా దూరం తీసుకొచ్చామే? మళ్ళీ నువ్వెనక్కి వెళ్ళాలా? నీ యిల్లెక్కడ?" అని అడిగారు.

"నాకిల్లంటూ ఏదీలేదు. ప్రస్తుతానికి ఏ మసీదులోనో పడుకుంటున్నాను."

"అదేం? నీ వాళ్ళెవరూ లేరా యిక్కడ?"

"ఒక కొడుకున్నాడు. వాడు సైన్యంలో చేరతానని యీవూరు వచ్చేశాడు వాణ్ణి వెతుక్కుంటూ వచ్చాను."

"నీది ఏ ఊరు?"

"చెక్వాల్"

"ఏం తాతా నీ కొడుకు సైన్యంలో చేరడం నీకిష్టంలేదా?"

"నేనడ్డుపడతానేమోనని నాతో చెప్పకుండా వచ్చేశాడు. పిచ్చి వెధవ. యుద్ధం వస్తుందని అంటున్నారు. వాణ్ణి చూసి ఒకసారి ఆశీర్వదించి పోదామని వచ్చాను."

"ఏదన్నా హోటల్‌లో వుండకపోయావా తాతా"

"నా దగ్గిరంత డబ్బేదర్రా తిండికి సరిపోయేంత తెచ్చుకున్నాను."

"తాతా! మేం నలుగురం కాలేజీలో చదువుకుంటున్నాం. ఒక గది అద్దెకు తీసుకుని ఉంటున్నాం. నీ కొడుకుని చూసి, మళ్ళీ వూరికెళ్ళేంతవరకూ నువ్వు మా గదిలోనే వుండు."

"ఈ ముసలాడిమీద మీకెందుకర్రా అంత ఆపేక్ష? దయ, ప్రేమ - ఈ దేశంలో యింకా మిగిలున్నాయంటే ఆ అల్లానే మెచ్చుకోవాలి" అన్నాడు ఆ వృద్ధుడి వేషంలో వున్న డిటెక్టివ్ యుగంధర్.

రాత్రి పదిగంటలయింది. ఏ అయిదు నిమిషాలకో ఒక సైకిలిస్టు బెల్లు వాయించుకుంటూ వెళ్తున్నాడు. వీధిలో జనసమ్మర్ధం తగ్గిపోయింది. ఆ నలుగురు కుర్రాళ్ళూ, రాత్రి సినిమా కెళ్తామని బయలుదేరి వెళ్ళారు. ఆ గదిలో యుగంధర్ ఒక్కడే ఇటూ అటూ పచార్లు చేస్తున్నాడు.

అద్దం ముందు ఆగి ఒకసారి తనను తను చూసుకున్నాడు. మాసిపోయిన గళ్ళలుంగీ, నలిగి చిరుగులు బడ్డ లేసు లాల్చీ, నెరిసిన మీసాలు, గెడ్డం, ముడతలు పడిన మొహం. తనవెవరూ గుర్తుపట్టలేరు. యుగంధర్‌గా ఎవరూ పోల్చుకోలేరు. ఆఖరికి అనుమానంకూడా వుండదు. అనుమానం కలగకుండా ఈ నలుగురు యువకులూ తనకు రక్ష.

తన బట్టలు చూసుకుంటే నవ్వొచ్చింది యుగంధర్‌కి. పాపం బట్టలు పోగానే అతనేం చేశాడో?

తను ప్రెసిడెంట్ భవనంలోంచి బయటకు వచ్చాడు. కర్నల్ హక్, ఇంకా కొంతమంది సైనికులు తనను తరుముకుంటూ వస్తారని తనకు తెలుసు. తను యీ యూనిఫారంలోనే వుంటే తనను పట్టుకోవడం సులభం. తను బస చేసిన హోటలుకి వెళ్ళి బట్టలు మార్చుకోవడానికి వీలులేదు. వెళ్ళాడో పట్టుబడతాడు. పోనీ ఏ షాపులోకో వెళ్ళి కొత్తబట్టలు కొనుక్కుందామంటే? అదీ వీల్లేదు. కర్నల్ యూనిఫారమ్‌లో తనను అందరూ గమనిస్తారు. బట్టలు కొనుక్కుని యెక్కడికో వెళ్ళి మార్చుకోవాలి. దానికి వ్యవధిలేదు. పోనీ సందు గొందుల్లో పడిపోదామంటే, కర్నల్ స్థాయి ఉద్యోగి కాలి నడకన సందుల్లో పోతుంటే తప్పకుండా అనుమానం కలుగుతుంది.

ఎలా ఈ యూనిఫారం వదిలించుకోవడం? త్వరత్వరగా నడుస్తున్నాడు. కొంచెం దూరంలో, వీధిలో ఒక కొళాయి కింద, ఒక ముసలాడు స్నానం చేస్తున్నాడు గోచీ పెట్టుకుని. అతని బట్టలు కొళాయి వెనుక సిమెంటు దిబ్బ వెనుక ఉండగా చుట్టిపెట్టాడు తడవకుండా.

దొంగల్ని పట్టుకోవడంలో తను ఘటికుడు. నిజమే దొంగతనం చేయడంలో తనకి ఆ నేర్పుందా? అని ఆలోచించాడు యుగంధర్.

ఆ ముసలాడు చూసి కేకేశాడంటే, అంతే తన పనైపోతుంది. అయినా తప్పదు. త్వరత్వరగా నడిచి వెళ్తూ దిమ్మ వెనక వున్న బట్టల్ని ఒక చేత్తో చటుక్కున పైకి తీసుకుని చకచకా నడిచి వెళ్ళిపోయాడు. తనకే నవ్వొచ్చింది. ఆ ముసలాడు స్నానం ముగించుకుని బయటకు వచ్చి బట్టల కోసం చూసి, లేకపోతే పాపం, గోచీ పాతతో –

యుగంధర్ వెనకనించి భుజం మీద చెయ్యిపడింది. గుండె ఝల్లుమంది. వెనక్కితిరిగాడు.

"వాట్ కర్నల్! మీరు దొంగతనాలు కూడా ప్రారంభించారా?" అన్నాడు ఒక ఆర్మీ ఆఫీసర్.

యుగంధర్ నవ్వి, "బేరక్స్‌లో స్నానం చెయ్యరా, వీధుల్లో కొళాయి కింద స్నానం చెయ్యొద్దురా అని లక్షసార్లు చెప్పాను నా ఆర్డర్లీకి. గోచీతో ఒకసారి బేరక్స్ వరకు నడిచి వచ్చాడంటే బుద్దొస్తుంది" అన్నాడు యుగంధర్.

"వెరీగుడ్ ఐడియా! ఈ ప్రాక్టికల్ జోక్ యివ్వాళ మెస్‌లో అందరికీ చెప్పాలి. గుడ్ డే కర్నల్" అంటూ ఆ ఆర్మీ ఆఫీసర్ ఒక షాపులోకి వెళ్ళిపోయాడు. ఒక గండం గడిచింది. దగ్గర వున్న కొట్లో ఒక న్యూస్ పేపర్ కొని ఈ బట్టల్ని పొట్లం కట్టుకున్నాడు. ఇక తరువాత సమస్య బట్టలు మార్చుకోవాలి. ఎక్కడ? ఎలా?

రాత్రన్నా కాదు, పట్టపగలు.

కర్నల్‌కి తన దుస్తులు వేసి, హాక్ దుస్తులు తను వేసుకున్నప్పుడు తనకూడా తెచ్చుకున్న సామానంతా జేబులో వేసుకున్నాడు. తరువాత వ్యవధి వుంటుందో లేదో అని ఆ సామాన్లని, కాగితం పొట్లంలోకి త్వరత్వరగా నడుస్తూనే చేరుస్తున్నాడు. యుగంధర్‌కి అప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఇది ఉపయోగిస్తే, ఆ కాస్త వ్యవధి చాలుతుందా?

మాంత్రికుడిలా కొద్ది క్షణాలలో యీ బట్టలు తీసేసి ఆ బట్టలు వేసుకోగలడా?

వేరే గత్యంతరం లేదు.

చిన్న కోడిగుడ్డులాంటిది చేతిలో పట్టుకున్నాడు. నడుస్తూనే దాన్ని రోడ్డుమీదికి జారవిడచాడు. 'ఢాం' అని పేలింది. దట్టంగా పొగ కమ్ముకుంది.

"హిందుస్థాన్ బాంబు వేశారు" ఎవరో అరిచారు.

"కాదు ఆర్మీ ఆఫీసర్ని హత్య చేసుంటారు."

"వాడే ఆ యుగంధర్ అయ్యుంటాడు" ఇంకెవరో అరిచారు. కేకలు, గందరగోళం. పోలీసులు విజిల్స్ వేస్తున్నారు.

తను చకచకా కర్నల్ డ్రస్ తీసేసి, ఆ లుంగీ లాల్చీ వేసుకుని యూనిఫాం మళ్ళీ కాగితంలో పొట్లం చుట్టుకుని, ఆ పొగలోంచి బయటకు వచ్చాడు కళ్ళు నులుపుకుంటూ. తను వేసింది స్మోక్ బాంబ్. అది స్మోక్ బాంబ్ అని జనమూ, పోలీసులూ తెలుసుకునే లోపున ఒక పార్కుకు చేరుకున్నాడు. అది మధ్యాహ్నం. పార్కులో ఎవరూ లేరు. మళ్ళీ రూపం మార్చుకున్నాడు. యూనిఫాం తీసేసి, మాసిపోయిన లుంగీ కట్టుకుని, లాల్చీ వేసుకుని, రూపం మార్చుకుని వృద్ధుడుగా మారిపోయాడు యుగంధర్.

నెమ్మదిగా నడుస్తూ పార్కు నుంచి బయటకి వచ్చాడు. కొంత దూరం వెళ్ళాక అప్పుడు జ్ఞాపకం వచ్చింది తను పెద్ద పొరపాటు చేశానని. చాలా ఘోరమైన పొరపాటు. కర్నల్ యూనిఫాం అక్కడే పార్కులో వదిలేశాడు. వెనక్కి తిరిగి చూశాడు. అక్కడ అప్పుడే యెవరో కూర్చునున్నారు. దురదృష్టం..

ఆ ప్రాంతం నుంచి ఎంత త్వరగా వెళితే అంత మంచిదని త్వరత్వరగా వెళ్ళిపోయాడు.

కొంత దూరం వెళ్ళాక తనని పట్టుకున్న వాళ్ళకి బహుమానం ఇస్తామన్న పోస్టరు చూశాడు. దానిమీద ఉమ్మేసాడు. తన మారువేషం యింకొంచెం పటిష్టం చేసుకునేందుకు.

జనానికి అంత ఉత్సాహం కలుగుతుందనికానీ, తనని వూరేగిస్తారని కానీ అనుకోనేలేదు. కానీ అదీ తన మంచికే అయింది. తలదాచుకోడానికీ, ఎవరికంటా పడకుండా వుండడానికీ ఒక యిల్లంటూ దొరికింది ఇప్పుడు. ఎంతకాలం తనకీ ఆశ్రయం వుంటుందో అది పాకిస్థాన్ ఇంటిలిజెన్స్ డిపార్టుమెంట్ మీద, కర్నల్ హాక్ తెలివితేటలమీద ఆధారపడి వుంటుంది.

కాత్యా హోటల్ యూనివర్స్‌లోనే వుందేమో? ఏం చేస్తోందో?

తనలా ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని మారు వేషంలో ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడో రాజు. అని తన అసిస్టెంట్స్‌ను గురించి ఆలోచిస్తున్నాడు యుగంధర్.

## 14

అది నైట్ క్లబ్. బార్ ఎటాచెడ్ ఓ పదిమంది యువకులూ, యువతులూ చేరారక్కడ. రాత్రి పదిగంటలు దాటింది.

తాగేవాళ్ళు తాగుతున్నారు. పాడేవాళ్ళు పాడుతున్నారు. కొందరు డాన్స్ చేస్తున్నారు.

హిప్పీ వేషంలో వున్న రాజు వాళ్ళలో ఒకడుగా కలిసిపోయాడు.

"నువ్వెవరివి? ఎక్కడ్నించి వచ్చావ్?" అని రాజుని ఎవరూ అడగలేదు.

అలాటి ప్రశ్న అడగడం వాళ్ళ కలవాటు కూడా లేదు. ఈ జట్టుతో వున్నంతకాలం తననెవరూ అనుమానించరు, పట్టుకోరు అని నిర్ధారణయింది రాజుకి. అందుకే వీళ్ళ సాహచర్యం వదులుకోలేదు. తన పక్కన కూర్చున్న అమ్మాయి, అప్పటికే బాగా తాగేసింది. "ఇంకొక జిన్‌లెట్" అడిగింది మత్తుగా.

"ఎనెదర్ జిన్‌లెట్" రాజు కేకేశాడు.

"యు ఆర్ ఎ వెరీగుడ్ బాయ్" అంటూ రాజును ముద్దు పెట్టుకుంది. అతని వొళ్ళంతా తడుముతోంది.

"వాట్ వండర్‌ఫుల్ మజిల్స్. మేక్ లవ్ టు మీ స్వీట్ బోయ్" అన్నది అతని కోటు గుండీలు విప్పుతూ.

"ఎక్కడ? ఇక్కడే? అందరి ముందే?" అడిగాడు రాజు నవ్వుతూ.

"నీకు సిగ్గయితే బల్లకిందకు పోదాం రా" అంటూ కుర్చీని వెనక్కి తన్నేసి మోకాళ్ళ మీద పాక్కుంటూ బల్లకిందకి పోతోంది ఆ యువతి. అందరూ ఘొల్లున నవ్వారు.

"తప్ప తాగింది. బల్లకిందకెవరొచ్చారో కూడా తెలియదు. నువ్వెళ్ళు తిక్క కుదురుతుంది" అన్నారు ఎవరో నల్లగా, సన్నగా, అందవికారంగా వున్న యింకో యువకుణ్ణి చూసి.

అందరూ విరగబడి నవ్వారు మళ్ళీ.

"మన జట్టులో మనిషేగా పాపం. లెటజ్ నాట్ బి సో క్రూయల్" అన్నారు యింకెవరో.

"అవునవును. తను కోరుకున్న వాణ్ణే పంపిద్దాం" అంటూ యిద్దరు యువకులూ, యిద్దరు యువతులూ రాజును చెరో జబ్బా పట్టుకుని "ఊఁ వెళ్ళు. కాచుకునుంది. బల్లకిందకి వెళ్ళు. సిగ్గుపడతావే?" అరిచారు. బల్ల కిందకి తోస్తున్నారు. తప్ప తాగారేమో అందరూ వాళ్ళకి యిది అంతా చాలా తమాషాగా ఉంది. చప్పట్లు కొడుతున్నారు, యీలలు వేస్తున్నారు.

రాజకీయాలలో, పరిపాలనలో మాత్రం యీ దేశం నీతి నియమాలను కోల్పోయింది అనుకున్నాడు రాజు. కాదేమో జాతి జాతికీ నీతి, నియమం, సంస్కారం, సభ్యతా పోయి, యింత దిగజారిపోయారా?

బల్లకిందకి వెళ్ళక తప్పలేదు. వాళ్ళలో ఒకడుగా నటిస్తున్న తను వాళ్ళలా ప్రవర్తించక తప్పలేదు.

టెబుల్ క్లాత్ నేలవరకూ లేదు. బల్లకింద వెలుగు బాగానే వుంది. తనని బల్లకిందకి రమ్మన్న యువతి, రెండు కాళ్ళూ ముడుచుకుని రోకలి బండలా చుట్ట చుట్టుకుని పడుకుని వుంది. నిద్రపోతోంది.

"థేంక్ గాడ్" అనుకుని, తలకింద రెండు చేతులూ పెట్టుకుని తనూ పడుకున్నాడు రాజు. బాగా అలిసిపోయాడు. ఓ అరగంట నిద్రపోవటానికి మంచి అవకాశం దొరికింది అనుకున్నాడు.

ఎవరో కొత్తవాళ్ళు అక్కడికి వచ్చిన అలజడి అయింది. వాళ్ళ మాటలు వినిపిస్తున్నాయి.

"ఏం, సినిమాకు వెళ్ళలేదా మీరు?" అడిగారు ఎవరో.

"టిక్కెట్టు దొరకలేదు" కొత్త కంఠస్వరం.

"అన్నట్టు మీరు వూరేగించిన ఆ ముసలి హీరోని ఏం చేశారు?"

"మా గదిలోనే వుండమన్నాం. పాపం, బీదవాడు. ఉన్న ఒక్క కొడుకూ ఆర్మీలో చేరాట్ట."

"అయితే ఆ ముసలాడికి మనం విరాళాలు పోగుచేసి, వందో రెండొందలో పర్సు యివ్వాలి" ఇంకెవరో అన్నారు.

ఎవరో ట్రాన్సిస్టర్ బిగ్గరగా పెట్టారు. రెండు నిమిషాల తర్వాత సంగీతం ఆగిపోయింది.

''ఒక ముఖ్య ప్రకటన. శ్రోతలు శ్రద్ధగా వినాలి.''

రెండు క్షణాలు నిశ్శబ్దం -

మళ్ళీ -

''నా పేరు కర్నల్ హక్. పాకిస్తాన్ యింటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ని. రావల్పిండి నగర పౌరులకి ముఖ్య హెచ్చరిక చేస్తున్నాను.

హిందుస్తాన్ నించి వచ్చిన యిద్దరు గూఢచారులు మారువేషాలతో నగరంలో తిరుగుతున్నారనీ, పట్టుకున్న వాళ్ళకి బహుమానం యిస్తామనీ, ఇదివరకే ప్రకటించాము.

యుగంధర్ గురించి మరికొన్ని వివరాలు తెలిశాయి. జాగ్రత్తగా వినండి. వీధిలో కొళాయి కింద స్నానం చేస్తున్న ఒక అభాగ్యుడు తన బట్టలు పోయాయని పోలీసులకి కంప్లైంట్ చేశాడు. కర్నల్ హక్ లా వున్న కతను ఆ బట్టలు దొంగిలించడం తన కళ్ళారా చూశానని ఒక సైనికాధికారి చెప్పాడు. పార్కులో దొరికిందని చెప్పి, మిలటరీ యూనిఫారం తెచ్చి యిచ్చారు ఎవరో పోలీసు స్టేషన్‌కి. ఒక వృద్ధుడు, యుగంధర్‌ని పట్టుకోమనున్న పోస్టర్ మీద వుమ్మి వేసినందుకు జనం సంతోషించి అతన్ని వూరేగించారని తెలిసింది. ఈ వృద్ధుడే యుగంధరని పౌరుల్ని హెచ్చరిస్తున్నాను. అతని ఆచూకీ తెలిసిన వాళ్ళు తక్షణం దగ్గరున్న పోలిసు స్టేషన్‌కు వెళ్ళి చెప్పమని కోరుతున్నాను.''

తర్వాత మాటలు రాజుకు వినిపించలేదు. గందరగోళం అరుపులు.

''రండి పోలీసు స్టేషనుకి వెళదాం.''

మాట్లాడుకుంటున్నారు వాళ్ళు.

రాజు మెదడు ఉరకలు వేస్తోంది. తనూ, యుగంధరూ ముఖాముఖిని ఒకళ్ళనొకళ్ళు కలుసుకున్నారు నడిరోడ్డుమీద. అయినా ఒకర్నొకరూ గుర్తుపట్టలేదు. తనకు ఏ ప్రమాదం లేదని నిశ్చింతగా యుగంధర్ నిద్రపోతూ వుండివుంటాడు. పోలీసులూ, సైనికులూ తనను చుట్టుముట్టేంత వరకూ ఏమీ తెలియదు. ఎదురు తిరగడానికి, తప్పించుకోడానికి అవకాశం వుండదు. చిక్కిపోతాడు, చంపేస్తారు.

రానున్న ఆపదను గురించి యుగంధర్‌ని హెచ్చరించాలి. వేషం మార్చుకుని మరెక్కడికయినా పారిపొమ్మని చెప్పాలి. ఈ మహానగరంలో ఆ గది ఎక్కడుందో కూడా తనకి తెలియదే ఎలా? ఏం చేయాలి? తీరిగ్గా ఆలోచించుకునేందుకు కూడా వీలులేదు. వాళ్ళు బయలుదేరుతున్నారు పోలీస్ స్టేషన్‌కి. రాజు బల్లకింద నుంచి బయటికి వచ్చాడు.

15

**దూరాన్నుంచి** బూట్ల శబ్దం టకటక వినిపించింది. ఒక్క అంగలో యుగంధర్ కిటికీ దగ్గరకు వెళ్ళాడు.

''టునైట్ వుయ్ మీట్,

టు లవ్ యు స్వీట్''

ఇంగ్లీషు పాట పాడుకుంటూ వస్తున్నారు.

తను అనవసరంగా కంగారుపడ్డాడు. ఆ వస్తున్నది ఆ కుర్రాళ్ళే. అర్ధరాత్రయినా పాటలు పాడుకుంటూ వస్తున్నారు. ఆ వయసు అలాటిది.

''ఇంకా నిద్రపోలేదా తాతా'' అడిగాడు ఓ యువకుడు.

''నిద్రపట్టలేదు'' జవాబు చెప్పాడు యుగంధర్.

''నీకోసం మంచి బిర్యానీ తెచ్చాం. తిను తాతా'' అంటూ ఒక పొట్లం యుగంధర్ చేతిలో పెట్టాడు యింకో యువకుడు. నిలుచునే యుగంధర్ విప్పుతున్నాడు పొట్లం. ఏదో పనున్నట్టు యింకో యిద్దరు అతని వెనక్కి వెళ్ళారు.

చటుక్కున పట్టుకున్నారు వాళ్ళిద్దరూ యుగంధర్ చెరో చెయ్యీ. ఇంకొక యువకుడు బిగ్గరగా విజిల్ వేశాడు. మరుక్షణం యిద్దరు పోలీస్ కానిస్టేబుల్స్, ఒక సార్జంటు ప్రవేశించారు తుపాకీలు యుగంధర్ మీదకి గురిపెట్టి. వాళ్ళ వెనకే మరో పదిమంది యువతులూ, యువకులూ పరిగెత్తుకుంటూ గదిలోకి వచ్చారు.

ఇదంతా త్రుటికాలంలో జరిగింది. ఏం జరిగిందో, జరుగుతోందో యుగంధర్ గ్రహించే లోపునే రివాల్వర్ తన ఛాతీమీద గురిపెట్టి, ''చేతులు పైకెత్తిపెట్టు బద్మాష్. కనురెప్ప కదిలిస్తే చాలు నీ పొటిమీద వెయ్యి తూట్లు పడతాయి'' అరిచాడు సార్జంట్.

యుగంధర్ చేతులు పైకెత్తి పెట్టక తప్పలేదు. ఒక యువకుడు యుగంధర్ అతికించుకున్న గడ్డాన్ని పీకేశాడు. ఒక యువతి జేబురుమాలుతో తుడిచేసింది యుగంధర్ మొహానికున్న మేకప్.

యుగంధర్ నిజస్వరూపం బయటపడింది.

''అవును. పోస్టర్‌లో వేసిన మొహమే'' అన్నాడు ఒకడు.

''ఓ! వాట్ ఏ హేండ్సమ్ మేన్'' అంది ఒక యువతి.

''సార్జంట్ ఈ రాత్రికి వీడ్ని మా దగ్గరే ఉండనివ్వండి. మీకు పొద్దున్నే అప్పచెప్తాం'' కీచు కంఠంతో అరిచింది తప్ప తాగిన ఒక అమ్మాయి.

''వీడికి రాత్రంతా వూపిరాడనివ్వరీ ఆడవాళ్ళు. తెల్లారేసరికి చస్తాడు.''

అందరూ ఘొల్లున నవ్వారు.

''చేతులు పైకెత్తిపెట్టివుంచే కదులు.. నడు'' అన్నాడు సార్జంట్.

యుగంధర్ ముందుకి నడిచాడు. ఒక కానిస్టేబుల్ యుగంధర్ వెనక్కి వెళ్ళి, తుపాకీ వీపుకి ఆనించి, నొక్కిపెట్టాడు. ఇంకో కానిస్టేబుల్ తుపాకీ యుగంధర్ ఛాతీమీద గురిపెట్టి వెనక్కి వెళ్ళి, తుపాకీ వీపుకి ఆనించి, నొక్కిపెట్టాడు. ఇంకో కానిస్టేబుల్ తుపాకీ యుగంధర్ ఛాతీమీద గురిపెట్టి వెనక్కి నడుస్తున్నాడు.

అయిపోయింది - చిక్కిపోయాడు.

ఈసారి చాలా జాగ్రత్తపడుతున్నారీ పోలీసులు.

తప్పించుకునేందుకు మార్గమేమైనా వుందా?

ఎలా? ఒక్క మెదడేకాదు. యుగంధర్ శరీరంలోని ప్రతి అణువూ ఆలోచిస్తోంది.

గదిలోంచి బయటకు వచ్చారు అందరూ. అప్పటికే వీధిలో కూడా కొంతమంది జనం చేరారు. దాదాపు వందమంది.

జనంలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. ఎవరో యుగంధర్ మీద మట్టిబెడ్డ విసిరేశారు.

"హిందూస్థాన్ బద్మాష్" అని అరిచాడొకడు.

"చావబాదండి. ఎముకలు విరగ్గొట్టండి" మరొకడు కేకేశాడు.

యుగంధర్ ఒకసారి చుట్టూ కలయజూశాడు. ఏదో ఉపాయంతో, పోలీసుల తుపాకీల బారినించి తప్పించుకున్నా, ఈ జనాన్ని ఎలా తప్పించుకుంటాడు?

జీవితంలో మొట్టమొదటిసారి యుగంధర్‌కు నిస్పృహ కలిగింది. ఈ జీవిత యిలా అంతం కాబోతోందన్నమాట.

అంతలో టపటపమని చప్పుడు చేసుకుంటూ, ఒక మోటార్ సైకిలి వచ్చి ఆగింది. ఇంజన్ ఆఫ్ చేయడమేమిటి, మోటార్ సైకిల్ స్టాండ్ మీదికి లాగడమేంటి? సీనియర్ పోలీస్ ఉద్యోగి ఒక ఉరుకుతో రావడమేమిటి? అంతా ఒక నిమిషంలో జరిగింది. అతన్ని చూడగానే సార్జంట్ సెల్యూట్ చేశాడు. కానిస్టేబుల్స్ ఎటెన్షన్‌లో నిలుచున్నారు. ఆ పోలీస్ ఉద్యోగి నడుం మీద చేతులు పెట్టుకుని, సార్జంట్‌ని చాలా కోపంగా చూశాడు.

"నీ ఉద్దేశం ఏమిటి? పదివేల రూపాయల బహుమానం కోసం యింత బుద్ధి తక్కువ పనిచేస్తావా? యుగంధర్ యిక్కడున్నాడని తెలియగానే హెడ్‌క్వార్టర్స్‌కి ఫోన్ చెయ్యవద్దా?" మీసాలు మెలివేస్తూ అరిచాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ సార్. వీడు పారిపోతాడేమోనని"

"షటప్ ఈ విషయం యెవరో హెడ్ క్వార్టర్స్‌కి ఫోన్ చేశారు. కమీషనర్ నన్ను పంపించారు. నువ్వు సంజాయిషీ యేం చెప్పుకుంటావో కమిషనర్‌కే చెప్పుకో" చాలా క్రూరంగా ఉన్నాడు. కోపంగా వున్నాడు ఆ యిన్‌స్పెక్టర్. గజగజ వణికిపోతున్నాడు సార్జంట్.

"సర్ మీరే సర్ది"

ఇన్‌స్పెక్టర్ సార్జెంట్ మాటలు వినిపించుకోకుండా, యుగంధర్ ముందుకి వెళ్ళి నిలబడ్డాడు. "నువ్వేనా యుగంధర్‌వి? హిందూస్తాన్ గూఢచారివి" బొంగురుగా వుందతని కంఠస్వరం. డబ్బాలో రాళ్ళు దొర్లిస్తున్నట్లున్నాయి అతని మాటలు.

"తెలిసీ ఎందుకడుగుతున్నావ్? నేను యుగంధర్‌ని కాను అంటే వదిలేస్తావా?" అన్నాడు యుగంధర్.

"పైగా ఎదురు జవాబు చెపుతావా? ఫెడేలుమని యుగంధర్ దవడమీద అరిచేత్తో కొట్టాడు ఇన్‌స్పెక్టర్. "బుద్ధి వచ్చిందా? ఇంకా కావాలా?" అంటూ ఐదు నిమిషాల పాటు నిర్విరామంగా యుగంధర్‌ని ఈ దవడా ఆ దవడా ఫెడేల్ ఫెడేల్ మని కొట్టాడు. ఇంకా కసితీరనట్టు బూట్ కాలుతో యుగంధర్‌ని తలమీదా, మెడమీదా యుగంధర్‌ని తన్నుతూ దొర్లిస్తున్నాడు. ఎముకలు విరిగిపోతున్నట్లు, కండలు చితికిపోతున్నట్టు, తల బద్దలౌతున్నట్టు విపరీతమైన బాధతో యుగంధర్ మూలుగుతున్నాడు.

ఆ జనంలో జాలి గుండెలున్న ఒకరో, యిద్దరో 'అయ్యో పాపం చంపేస్తున్నాడు' అన్నారు. మరికొందరు 'ఇన్‌స్పెక్టర్‌కి మంచి ఛాన్స్' అన్నారు.

"చాలా? ఇంకా కావాలా?" అంటూ ఆ ఇన్‌స్పెక్టర్, యుగంధర్ చొక్కా పట్టుకుని లేవనెత్త ప్రయత్నించాడు. యుగంధర్ అంత బరువు మనిషిని ఎత్తలేక కోపంతో "బొమ్మలా నిలుచుంటారేం? ఎత్తండి" అరిచాడు కానిస్టేబుల్స్‌ని చూసి.

యుగంధర్ కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. మెడమీద తల నిలపలేకుండా వున్నాడు. "నాలుగు రోడ్లూ కలిసేచోట, మధ్యన నిలబెట్టి, బహిరంగంగా నిన్ను కాల్చి చంపమని ప్రెసిడెంట్ ఆర్డరు వేశారు. లేకపోతే యిక్కడే ఈ క్షణమే నిన్ను చంపేసేవాణ్ణి" అంటూ, సంకెళ్ళు వేశాడు యుగంధర్ చేతులకి.

యుగంధర్ని దగ్గర్లో వున్న జీప్‌లోకి తోసుకెళ్ళి పడేశాడు.

"మోటార్ సైకిల్ తీసుకురా, రిపోర్ట్ ఎట్ ది స్టేషన్" అరిచాడు ఇన్‌స్పెక్టర్ సార్జంట్‌ని చూసి.

సార్జంట్ సెల్యూట్ చేశాడు.

ఇన్‌స్పెక్టర్ జీప్ ఎక్కి కూర్చున్నాడు.

"కమాన్! స్టార్ట్ క్విక్" అన్నాడు. వెంటనే జీపు డ్రైవింగ్ సీటులోకి ఎక్కిజీప్ స్టార్ట్ చేశాడు పోలీసు డ్రైవర్.

జీపు వేగంగా వెళుతోంది. టంగ్ టంగ్ మని వెనుక నుంచి ఏదో చప్పుడు రావటం ప్రారంభించింది.

" చప్పుడేమిటి సార్. వెనుకనుంచి వస్తోంది" అడిగాడు డ్రైవర్.

"నువ్వు నోరు మూసుకుని డ్రైవ్ చెయ్యి."

మళ్ళీ, టంగ్ టంగ్ టంగ్ మని శబ్దం.

వీధుల్లో జనం లేరు. వీధి దీపాలుకూడా గుడ్డిగా వున్నాయి.

"ఔను. ఏదో చప్పుడు. ఆపు కారొకసారి, చూడాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

పోలీసు డ్రైవర్ జీపు ఆపాడు రోడ్డుపక్క. మరుక్షణం అతని మెడమీద ఒక్క దెబ్బ పడింది. మీద పిడుగుపడినట్లయింది.

ముందుకు పడిపోయాడు డ్రైవర్.

ఇన్‌స్పెక్టర్ వెనక్కి తిరిగి చూశాడు. యుగంధర్ కూర్చునున్నాడు. రెండు చేతులూ పైకెత్తి పెట్టి వున్నాయి.

పోలీస్ డ్రైవర్ని ఆ సంకెళ్ళతో కొట్టి వుండాలి. యుగంధర్ రెండు చేతులూ తన మీదకు వస్తున్నాయి. అంత బలంతో ఆ చేతులు తన మీద పడితే తల బద్దలైపోతుంది.

ఏదో అనబోతున్నాడు ఇన్‌స్పెక్టర్.

"నువ్వు రాజువని తెలుసులే. నా చేతికి సంకెళ్ళూడదీయ్" అన్నాడు యుగంధర్.

యుగంధర్ చేతి సంకెళ్ళు తీసేస్తూ "నేను రాజునని మీకెప్పుడు తెలిసింది? ఎలా తెలిసింది?" అడిగాడు రాజు.

"నీకు లక్షసార్లు చెప్పాను రాజూ, మారువేషం వేసుకున్నప్పుడు వేషమూ, రూపమూ, గొంతు మార్చుకుంటే చాలదు, నడకా, నిలుచునే తీరూ కూడా మార్చమని" అన్నాడు యుగంధర్.

ఆపత్ సమయంలో వచ్చినందుకు థేంక్స్ చెప్పడం పోయి పైగా కోప్పడుతున్నాడు.

"రాజూ, నువ్వు మోటారు సైకిల్ దిగి రెండడుగులు వేశావో లేదో తెలిసిపోయింది, నువ్వు రాజువని నీ నడకని బట్టి. అలా యిబ్బంది మొహం పెడతావేం? యూ డిడ్ ఏ గుడ్ జాబ్. ఒకటి రెండు దెబ్బలు గట్టిగా తగిలాయనుకో."

ఈ మాటలు మాట్లాడుతూ యుగంధర్ పోలీస్ కానిస్టేబుల్ యూనిఫారం తను వేసుకున్నాడు. డ్రైవర్ని వెనక సీట్లో పడుకోపెట్టి, యుగంధర్ జీప్ స్టార్ట్ చేశాడు.

"నువ్వు దొంగ ఇన్‌స్పెక్టర్‌వని, నన్ను విడిపించుకు పారిపోయావని, మనకోసం వేట ప్రారంభించడానికి ఇంకో గంటైనా పడుతుంది. ఆ లోపల మన ప్లాన్ ఆఫ్ ఏక్షన్ ఆలోచించాలి. ఇంతకీ రాజూ నువ్వు సమయానికి ఎలా వచ్చావ్?" అడిగాడు యుగంధర్.

రాజు చెప్పడం ప్రారంభించాడు.

హోటల్లో బల్లకిందనుంచి బయటికి వచ్చాడు రాజు. అప్పటికే అందరూ వీధిలోకి వెళ్ళిపోయారు. తనూ వాళ్ళ వెంట బయలుదేరాడు. పోలీస్ స్టేషన్ బాగా దూరంగా వుంటుందేమో, వాళ్ళు పోలీస్ స్టేషన్ చేరేలోగా యుగంధర్ వుంటున్న గది ఎక్కడుందో తెలుసుకుని ముందుగా వెళ్ళి హెచ్చరించవచ్చు అనుకున్నాడు. ఆ పాచికా పారలేదు.

పోలీస్ స్టేషన్ దగ్గర్లోనే వుంది. తను ఎవర్నీ ఏమీ అడక్కముందే, అందరూ పోలీస్ స్టేషన్‌లోకి వెళ్ళారు. లోపల సార్జంటూ, యిద్దరు కానిస్టేబుల్సూ వున్నారు. యుగంధర్ తమ గదిలో వున్నాడని ఆ యువకులు చెప్పగానే సార్జంటు లేచి నిలుచుని, పిస్తోలులో తూటాలు సరిజూసుకుని, కానిస్టేబుల్స్ వేపు తిరిగి, "తుపాకీలు తీసుకురండి పోదాం" అన్నాడు.

"సర్! స్టేషన్‌లో ఎవరూ లేరు" అన్నాడు కానిస్టేబుల్.

"స్టేషన్‌ని ఎవరూ ఎత్తుకుపోరు. పదండి" అంటూ సార్జంట్ బయలుదేరాడు.

జీప్‌లో ముందు సీటులో సార్జంటూ యిద్దరు కానిస్టేబుల్సూ ఎక్కారు. పోలీస్ డ్రైవర్ డ్రైవ్ చేస్తున్నాడు. ఆ కుర్రాళ్ళూ, అమ్మాయిలూ అంతా యెక్కేశారు వెనక సీట్లో. తనూ జీప్‌లో ఎక్కడానికి ప్రయత్నిస్తున్నాడు రాజు. ఎవరో పట్టుకుని వెనక్కి లాగారు. అతని మెడ చుట్టూ మెత్తని చేతులు పడ్డాయి. వెనక్కి తిరిగి చూశాడు.

"యూ బేడ్ బోయ్. యు ఆర్ గోయింగ్ ఎవే విథవుట్ మేకింక్ లవ్ టు మి" బల్లకింద దూరిన అమ్మాయి. ఆ అమ్మాయే, ఎప్పుడొచ్చిందో ఎలా వచ్చిందో? ఆ అమ్మాయి కౌగిల్లోంచి విడిపించుకునే లోపునే జీప్ వెళ్ళిపోయింది. గొంతు పిసికి చంపేయాలన్నంత కోపం వచ్చింది ఆ అమ్మాయి మీద రాజుకి.

జీప్ అటు వెళ్ళిందో లేదో యిటు నుంచి మోటార్ సైకిల్ ఒకటి వచ్చింది. పోలీస్ ఇన్‌స్పెక్టర్ దిగి స్టేషన్‌లోకి తొంగి చూసి, "ఎవరూ లేరే. ఏమైంది, ఏం జరిగింది?" అడిగాడు రాజుని.

ఇంతకన్నా మంచి అవకాశం దొరకదు. ఆలోచించను కూడా లేదు రాజు. ఆ పోలీసు ఇన్‌స్పెక్టర్ని కణతమీద ఒకటే ఒక దెబ్బకొట్టాడు. ఇన్‌స్పెక్టర్ స్పృహ తప్పి కిందపడ్డాడు ఆ ఒక్క దెబ్బకే.

"ఓ మై లవర్ యు ఆర్ యాజ్ స్ట్రాంగ్ యాజ్ శాంసన్" అంటూ ఆ యువతి రాజు మెడమీద ముద్దులు పెట్టుకుంటోంది. గొంగళి పురుగును దులిపినట్టు రాజు ఆమెను దులిపి పారేసి, ఇన్‌స్పెక్టర్ యూనిఫాం తీసి గబగబా వేసుకుని, మోటార్ సైకిల్‌ని ఒకే ఒక తన్నుతో స్టార్ట్ చేసి, స్పీడుగా పోనిచ్చాడు.

దూరాన ఎక్కడో కనిపిస్తోంది జోప్ టెయిల్ లైట్. మరీ దగ్గరగా వెళ్ళకూడదు. మరీ దూరంగా వుంటే జీప్ కనిపించకుండా పోవచ్చు. మోటార్ సైకిల్ మీద ఫీట్స్ చేయడం నేర్చుకున్నాడెప్పుడో రాజు. ఆ విద్య ఈనాడు, ఇప్పుడు ఉపకరించింది.

రెండు కాళ్ళూ హేండిల్ బార్ మీద పెట్టాడు. ఇప్పుడు చేతులు ఖాళీ అయ్యాయి. గడ్డం పీకేసి, మీసాలు యింకో రకంగా సర్దుకుని, కనుబొమలు దిద్దుకుని మార్చేసుకున్నాడు రూపం. ఇప్పుడతను హిప్పీకాడు. క్రూరంగా కనిపించే పోలీసు

ఇన్‌స్పెక్టర్, ఆ సార్జంటూ, కానిస్టేబులూ నమ్ముతారా, నమ్మరా అని కూడా ఆలోచించలేదు రాజు. గదమాయిస్తే, తను హెడ్‌క్వార్టర్స్ నించి వచ్చానని చెబితే యెవరికోసం నమ్మరు.

"సమయస్ఫూర్తి, సాహసం ప్రదర్శించావ్ రాజూ. నాకు గర్వంగా వుంది. యు హేవ్ డన్ ఏ వండర్ ఫుల్ జాబ్" అన్నాడు యుగంధర్, జీపు నెమ్మదిగా డ్రయివ్ చేస్తూన్నాడు.

"సర్! కొంచెం ఆపండి" అన్నాడు రాజు.

యుగంధర్ జీపు పక్కగా ఆపాడు.

పక్కనున్న ఒక యింటికారు షెడ్‌లోంచి కారు ఒకటి బయటికి వచ్చింది. ఇంట్లోంచి ఒకతను బయటికి వచ్చాడు.

"లోపల జాగ్రత్తగా గడియవేసుకో. మే తెల్లారేంతవరకూ రాం" అని అతనితో చెప్పి, ఆ కారులో వెళ్ళి వాళ్ళు వెళ్ళిపోయారు. షెడ్ తలుపు తెరిచే వుంది.

"ఈ జీపు వదిలించుకునేందుకు యిది మంచి అవకాశం" అన్నాడు రాజు.

"దిగు. జీప్ లోపలికి తోద్దాం" అంటూ దిగాడు యుగంధర్. జీపు కారు షెడ్‌లోకి తోసేసి యిద్దరూ బయటికి వచ్చేశారు.

"రాజూ మనిద్దరం కలిసి వెళ్ళడం కన్నా విడివిడిగా వెళ్ళిపోయామంటే పట్టుబడే ప్రమాదం తక్కువ. వీలయినంత త్వరలో ఈ యూనిఫారం వదిలించుకుని, వేషం మార్చుకో. జ్ఞాపకం వుంచుకో మనం రేపు సాయంకాలం జిన్నా పార్కులో కలుసుకోవాలి. మన ప్రాణాలు రక్షించుకోవడంలోనే సతమతమవుతున్నాం. షేక్ విషయం కనుక్కునేందుకు కూడా వీలులేకుండా పోతోంది. మనమిప్పుడు కాత్యా మీదే ఆధారపడి వున్నాం" అన్నాడు యుగందర్.

యుగంధరూ రాజూ చెరొక దారినా వెళ్ళిపోయారు.

16

"ఎక్కడి కెళుతున్నావు?" అడిగింది పోలీ.

"కూర్చుని కూర్చుని విసుగ్గా వుంది. అలా తిరిగి వస్తాను" జవాబు చెప్పింది కాత్యా.

"టిక్కాఖాన్ వచ్చే సమయానికి నువువ్ యిక్కడ లేకపోతే ఆయనకి కోపం వస్తుంది. జాగ్రత్త" అన్నది పోలీ.

కాత్యా నవ్వి, "మొదటి విషయం, టిక్కాకి నామీద కోపమే రాజు. రెండో విషయం, తనకి చాలా పనులున్నాయనీ, వొస్తే అర్ధరాత్రి ఎప్పుడో వస్తాననీ చెప్పారు. డోంట్ వర్రీ, బైబై" అనేసి కాత్యా హోటల్ యూనివర్స్‌లోంచి బయటకు వచ్చింది. తనని యెవరయినా వెంబడిస్తుంటే వాళ్ళకి అనుమానం రాకుండా వుండేందుకు, ఒక షాపులోకి వెళ్ళి హెయిర్ పిన్స్, ఇంకొక షాపులో లిప్‌స్టిక్, మరొకచోట జేబురుమాళ్ళు - అలా నాలుగు షాపులు తిరిగి, తనను ఎవరూ వెంబడించడంలేదని నిశ్చయించుకుని టాక్సీ ఎక్కింది కాత్యా.

జిన్నా పార్కుకు వెళ్ళమని చెప్పింది కాత్యా డ్రయివరికి.

పది నిముషాల్లో డ్రయివర్ పార్కుగేటు దగ్గర టాక్సీ ఆపాడు.

"లోపలికి తీసుకెళ్ళలా? యిక్కడే దిగుతారా?" అడిగాడు.

'కారు పార్కు లోపల తిరగగలిగినంత పెద్ద పార్కన్నమాట, అనుకుంది కాత్యా. టాక్సీ దిగి డబ్బిచ్చేసింది. నెమ్మదిగా పార్కులోకి వెళుతోంది. తను రూపం మార్చుకోలేదు. వేషమూ మార్చుకోలేదు. తనను పోల్చుకోగలరు యుగంధరూ, రాజూ. వాళ్ళు మారువేషాల్లో వుండి వుంటారు. తను వాళ్ళని పోల్చుకోవడం కష్టమవుతుంది.

రకరకాల వస్తువులమ్మేవాళ్ళు వేరు శనగపప్పులు, బఠాణీలు అమ్మే బళ్ళు కొన్ని, పళ్ళు, పానీపూరీలు అమ్మే బళ్ళు మరికొన్ని బెలూన్, పిల్లల ఆటవస్తువులు అమ్మేవాళ్ళు చాలామంది తిరుగుతున్నారు పార్కులో. పార్కు చాలా పెద్దదే అయినా జనంతో కిటకిటలాడుతోంది. యుగంధరూ, రాజూ తనని చూసి దగ్గరికి వచ్చినా, ఇంతమంది జనంలో ఎలా మాట్లాడుకోవడం? నింపాదిగా నడుస్తోంది. పిల్లలు పకపకా నవ్వుతున్నారు. అటు చూసింది. బఫూన్ టోపీ పెట్టుకుని, మొహానికి ఎర్రరంగు పూసుకుని, ఒక పక్కే మీసమూ, గడ్డమూ పెట్టుకున్నాడు. బఫూన్ చూడ్డానికే నవ్వొస్తున్నాడు. ఏవో అమ్ముతున్నాడు. "విచిత్రమైన వస్తువులు, తమాషా వస్తువులు ఐపోతున్నాయి. త్వరగా వచ్చి కొనుక్కోండి. ఎనభై రూపాయల ఎనిమిది పైసలిచ్చినా, ఎనిమిది రూపాయల ఎనిమిది పైసలిచ్చినా యివి దొరకవు. రండి" కీచు గొంతుతో అరుస్తున్నాడు.

ఏమిటో విచిత్రమైన వస్తువులు అనుకుంటూ కాత్యా దగ్గరికెళ్ళి చూస్తోంది.

"నీ పేరేమిటబ్బాయ్? ఇంద యీ కలం తీసుకో, దీనిమీద నీ పేరు రాయి" ఇచ్చాడు కలమూ, ఓ అట్టా, బఫూన్ ఓ అబ్బాయికి. ఆ అబ్బాయి తన పేరు రాయబోయాడు. కలం అట్టమీద పెట్టి నొక్కగానే, కలం వెనకనించి పిచికారితో కొట్టినట్టు ఎర్రని సిరా ఆ అబ్బాయి మొహం మీద జల్లులా పడింది. అందరూ ఘొల్లున నవ్వారు.

"దీని ఖరీదు ఎనభై ఎనిమిది పైసలే. కొనుక్కుని వెళ్ళి మీ స్నేహితుల్ని ఏడిపించు" అంటూ, సిగరెట్టు కాలుస్తూ నిలబడ్డ ఒక యువకుణ్ణి చూసి, "నేను మంచి సిగరెట్టిస్తాను తాగవయ్యా. ఇదిగో తీసుకో, జంకుతావెందుకు చేతిలో సిగరెట్ పారెయ్" బఫూన్ యువకుడికి ఒక సిగరెట్ యిచ్చాడు.

ఆ యువకుడు సిగరెట్ నోట్లో పెట్టుకుని వెలిగించాడో లేదో, సిగరెట్ టప్‌మని పేలింది. అందరూ మళ్ళీ ఘొల్లున నవ్వారు."

భయపడకయ్యా ఇది బాంబు కాదు. సిగరెట్‌లో చిన్న టపాకాయ పెట్టాను. బావుందా తమాషా?" అన్నాడు బఫూన్.

కాత్యాకి కూడా తమాషాగా వుంది. దగ్గరికి వెళ్ళి చూస్తోంది.

"మేడమ్, మేడమ్ మీకో విచిత్రం చూపిస్తాను. ఇది మేజిక్ స్లేట్. దీనిమీద ఏమన్నా రాయండి. తుడవక్కర్లేదు. నిమిషంలో అక్షరాలు మాయమౌతాయి మళ్ళీ రాయక్కర్లేదు. 'ఉఫ్', అంటే అవే అక్షరాలు వస్తాయి.' అంటూ ఆ బఫూన్, కాత్యాకి ఒక మేజిక్ స్లేటు యిచ్చాడు. దానిమీద 808 అని అంకెలు రాసి యిచ్చాడు. చూస్తుండగానే ఆ అంకెలు మాయమయ్యాయి. "నేను రాసి చూస్తాను తెండి" అని రాసే పుల్ల తీసుకుని, 'ఉఫ్' అని వూది, 808 అంకెలు మళ్ళీ రాగానే అంకెలకి ముందు 'X' అంకెల తరువాత '?' పెట్టింది. X 808?

ఆ బఫూన్ యింకెవరో కాదు, రాజు అని గ్రహించింది కాత్యా.

X 808?కి అర్థం 'యుగంధర్ ఏడి?' అని రాసి ఆ మేజిక్ స్లేట్ మళ్ళీ చేతిలోకి తీసుకుని, గబగబా కొన్ని గీతలు, కొన్ని చుక్కలు పెట్టి, కాత్యాకిచ్చాడు. కాత్యా డబ్బిచ్చింది. అక్కణ్ణించి వెళ్ళమన్నట్లు సంజ్ఞ చేశాడు రాజు కళ్ళతో. కాత్యా కాస్త దూరం వెళ్ళి ఎవరూ లేని బెంచీమీద కూర్చుని ఆ మేజిక్ స్లేట్ మీద 'ఉఫ్' అని ఊదింది.

**రాజు కోడ్‌లో రాసిచ్చాడు.** యుగంధర్ ఏ మారువేషంలో వున్నదీ తనకు తెలియదనీ, అనుకున్న ప్రకారం యీ పార్కుకు వస్తారనీ, ఆయనకు ఏ ఆపదా కలగలేదని తను ఆశిస్తున్నాననీ, కాత్యాకి తనకి కనుచూపు మేరలో ఎక్కడన్నా కూర్చోమనీ కోడ్‌లో రాశాడు రాజు.

కాత్యా అక్కడే కూర్చున్నది. చీకటి పడుతోంది. యుగంధర్ జాడలేదు. అంతలో జనంలో ఏదో కలకలం బయలుదేరింది. హడావిడిగా అందరూ లౌడ్‌స్పీకర్ వేపు పరుగెడుతున్నారు. అక్కడే వున్న లౌడ్ స్పీకరులోంచి వార్తలు ప్రారంభమయ్యాయి. రాజు కూడా అటు వెళ్ళడం చూసి, కాత్యాకూడా వెళ్ళింది.

"దిసీజ్ న్యూస్. ఈ రోజు మధ్యాహ్నం రెండు గంటలకి మనదేశం మీద దురాక్రమణ ప్రారంభించింది హిందూస్థాన్. పశ్చిమ బెంగాల్ వైపునుంచీ, త్రిపుర వైపు నుంచీ తూర్పు బెంగాల్‌లో ప్రవేశించింది హిందుస్థాన్ సైన్యం. మనదేశాన్ని కబళిద్దామనే యీ హిందుస్థాన్ ప్రయత్నాన్ని మనం ప్రతిఘటించాలి. తప్పదు. ప్రెసిడెంట్ యాహ్యాఖాన్ తగిన చర్య తీసుకున్నారు. మన విమానాలు అరగంట క్రితం శ్రీనగర్, అంబాలా, అమృతసర్ జలంధర్, జోధ్‌పూర్, ఆగ్రా, ఢిల్లీ నగరాలలో వున్న వైమానిక సైనిక స్థావరాల మీద దాడులు జరిపి, శత్రువులకు విశేషమైన నష్టం కలిగించాయి. మనం హిందూస్థాన్‌తో యుద్ధం చేస్తున్నాం. ఈ రాత్రి తొమ్మిది గంటలకు ప్రెసిడెంట్ ప్రజలనుద్దేశించి రేడియోలో ప్రసంగిస్తారు. ఈలోగా అధ్యక్షులు ఈ సందేశం ప్రజలకిచ్చారు. 'ప్రజలు ధైర్యంగా వుండాలి. పాకిస్తాన్‌కి పటిష్టమైన సైన్యమూ, శక్తివంతమైన వైమానిక దళమూ శత్రువుల్ని ప్రతిఘటించగల నౌకాదళమూ వున్నాయి. దురాక్రమణ జరుపుతున్న హిందుస్థాన్‌కి బుద్ధి చెప్పగలము' అన్నారు ప్రెసిడెంట్. ప్రజలకు బ్లాక్ అవుట్ గురించీ, విమాన దాడులప్పుడు తీసుకోవలసిన ఆత్మరక్షణ చర్యల గురించి చెబుతున్నాడు అనౌన్సరు.

ఒక నిట్టూర్పు వదిలింది కాత్యా.

భయపడినంతా అయింది. యుద్ధం వచ్చేసింది. పాకిస్తాన్‌కి ఏమిటో యీ ధైర్యం. తనకన్నా పదింతలు బలంగల భారతదేశాన్ని యుద్ధంలో ఎలా గెలవాలనుకుంటోందో? కయ్యానికి కాలు దువ్వుతోంది. ఎవరి అండచూసుకుని చైనా? అమెరికా?

"వారం పదిరోజులు చాలు, హిందుస్తాన్‌ని పప్పు చెయ్యడానికి సంధో శాంతో అంటూ మన ప్రెసిడెంట్ కాళ్ళమీద బడతారు వాళ్ళు" అన్నాడు ఎవడో ఆ గుంపులో.

ఎవడా మూర్ఖుడు? కాత్యా అటు చూసింది. అతనొక పఠాన్.

"హిందుస్తాన్ సైనికులు అర్భకులు. ఔనయ్యా! అవును. ఎస్" ఆవేశంలో ఆ పఠాన్‌కి మాటలు ఒకదాని మీద ఒకటి దొర్లుతున్నాయి.

"ఒక్క పాకిస్తాన్ సైనికుడు, ఎస్.ఎక్స్. 808 హిందుస్తాన్ సైనికుల్ని చంపగలడు" కాత్యా ఉలిక్కిపడి చూసింది అటు. అంత పొడుగ్గా, అంత భారీగా వున్న మనిషి యింకెవరు? యుగంధరే పఠాన్ వేషంలో వున్నాడు కనుక మోసపోయింది. అందరూ యుద్ధం గురించే మాట్లాడుతున్నారు. ఎవరికి వాళ్ళు తమకే ఎక్కువ తెలిసినట్టు, యుద్ధం ఎలా గెలవాలో ఏం చెయ్యాలో, యితర్లకి చెపుతున్నారు. ఆడా, మగా తేడాలు, ధనికులు, బీదలూ తేడాలూ, యువకులూ

వృద్ధులూ తేడాలు మర్చిపోయి, నలుగురూ, ఐదుగురూ కలిసి ఒక జట్టుగా చేరి, ఎక్కడో ఒకచోట చేరి మాట్లాడుకుంటున్నారు.

అందమైన ఒక యువతి, పిల్లలకి సామాన్లమ్ముకునే ఒక బఫూన్, ఒక పఠాన్ ఒక చోట కూర్చుని మాట్లాడుకుంటూంటే ఆ సమయంలో, ఎవ్వరికీ విడ్డూరంగా కనిపించటంలేదు. అప్పటివరకూ ఎవరు ఏం చేశారో ముగ్గురూ చెప్పుకున్నారు. తరువాత కార్యక్రమం ఆలోచించారు.

"టైం అవుతోంది. మనం ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోవడం మంచిది. యుద్ధం కూడా వచ్చేసింది. ఇంక మనకి వ్యవధిలేదు. కాత్యా మనం వచ్చిన పని సాధించాలంటే, అది నీమీద ఆధారపడివుంది" అన్నాడు యుగంధర్.

మళ్ళీ ఎప్పుడూ ఎలా కలుసుకోవాలో నిర్ణయించుకున్నారు. విడివిడిగా వెళ్ళిపోయారు వాళ్ళ ముగ్గురూ.

17

రాత్రి ఒంటిగంట దాటింది. కాత్యా గదిలో పచార్లు చేస్తోంది ఇటూ అటూ. అరగంటకోసారి ట్రాన్సిస్టర్‌లో వార్తలు వింటూనే వుంటోంది. ఆ వార్తలే నిజమయితే, భారతదేశంలో యిప్పుడు ఒక్క విమానం కాని, విమానాశ్ర్యంకాని లేకుండా పోయిందన్నమాట. భారత సైనికులు వేలకు వేలు చచ్చిపోయారన్నమాట. తుపాకీలని, టాములని, యుద్ధ సామాగ్రిని, యుద్ధరంగంలో వొదిలేసి భారత సైన్యం పారిపోతోంది. పాకిస్థాన్ సైన్యం వాటికి తట్టుకోలేక. ఈ వార్తలు ఎలా నమ్మడం? అన్నీ అబద్ధాలయ్యుండాలి. నిజానికి పాకిస్థాన్ సైన్యాలే పారిపోతూ వుండి వుండాలి. అంతలో తలుపు చప్పుడయింది.

"కమిన్" అన్నది కాత్యా. తలుపు తెరుచుకుని లోపలికి వచ్చాడు టిక్కాఖాన్.

"నువ్వూ వార్తలే వింటున్నావన్నమాట. యుద్ధం ప్రకటించాం" అన్నాడు ఖాన్.

అతని కోటు గుండీలు సర్దుతూ, "నువ్వూ వెళ్ళాలా టిక్కా" అన్నది ఆప్యాయంగా కాత్యా.

"రేప్పొద్దున్న వెళుతున్నాను. అలా భయపడతావేం? యుద్ధం చేయను. ఒకసారి చూసి వచ్చేస్తాను. అంతే రేపు రాత్రికి నీ దగ్గరే వుంటాగా?" అన్నాడు టిక్కా ఖాన్.

"థేంక్ గాడ్. అలసిపోయావు టిక్కా. కాసేపు పడుకో. రా"

"మై స్వీట్ డియర్ టైం లేదు. తెల్లారి నాలుగ్గంటలకి ప్రెసిడెంట్‌తో సమావేశం వుంది వెళ్ళాలి" అన్నాడు టిక్కా ఖాన్.

"మూడున్నరకి లేపుతా, కాసేపు పడుకో టిక్కా"

"వీల్లేదు. ఇంకో చిన్న పనుందిలోగా. ఒకసారి జెయిలుకి వెళ్ళి షేక్ ముజిబూర్ రహమాన్ విషయంలో జెయిలు సూపరింటెండెంటుకి కొన్ని ఆదేశాలిచ్చి రావాలి" అన్నాడు టిక్కా ఖాన్.

అతని పెదిమలమీద మునివేళ్ళతో చిటికలు వేస్తూ, "టిక్కా! నాదొక చిన్న కోరిక" అన్నది.

"చిన్న కోరికా? వొద్దు వొద్దు. పెద్దదే కోరుకో. ఇంకో వారం రోజుల్లో ఇండియా మనదయిపోతుంది. చెప్పు. నువ్వు వుండేందుకు పెద్ద బంగళా కావాలా? తాజ్‌మహల్ నీ కిచ్చేస్తాను" అన్నాడు.

"నేనంటే నీకంత యిష్టమా టిక్కా?"

టిక్కా ఖాన్ తలవూపాడు.

"నీ మాటలు గులాబీ పూలరేకుల్లా వున్నాయి. రేకుల్తో నా గుండెను చుట్టేస్తున్నావు. వెన్నెల్లో, తాజ్‌మహల్‌లో నీ వొళ్ళో పడుకుని, నేను.."

టిక్కాఖాన్ తన్మయత్వంతో కళ్ళు మూసుకున్నాడు.

"ఇప్పుడు అంత పెద్దది కోరటంలేదు. ఒక చిన్న కోరిక. హిందూస్థాన్‌కీ, పాకిస్థాన్‌కీ యుద్ధం తెచ్చి పెట్టిందెవరు?" అంది కాత్యా.

"షేక్ మజిబూర్ రహమాన్. అతనివల్లే వచ్చింది యుద్ధం" అన్నాడు టిక్కాఖాన్.

"వేలకి వేలు, లక్షలకి లక్షలు. ఇంతమంది ప్రాణాలు పోవడానికి కారకుడయిన ఆ షేక్ మొహం ఓసారి చూడాలనుంది టిక్కా"

టిక్కాఖాన్ పకపకా నవ్వాడు.

"ఆ కర్కోటకుడు మొహం చూడాలనుందా నీకు? మీ ఆడవాళ్ళకి విచిత్రమైన కోరికలుంటాయి పద నాతో" అన్నాడు.

"ఈయనే సెంట్రల్ జైల్ సూపరింటెండెంటు మేజర్ నియాజ్" అని కాత్యాకి పరిచయం చేసి, "మేజర్ వెంటనే నేను షేక్‌ని కలుసుకోవాలి. రండి" అన్నాడు టిక్కాఖాన్.

"ఎస్. జనరల్" అన్నాడు సూపరింటెండెంటు.

ముందు వార్డర్, సూపరింటెండెంట్, వెనక టిక్కాఖాన్, కాత్యా నడుస్తున్నారు.

నాలుగడుగులు వేశాక ఆగి, వెనక్కి తిరిగి "ఈమె?" అడిగాడు సూపరింటెండెంట్.

"బాధ్యత నాది. నడవండి టిక్కాఖాన్. కాత్యా వెయ్యి కళ్ళతో చూస్తోంది. సూపరింటెండెంట్ దూరాన్నించి చెయ్యి పైకెత్తి ఒక చూపుడు వేలు తప్ప మిగతా వేళ్ళన్నీ ముడిచి సిగ్నల్ యివ్వడం, ఆ సిగ్నల్ చూసి సెంట్రీలు తుపాకీలు కిందకు దింపడం, సూపరింటెండెంట్ తనే ముందు తలుపు దగ్గర కెళ్ళినా, వెనక వస్తున్న వార్డర్‌ని ముందు తాళం తీయమనడం - అంతా గమనించింది.

"కళ్ళు మూసుకుని పడక కుర్చీలో కూర్చునున్నాడు షేక్ మజిబూర్ రహమాన్" అన్నాడు తగ్గుస్థాయిలో.

షేక్ కళ్ళు తెరిచాడు. తలుపు వేపు చూశాడు నిశ్చలంగా.

టిక్కాఖాన్ కాత్యావేపు తిరిగి "చూశావుగా నువ్వు యిక సూపరింటెండెంట్‌తో వెళ్ళి ఆయన ఆఫీసులో కూర్చో. నేను మజిబూర్ రహమాన్‌తో ముఖ్యమైన విషయాలు మాట్లాడి వస్తాను" అని షేక్ వున్న గదిలోకి వెళ్ళి తలుపు మూసుకున్నాడు టిక్కాఖాన్.

కాత్యా సూపరింటెండెంటుతో అతని ఆఫీసు గదిలోకి వెళ్ళిపోయింది.

"టీ తెప్పించనా?" అడిగాడు సూపరింటెండెంటు.

అతను కొంచెం యిబ్బందిపడి, ఏదో మాట్లాడాలనుకుని "అందరూ యుద్ధరంగానికి వెళ్ళిపోతూ వుంటే, ఇక్కడ యీ ఆఫీసుగదిలో కూర్చోవడం యిబ్బందిగా వుంది. సమయం చూసి జనరల్‌తో ఒక మాట చెప్పండి" అన్నాడు.

"యూ ఆర్ ఎ ఫూల్. చంపడం, చావడం ఏం సరదా నీకు? అందులోనూ నీలాటి అందమైన మగాడు యుద్ధంకన్నా సరదా అయిన ఆట నేను నేర్పుతాను" అంటూ కాత్యా కుర్చీలోంచి లేచి అతని దగ్గరికి వెళ్ళి, అతని మెడచుట్టూ చేతులు వేసి గట్టిగా ముద్దు పెట్టుకుంది.

సూపరింటెండెంటు గజగజ వణికిపోయాడు.

"దయచేసి అక్కడ కూర్చోండి. ఏమిటీ పని?" అన్నాడు కంగారుగా.

కాత్యా పకపకా నవ్వింది. అతని దగ్గర్నుంచి కదలలేదు.

"ఎందుకలా భయపడుతున్నావు? జనరల్ టిక్కాఖాన్‌కి తెలుస్తుందనే. యుద్ధానికి వెళ్ళాలనుకునే ధీరుడికి యింత భయం వుండకూడదు" అంటూ మళ్ళీ అతన్ని ముద్దు పెట్టుకుని కొంచెం దూరం జరిగి, నవ్వుతూ "ఇప్పుడయితే రాజకీయాల కారణంగా యుద్ధాలు వస్తున్నాయిగాని, పూర్వం గొప్ప గొప్ప యుద్ధాలు ఆడవాళ్ళకోసం చేశారు తెలుసా? హెలెన్ ఆఫ్ ట్రాయ్, క్లియో పాత్రా. నియాజ్ భయపడకు. టిక్కా రేపు యుద్ధరంగానికి వెళ్తున్నాడు. రోజంతా ఖాళీగా వుంటాను. హోటల్ యూనివర్స్‌కి ఫోన్ చెయ్యి పొద్దున్నే. జ్ఞాపకం వుంచుకో. నా పేరు టీనా. ఎక్కడో కలుసుకుందాం, అండ్ లెటజ్ ప్లే ది గేమ్ ఆఫ్ లవ్" అతని కళ్ళల్లోకి చూసింది. చక్కలిగింతలు పెట్టే చూపు.

అంతవరకూ అతి కష్టం మీద, నిగ్రహం చూపిస్తున్న నియాజ్ యిక ఉండపట్టలేక, ఆమె నడుం చుట్టూ చేతులు వేసి దగ్గరకి లాక్కున్నాడు.

"బి కేర్‌ఫుల్. గౌను నలిగిపోతుంది" అని అతని చేతులు వదిలించుకుంటోంది. అంతలోనే బయట అడుగుల చప్పుడు వినిపించింది. ఇద్దరూ దూరంగా జరిగారు.

"నేను చస్తాను మొర్రో అంటే ఎవరాపగలరు? వాడి ఖర్మ" అంటూ టిక్కాఖాన్ లోపలికి వచ్చాడు.

"ఎవరు చస్తానంటున్నారు?" అడిగింది కాత్యా.

"ఆ మజిబూర్. తూర్పు పాకిస్తాన్‌లో హిందూస్తాన్ సైన్యాలు ప్రవేశించడం దురాక్రమణ అని, తూర్పు బెంగాల్‌కి, పశ్చిమ పాకిస్తాన్‌కి వచ్చిన మనస్పర్ధలు కుటుంబ కలహంలాటివని, యీ కలహంలో యితరులు జోక్యం కల్పించుకోకూడదని, వెంటనే ఒక ప్రకటన యియ్యమని చాలా నచ్చచెప్పి చూశాను. వింటేగా, మూర్ఖుడు. సర్వస్వతంత్ర బంగ్లాదేశ్ కావాలట" అన్నాడు టిక్కాఖాన్.

"అయితే యిప్పుడేం చేస్తారు?" అడిగింది కాత్యా.

"మునిగిపోయిందేమీ లేదు. ప్రెసిడెంట్ అడగమంటే అడిగాను. రెండు మూడు రోజుల్లో ఉరి తీయించేస్తాను. షేక్ మజిబూర్ రహ్మాన్ పీడ విరగడవుతుంది."

టిక్కాఖాన్‌తో కాత్యా బయలుదేరింది. తలుపువరకూ వెళ్ళాక వెనక్కి తిరిగి సూపరింటెండెంటుని చూసి, మునిపళ్ళతో కింద పెదిమను కొద్దిగా కొరికి, కన్ను గీటింది కాత్యా.

## 18

హోటల్లో తన గదిలో కిటికీ దగ్గర నిల్చునుంది కాత్యా.

టిక్కాఖాన్ తనని హోటల్లో వదిలి వెళ్ళిపోయి చాలాసేపయింది. ఇంకో గంటో గంటన్నరలోనో సూర్యుడు ఉదయిస్తాడు. ఈ కాసేపట్లో ఏం నిద్రపోతుంది తను. చీకట్లోకి చూస్తోంది. దూరాన అక్కడక్కడా గుడ్డిగా

వెలుగుతున్నాయి దీపాలు. అంతలో 'కుయ్యో'మని వినిపించింది సైరన్ మోత. ఆ మోత ఆగకముందే, విమానాల హోరు. ఆ హోరుతోపాటు ఏంటీ ఎయిర్ క్రాఫ్ట్ గన్స్ దడదడలు. కాత్యా మొహం సంతోషంతో వెలిగింది. పాకిస్తాన్ విమానలు భారతదేశం మీద దాడులు చేస్తే, వూరుకోవడానికి భారత వైమానికులు గాజులు తొడిగించుకు కూర్చోలేదు. తను మర్చేపోయింది. గదిలో దీపం వెలుగుతోంది.

"లైటాఫ్! లైటాఫ్" కేక వినిపించింది కిందనుంచి. ఆర్పేసింది దీపం.

సివిల్ డిఫెన్స్ వాళ్ళే అయిఉండాలి.

"లైటాఫ్! లైటాఫ్" మళ్ళీ కేకలేస్తున్నారు.

అప్పుడు గుర్తుపట్టిందా కంఠస్వరం. అది డిటెక్టివ్ యుగంధర్‌ది. సాయంకాలం పఠాన్ వేషంలో వున్న యుగంధర్, యీ కాసేపట్లో సివిల్ డిఫెన్స్‌లో ఎలా చేరాడు? చేరినవాడు యీ హోటల్ దగ్గరికి ఎలా వచ్చాడు? అందుకే యుగంధర్‌ని గొప్పవాడంటారు అందరూ.

ఎలా? తను యుగంధర్ని కలుసుకోవాలి ఒక్క నిమిషం. ఆ విషయం చెప్పాలి.

ఇక్కణ్ణించి బయటకి వీధిలోకి వెళ్ళడానికి వీల్లేదు, ఆ పోలీ కింద హాల్లోనే కూర్చుని వుంటుంది. ఏం చెయ్యాలి? టప్‌మని ఏదో గదిలో పడింది. ఏమిటది? దీపం వెయ్యడానికి వీల్లేదు. మోకాలు మీద వొంగి నేలమీద తడమడం ప్రారంభించింది.

"కాత్యా నువ్వొంటిగా వున్నావా?" స్పష్టంగా దగ్గర్నుంచి వినపడ్డాయి మాటలు. అది యుగంధర్ కంఠస్వరమే.

ఎలా వచ్చాడు పైకి? ఆశ్చర్యం. ఏ నీటిగొట్టమో పట్టుకుని పైకి ఎక్కేశారేమో? త్వరత్వరగా కిటికీ దగ్గరికి వెళ్ళి తొంగి చూసింది. ఎవరూ లేరు.

"చెప్పు. నువ్వొంటిగానే వున్నావా?" ఈసారి గదిలోంచి వెనుకనుంచి వినిపించాయి ఆ మాటలు. ఇక నిగ్రహం కోల్పోయింది. దీపం వెలిగించింది.

"లైటాఫ్" దగ్గర్లోంచి, గదిలోంచి వినిపించింది.

"మతి పోగొట్టుకుంటున్నావ్. నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పు" యుగంధర్ ప్రశ్న.

"అవును. వొంటిగానే వున్నాను. మీరెక్కడున్నారు? ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నారు?" అడిగింది.

"నేను కిటికీ కింద రోడ్డుమీద నిలుచునున్నాను. నీ కిటికీలోంచి లోపలికి విసిరేశాను, మినియేచర్ టెలిఫోన్. వెతికి తీసుకుని లైటాఫ్ చెయ్యి. క్విక్." కాత్యా అప్పుడు చూసింది నేలమీద. పేనిన రెండు తీగెలు. ఆ తీగల చివర్ని అగ్గిపెట్టె కన్న చిన్నగా వున్న రెండు చిన్న ప్లాస్టిక్ ముక్కలు. ఒకటి మౌత్‌పీస్, యింకొకటి యియర్‌పీస్. అది చేతిలోకి తీసుకుని లైటాఫ్ చేసింది. ఆ తర్వాత నింపాదిగా చెప్పింది యుగంధర్‌కి సెంట్రల్ జైల్‌కి వెళ్ళడం, జైలు సూపరింటెండెంట్‌ని తను వల్లో వేసుకోవడానికి ప్రయత్నించడం, తదితర వివరాలు.

"ఆ సూపరింటెండెంట్ నీ అందానికి దాసుడౌతాడని నాకు పూర్తిగా నమ్మకం వుంది. అతను నీకు ఫోన్ చేస్తాడు. జిన్నా పార్కు గేటూ దగ్గర కలుసుకోమని చెప్పు. ఎన్ని గంటలకయినా సరే, నేనుంటాను" అన్నాడు యుగంధర్.

"దీన్నేం చేయను?" అడిగింది కాత్యా చేతిలో వున్న మినియేచర్ టెలిఫోన్ విషయం.

"అలాగే కిందకి జారవిడిచెయ్. విష్ యు గుడ్‌లక్" అన్నాడు యుగంధర్.

19

ఫుల్ సూట్ వేసుకున్నాడు. అందంగా తలదువ్వుకున్నాడు.

ఇటూ అటూ చూస్తున్నాడు ఆశతో. అరగంటనుంచీ అక్కడే నిలబడున్నాడు జెయిలు సూపరింటెండెంట్ మేజర్ నియాజ్.

"సార్"

పక్కకి తిరిగి చూశాడు. జారిపోతున్న పాంటు, మాసిపోయిన కోటు వేసుకున్న యువకుడు పక్కన నిలుచున్నాడు.

"పొద్దు పోవడంలేదా సార్? రండి సార్, ఖుషీ చెయ్యవచ్చు" అన్నాడా వచ్చిన మనిషి.

తను యూనిఫాంలో వున్నట్టయితే డొక్కలో ఒక తన్ను తన్నేవాడు. కాకపోయినా యీడ్చి చెంపమీద కొట్టేవాడు. 'కాని గొడవ చెయ్యడానికిది సమయంకాదు' అనుకున్నాడు మేజర్ నియాజ్.

"నువ్వు వెళ్ళు. నాకేం అవసరంలేదు" అన్నాడు విసుగ్గా.

ఆ వచ్చిన మనిషి కొంచెం దూరం వెళ్ళి సూపరింటెండెంట్‌ని వోరకంట కనిపెడుతూనే వున్నాడు బీడీ తాగుతూ.

పది నిమిషాల తర్వాత పార్క్ గేట్ ముందు టాక్సీ ఆగింది. అందులోంచి దిగింది కాత్యా. వెళ్ళిపోతోంది సూపరింటెండెంటు ముందు నించే.

"టీనా!" అన్నాడు నెమ్మదిగా సుపరింటెండెంట్.

"నువ్వా? ఈ డ్రస్‌లో నిన్ను గుర్తుపట్టనేలేదు" అన్నది కాత్యా నవ్వుతూ.

"ఏం? బాగాలేనా?" అడిగాడు నియాజ్.

"నీ అందం పదింతలు పెరిగింది యూనిఫాం లేకపోతే. ఈ సూటు లేకపోతే"

**సూపరింటెండెంట్** ముఖం వికసించింది.

"పద పోదాం" అన్నాడు.

"ఎక్కడికి?" అడిగింది.

"పార్కులోకి" అన్నాడు.

"వేస్టు ఆఫ్ టైమ్. పదిమందితో పాటు నీతో పార్కులో కూర్చోడానికా నేను వచ్చింది?" అన్నది కాత్యా విసుగ్గా.

"పోనీ ఏ హోటలు కన్నా.."

"ప్రమాదం. టిక్కాకి తెలిస్తే, ఇద్దర్నీ చంపేస్తాడు."

"పోనీ నా స్నేహితుడొకడున్నాడు, వాడింటికి."

"అది కూడా డేంజరస్. ఆ స్నేహితుడు అతని స్నేహితులతో చెప్పి, అలా అలా టిక్కా వరకూ పోతుంది. రహస్యంగా, ఎవ్వరికీ తెలియకుండా గోప్యంగా జరగాలి" అంది కాత్యా.

"అటువంటి చోటు ఏదా అని ఆలోచిస్తున్నాను" అంటున్నాడు. అతని కళ్ళు బీడీ కాల్చుకుంటున్న ఆ యువకుడి మీద పడ్డాయి. దగ్గరకి పిల్చి నెమ్మదిగా అడిగాడు చోటు కావాలని.

"అదా! సరుకు నీ దగ్గరే ఉందన్నమాట. చోటు కావాలా? అదెంతసేపు రండి. మన బండి అవతలి పక్కవుంది. మీ యిష్టం ఎన్నిరోజులన్నా వుండొచ్చు" అంటూ ఆ యువకుడు దారి తీశాడు. కాత్యా, సూపరింటెండెంట్ అతని వెనకే వెళ్ళారు. కాస్త దూరంలో ఓ కారు ఆగి వుంది. కాత్యా, సూపరింటెండెంట్ వెనక సీట్లో కూర్చున్నారు. ఆ యువకుడు ముందు సీట్లో కూర్చుని డ్రయివర్ చెవిలో ఏదో చెప్పాడు. కారు స్టార్టు చేశాడు డ్రయివరు ఇరవై నిమిషాలపాటు తిప్పాడు సందులూ, గొందులూ. చివరికి ఒకపాత యింటి కాంపౌండులో కారు ఆపాడు.

ఆ యువకుడు దిగి, కాత్యానీ, మేజర్ నియాజ్‌నీ లోపలకి రమ్మన్నాడు. ఒక హాలూ, రెండూ గదులూ దాటాక, ఒక చిన్న గదిలోకి తీసుకెళ్ళాడు.

"ఒక రోజుకి రెండువందల రూపాయలివ్వాలి సార్. నేను బయటే వుంటాను. మీకేమైనా కావాలంటే నన్ను పిలవండి" అంటూ చెయ్యిచాపాడు. ఆ యువకుడు.

సూపరింటెండెంట్ యిచ్చేశాడు డబ్బు. ఆ యువకుడు బయటికి వెళ్ళిపోయాడు. కాత్యా తలుపు మూసింది. నియాజ్ చాలా ఆత్రంగా వున్నాడు. కాత్యామీద ముద్దుల వర్షం కురిపించాడు, రెండు చేతుల్లో బంధించి నలిపేస్తున్నాడు. రెచ్చిపోతున్నాడు. కాత్యా తలుపు వేపు చూస్తోంది క్షణక్షణానికీ. ఇంక వూరుకోడు, చాలా ఆకలిగా వున్నాడు నియాజ్.

"ఎవరు?" అడిగాడు సూపరింటెండెంట్ నియాజ్.

"తలుపు తియ్యి" అది గంభీరమైన కంఠస్వరం. కాత్యా గుర్తుపట్టింది. యుగంధర్‌ది. సూపరింటెండెంట్ గజగజ వొణుకుతున్నాడు. కాత్యా వెళ్ళి తలుపు తెరిచింది.

తలుపుకి అవతల నిలుచుని వున్నారు కారు డ్రయివరూ, కాత్యానీ, సూపరింటెండెంట్‌నీ తీసుకు వచ్చిన యువకుడు.

"మేజర్ నియాజ్! జనరల్ టిక్కాఖాన్ ప్రియురాలితో ప్రేమ కలపాలు చెయ్యడానికి నీకెన్ని గుండెలున్నాయి? ఈ టీనాను గురించి, జనరల్ టిక్కాఖాన్‌కు మొదటినుంచీ అనుమానం వుంది. అందుకే టీనాని ఒక కంట కనిపెట్టమని మమ్మల్ని నియమించాడు" అన్నాడు కారు డ్రయివర్ వేషంలో వున్న యుగంధర్.

"మీరెవరు?" అడిగాడు సూపరింటెండెంట్.

"మేం ఇంటెలిజెన్స్ డిపార్టుమెంటు మనుషులం" జవాబు చెప్పాడు, బీడీ తాగుతున్న యువకుడి వేషంలో వున్న రాజు.

"ఆ విషయం మీరు జనరల్‌నే అడగండి. సూపరింటెండెంట్. ఈ కెమెరా చూశావా. ఇది పోల్ రాయిడ్ కెమెరా. ఫొటో తియ్యగానే, యిందులోంచి ఫోటో బయటికి వస్తుంది. చూడు ఎన్ని ఫోటోలు తీశామో" ఫోటోలు చూపిస్తూ, "తగిన సాక్ష్యం చూపిస్తేనేగాని, జనరల్ టిక్కాఖాన్ నమ్మరని ఫోటోలు కూడా తీశాం. ఈ ఫోటోలు చూడగానే జనరల్ మీ యిద్దర్నీ -" వాక్యం పూర్తి చేయకుండా వదిలేశాడు యుగంధర్. కాత్యా వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"మిమ్మల్ని చంపి అంతటితో వదిలి పెట్టడు టిక్కాఖాన్. నీ భార్యనీ, పిల్లల్నీ  పాపం ఆ టిక్కాఖాన్ ఎలాటి వాడో నీకు తెలుసు" అన్నాడు రాజు.

"నియాజ్! డబ్బిచ్చో, ఎలాగో ఓలాగ యీ రహస్యం బైటపెట్ట వద్దని చెప్పి వొప్పించు ప్లీజ్" అన్నది కాత్యా.

నియాజ్ రెండు నిమిషాలపాటు మౌనంగా వుండిపోయాడు. "మీకెంత డబ్బు కావాలో చెప్పండి. అంతా యిస్తాను. ఈ ఫోటోలు చింపెయ్యండి. ఈ రహస్యం బైట పెట్టకండి" అన్నాడు దీనంగా.

యుగంధర్ నవ్వి "మాకు లంచమిచ్చేంత డబ్బు నీ దగ్గరేముంది పద" అని నియాజ్ మెడమీద చెయ్యివేశాడు.

ఏడుస్తున్నాడు నియాజ్.

"ఈ జీవితాంతమూ మీకు ఋణపడి వుంటాను. ఈ రహస్యం బైట పెట్టకండి. మీరు చెప్పినట్టు చేస్తాను."

"నిజంగానా?" అడిగాడు యుగంధర్.

నియాజ్ మాట్లాడలేక ఊపాడు తల.

"ఐతే నాతో రా. కార్లో పోదాం మీ యింటికి. యుద్ధమొచ్చింది గనక, కొన్ని రోజులపాటు నీకు చాలా పనివుంటుందనీ, యింటికి రానని నీ భార్యకి, పిల్లలకి చెప్పు. తరువాత నీ యూనిఫాం తీసుకుని కారెక్కు" అన్నాడు యుగంధర్.

"ఎందుకు?" అడిగాడు నియాజ్.

"నువ్వు ప్రశ్నలు వెయ్యకూడదు. చెప్పినట్టు చెయ్యాలి. అంతే నిన్ను మళ్ళీ యిక్కడికి, యీ యింటికి తీసుకు వస్తాం. కొన్ని రోజులపాటు, యిక్కడే వుండాలి నువ్వు. నీ భోజన సదుపాయాలు ఇతను చూసుకుంటాడు" అని రాజును చూపించి, "చెప్పు. ఒప్పుకుంటావా నియాజ్" అడిగాడు యుగంధర్.

"ఒప్పుకో నియాజ్. మన ప్రాణాల కన్నానా? మన ప్రాణాలే కాదు, నీ భార్యా పిల్లల ప్రాణాలు కూడా. ఆలోచించు. ఒప్పుకో" అంది కాత్యా.

నియాజ్ తలవూపాడు. యుగంధరూ, నియాజ్ వెళ్ళిపోయారు.

"ఇంతవరకూ మన పథకం జయప్రదంగానే సాగింది" అన్నాడు రాజు కాత్యాతో.

"అవును రాజూ" అని ఒక నిముషం తర్వాత, "ఇక్కడ నీకోసం, యుగంధర్ కోసం ప్రజలూ, పోలీసులూ, సైనికులూ అందరూ వెతుకుతున్నారు. అయినా శత్రువులకి చిక్కకుండా, వేషాలు మార్చుకుంటున్నారు. బాగానే వుంది. ఈ యిల్లూ, యీ కారూ యివి ఎట్లా సంపాదించారా అని ఆశ్చర్యంగా వుంది" అన్నది కాత్యా.

"మొదట్లో చాలా కష్టపడ్డాం వేషాలు మార్చుకునేందుకు స్థలం దొరక్కా, అవకాశం రాకా. యుద్ధం వచ్చేసిన తర్వాత మా పని సులువైపోయింది. యుద్ధం గొడవలో మా యిద్దరి విషయం ఎవరూ పట్టించుకోవడంలేదు. కారు కొన్నాము. డబ్బిచ్చి యిల్లు అద్దెకు తీసుకున్నాము" అన్నాడు రాజు.

అరగంట దాటిపోయింది. యుగంధరూ నియాజ్ తిరిగి వచ్చారు. నియాజ్‌ని గదిలోకి పంపించి తలుపు బయట గొళ్ళెం పెట్టి యుగంధరూ, కాత్యా, రాజూ యింకో గదిలోకి వెళ్ళారు. చిన్న తోలుపెట్టె తెరిచి, అందులోంచి అద్దమూ, మేకప్ సామానూ బయటికి తీసి నియాజ్ ఫోటో ఒకటి ముందు పెట్టుకుని తన రూపాన్ని నియాజ్ పోలికలోకి మార్చుకుంటున్నాడు యుగంధర్. కాత్యా అప్పుడప్పుడూ దిద్దుతోంది. రాజు సలహాలు చెప్తున్నాడు.

ఇంకో అరగంట గడిచిపోయింది. లేచి నిలుచుని యూనిఫారం వేసుకున్నాడు యుగంధర్.

"ఎక్సలెంట్" అన్నాడు రాజు.

నాకేదో భయంగా వుంది. మీరు వెళ్తున్నది జైల్లోకి. అందులోంచి బయటకు వస్తారో రారో అని" అన్నది కాత్యా దిగులుగా.

''అలాటి మాటలు మాట్లాడకూడదు కాత్యా 'బంగ్లాదేశ్ ఏకైక నాయకుడు, షేక్ మజిబూర్ రహమాన్‌తో సహా త్వరగా రండి' అనాలి నువ్వు. మనకి జయం కలగాలని భగవంతుణ్ణి ప్రార్థించు'' అని కాత్యా భుజం తట్టి, రాజును చూసి తను వెళ్తున్నానని చెయ్యి వూపి వెళ్ళిపోయాడు యుగంధర్ - సెంట్రల్ జైల్‌కి.

20

ఎటు వెళ్ళాలో, సూపరింటెండెంట్ ఆఫీసు గది ఎక్కడున్నదో, ఆ వివరాలన్నీ యుగంధర్‌కి కాత్యా స్పష్టంగా చెప్పింది.

సెంట్రీలకు గానీ మరెవరికి గానీ ఎటువంటి అనుమానమూ కలగలేదు.

యుగంధర్ సూపరింటెండెంట్ ఆఫీసు గదిలోకి వెళ్ళి కూర్చున్నాడు. జైలు సూపరింటెండెంట్‌గా, తన పని నిర్వహించడంలో బయటపడిపోతాననే భయంలేదు యుగంధర్‌కి. పాతికేళ్ళ క్రితం పాకిస్తాన్ అనేది లేదు. ఇండియా అంతా బ్రిటిష్ సామ్రాజ్యంలోనే వుండేది. పాకిస్తాన్ ఇండియాలలో యీనాటి పరిపాలనా విధానమూ, యంత్రాంగమూ, ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యం రోజులదే భారతదేశం జైళ్ళలో అధికార నిర్వహణ ఎలా వుంటుందో యిక్కడా అలాగే వుంటుందని యుగంధర్‌కి తెలుసు.

అరగంటసేపు ఒంటిగా కూర్చున్నాడు గదిలో, బల్లమీద కాగితాలు చూసుకుంటూ స్వింగ్ డోర్స్ తెరుచుకునేటప్పటికి, యుగంధర్ తలెత్తి చూశాడు.

''ఎక్కడకో వెళ్ళొచ్చినట్టున్నారు'' అంటూ వార్డర్ గదిలోకి వచ్చాడు.

''వచ్చి అరగంటయింది. ఏం?'' అడిగాడు యుగంధర్.

''ఏమీ లేదు. ఊరికినే అడిగాను. టైం అయింది. భోజనం తీసుకుని వెళ్ళాలి. వస్తారా?'' అడిగాడు వార్డర్.

ఇద్దరూ తలుపు వరకూ వెళ్ళారు.

''మొట్టమొదటిసారి యిదే మీరు మర్చిపోవడం'' అన్నాడు వార్డర్.

''ఏమిటి మర్చిపోయాను?'' అడిగాడు యుగంధర్.

''ఇన్ని రోజులుగా చూస్తున్నాను. ఎప్పుడూ మీరిలా మర్చిపోలేదు. ఇవ్వాళ చాలా పరధ్యానంగా వున్నట్లున్నారు'' అన్నాడు వార్డర్.

తనేమిటి మర్చిపోయాడు? ఆ మర్చిపోయిందేమిటో చెప్పడేం? తను సూపరింటెండెంట్ కాడని తెలుసుకున్నాడా? ఎలుకతో పిల్లి చెలగాటం ఆడినట్లు ఆడుతున్నాడా? చూద్దాం అనుకున్నాడు లోలోన యుగంధర్.

''అవును. ఇవ్వాళ విసుగ్గా వుంది. పదండి.''

ఇద్దరూ మెయిన్ బిల్డింగులోంచి బయటకెళ్ళారు. సెంట్రీలకు సిగ్నల్ చూపించడం, వార్డర్‌ని ముందర తాళం తీయమనడం, షేక్ బంధింపబడ్డ గదిలోకి వెళ్ళడం, ఇవన్నీ సవ్యంగానే సాగాయి. భోజనం ట్రే గదిలో బల్లమీద పెట్టాడు వార్డర్. షేక్ తలెత్తికూడా చూడలేదు.

ఏదో మిషమీద వార్డర్‌ని గదిలోంచి బయటకు పంపిస్తే, షేక్‌తో రెండు మాటలు మాట్లాడవచ్చు. తొందరపడకూడదు. అవకాశం వచ్చినప్పుడే మాట్లాడవచ్చు.

ఇద్దరూ గదిలోంచి బయటకు వచ్చారు. తలుపు మూసి గడియ పెట్టాడు వార్డర్. అతను తాళం వేయడానికి యుగంధర్ కాచుకున్నాడు. వార్డర్ తలుపు తాళం వేయలేదు. తలుపు దగ్గరే నిలబడ్డారు యిద్దరూ. ఒక్క నిమిషం గడిచింది. వార్డర్ తనని చూస్తున్నాడు. అతని వేపు చూడక తప్పలేదు. మరొక నిమిషం గడిచింది.

వార్డర్ ఒక చిన్న నవ్వు నవ్వి, "సూపరింటెండెంట్ మీరింకా చిరాగ్గా వున్నట్లున్నారు" అన్నాడు.

"అవును. నా మనసు బాగోలేదు. త్వరగా తాళం వెయ్యండి. వెళ్ళాలి" అన్నాడు యుగంధర్.

"ఇన్నిరోజులుగా మనం రోజూ చేస్తున్న పని మీరెలా మర్చిపోతున్నారు. ముందు తాళం వెయ్యవలసింది మీరు" అన్నాడు వార్డర్.

"ఛఛ ఎంత చిన్న తప్పుచేశాడు తను. తాళం తీస్తున్నప్పుడు పైనున్న తాళం వార్డర్ వేసినది. కిందనున్నది సూపరింటెండెంట్ వేసినది. కింద సూపరింటెండెంట్ వేసిన తాళం వుండాలంటే సూపరింటెండెంటే మొదట తాళం వెయ్యాలి. ఇది గ్రహించడానికి గొప్ప తెలివి తేటలు అవసరంలేదు. స్కూలు కుర్రాడు కూడా గ్రహిస్తాడు. తను ఎందుకు యిలాటి పొరపాటు చేశాడు? యింకా యిలాంటి రెండు మూడు పొరపాట్లు చేస్తే తన ప్రాణానికి ముప్పు అని తనను తనే నిందించుకున్నాడు యుగంధర్.

యుగంధర్ మొదట తాళం వేశాడు. తరవాత వార్డర్ తాలం వేశాడు. మెయిన్ బిల్డింగు వరకూ వచ్చాక సెల్యూట్ చేసి తన తోవన తను వెళ్ళిపోయాడు వార్డర్. యుగంధర్ ఆఫీసులోకి వెళ్ళి కూర్చున్నాడు. కోటు జేబులో చెయ్యి పెట్టి, సిగరెట్టు కేసంత చిన్న రేడియో ట్రాన్స్ మీటర్ స్విచ్ నొక్కాడు. దాని పక్కనే వున్న చిన్న బటన్ స్విచ్ మీద వేలుపెట్టి, ఒక వేలుతో టైపు చేస్తున్నట్టు నొక్కడం ప్రారంభించాడు. చప్పుడేమీ కావటంలేదు. ఎవరన్నా గదిలో కొచ్చినా ఎటువంటి అనుమానమూ కలగదు. కోటు జేబులో చెయ్యిపెట్టి కూర్చున్నాడు అనుకుంటారు.

బీప్...బీప్... బిపీప్.. బిపీప్.

సన్నగా ఈ శబ్దాలు వినబడగానే రాజు ట్రాన్స్‌మీటర్ జేబులోంచి తీశాడు. యుగంధర్ జేబులో విన్న మినియేచర్ ట్రాన్స్ మీటర్ కమ్ రిసీవర్ సెట్‌లాటిదే ఇది కూడా.

కాయితమూ, పెన్సిలూ తీసుకుని ఆ శబ్దాలు రాసుకున్నాడు. అది కోడ్ డీ సైఫర్ చేశాడు. క్షణంలో కనుక్కుని వస్తానని తను కూడా వార్త పంపాడు రాజు. నియాజ్ వున్న గది తలుపు తెరిచి, లోపలికి వెళ్ళి "నియాజ్ నువ్వు నీ ఆఫీసు గదిలోంచి వెళ్ళేప్పుడు మర్చిపోకుండా తప్పనిసరిగా వో పని చేస్తావట, ఏమిటది?" అడిగాడు రాజు.

"ఎందుకు?" ఎదురు ప్రశ్న వేశాడు నియాజ్.

"అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పు" కోపంగా చూశాడు రాజు.

"నా బల్లమీది కాగితాలను బల్లసొరుగుల్లో పెట్టి తాళం వేసి వెళతాను" చెప్పాడు నియాజ్.

"థాంక్యూ ఇలా మంచిగా వుంటే నీకు ఏ ఆపదా రాదు" అని రాజు గదిలోంచి బయటికి వెళ్ళి తలుపు మూసి ట్రాన్స్ మీటర్ జేబులోంచి తీశాడు.

బీప్..బీప్...బీప్..

యుగంధర్ జేబులో ట్రాన్స్‌మీటర్ కూస్తోంది సన్నగా. ఆ కోడ్, కాయితం మీద రాసుకున్నాడు యుగంధర్. అర్ధమయింది కాయితాన్ని చింపి బుట్టలో పారేశాడు.

అంతలో స్ప్రింగ్ డోర్స్ తెరుచుకుని లోపలకు వచ్చాడు వార్డర్. తిన్నగా బల్లదగ్గర కొచ్చి, రెండు చేతులూ ఆనించి ముందుకు వంగి "ఇకనించీ బల్లమీద కాయితాలు సొరుగులో దాస్తారన్నమాట ఎవరు మీరు? సూపరింటెండెంట్ నియాజ్ ఏమయ్యారు?" అడిగాడు వార్డర్.

యుగంధర్ వార్డర్ కళ్ళల్లోకి చూశాడు సూటిగా, ఇతనికి ఎంత తెలుసు. ఎంత వూహిస్తున్నాడు. రాజు తనకు పంపిన కోడ్ విన్నాడా? విన్నా డీ సైఫర్ చేయగలిగాడా? ఎలా చేయగలడు? ఈ కోడ్ తనకూ, రాజుకూ, ఇండియన్ స్పెషల్ బ్రాంచి ఏజెంట్లకి మాత్రమే తెలుసనుకున్నాడే డీ కోడింగ్ ప్రవీణులు కొన్ని రోజులపాటు తంటాలు పడితే తమ కోడ్ డీ సైఫర్ చేయగలుగుతారేమోగాని, ఎవరూ క్షణాలలో డీ కోడ్ చేయలేరు. ఏమైనా తను ఆపదలో పడ్డాడు.

జేబులోంచి పిస్టల్ తీశాడు. గురి పెట్టాడు వార్డర్ ఛాతీమీద. సైలెన్సర్ అమర్చబడిన పిస్టల్ అది. పెద్ద చప్పుడేమీ కాదు. వార్డర్‌ను చంపినంత మాత్రాన తను ఏ ఇబ్బందిలోనూ పడడు. ఏవో కారణాలు చెప్పొచ్చు.

యాహ్యాఖాన్, టిక్కాఖాన్ లాంటి వాళ్ళ పరిపాలనలో వున్నా పాకిస్తాన్‌లో, పై ఆఫీసర్లు, కింది ఆఫీసర్లను చంపితే ఎవరూ పట్టించుకోరు. సైనిక పరిపాలనలో న్యాయానికీ, చట్టానికీ విలువ ఆట్టే వుండదు అనీ తెలుసు.

"షూట్ చెయ్యి. సందేహిస్తావేం? నీ కళ్ళే చెపుతున్నాయి. నువ్వు హంతకుడివి కావు. నువ్వు మనిషిని చంపలేవు" అన్నాడు వార్డర్.

"ఏమిటా ధైర్యం నీకు?"

"అవును. నాకు తెలుసు. నువ్వు మనిషిని చంపలేవు" అన్నాడు వార్డర్.

"చంపాను చాలామందిని. నా కళ్ళను చూసి మోసపోక"న్నాడు యుగంధర్.

"చంపావేమో ఆత్మ రక్షణకి. నిరాయుధుడైన ఒక మనిషిని నువ్వు చంపలేవు" అన్నాడు వార్డర్.

"ఇప్పుడు నిన్ను చంపడం ఆత్మరక్షణ కోసమే"

"నువ్వు చంపదల్చుకుంటే చంపవద్దని నిన్నడిగి ప్రయోజనం లేదు" ఈ మాటలు అనేసి వార్డర్ చటుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్నాడు. యుగంధర్ వేలు మీట మీద వుంది. నొక్కాలి. షూట్ చెయ్యాలి చంపెయ్యాలి. వార్డర్ గదిలోంచి బయటికి వెళ్ళాడో ఆ మరుక్షణం నించీ తన బతుకు గడ్డిపరకతో సమానం. కాని మీట నొక్కలేకుండా ఉన్నాడు. తనవేపు వీపు తిప్పి వెళ్ళిపోతున్న మనిషిని కాల్చడం ఎలా? తను చెయ్యలేడా పని. స్ప్రింగ్ డోర్స్ కీచుమన్నాయి. వార్డర్ వెళ్ళిపోయాడు. ఒక్కసారిగా తల బాదుకోవాలనిపించింది యుగంధర్‌కి. ఇంతదూరం వచ్చి, యింతవరకూ సాధించి ఇప్పుడా తనకి ధర్మ సందేహాలు - ఆ ధర్మ సందేహాలతో తను ఎందుకు తటపటాయించినట్లు? తను ఆత్మహత్య చేసుకున్నాడన్నమాట.

బయట బూట్సు కరకరమని చప్పుడౌతున్నాయి. చాలామంది వస్తున్నారు లోపలికి. తను యీ వృత్తి తీసుకున్న తర్వాత దయా, నీతి అనేవి విస్మరించి వుండవలసింది. తను ఎదురు తిరిగి లాభం లేదు. రాజుకు తెలియచేయాలి తను అపజయం పొందలేదని, జేబులోకి చెయ్యి పోనిచ్చాడు. ట్రాన్స్ మీటర్ బటన్ మీద చెయ్యివేశాడు. నొక్కుతున్నాడు.

బీవ్...బీవ్...బీవ్...

డీ కోడ్ చేస్తున్నాడు రాజు. అతని మొహం పాలిపోతోంది. కళ్ళు ఎర్రబడిపోతున్నాయి. చేతులు వొణుకుతున్నాయి.

"రాజూ! నేను పట్టుబడిపోయాను. అప్రయోజకత్వం వల్ల కాదు. ఒక విధంగా నేను ఆత్మహత్య చేసుకున్నానని అనవచ్చును. నేను పోయిన తర్వాత కూడా నువ్వు యీ వృత్తిలోనే వుండదల్చుకుంటే దయాదాక్షిణ్యాలు నీలో లేకుండా చేసుకో. వాటికీ, ఈ వృత్తికీ విరోధం చాలా ఎక్కువ" ఇది రాజుకు యుగంధర్ పంపిన వార్త.

తన గుండె ఎవరో పట్టి నలుపుతున్నట్టయింది రాజుకు. కళ్ళు ఎర్రబడిపోయాయి. ఇప్పుడు ఏం చేయాలో తనకే తెలియడంలేదు. సెంట్రల్ జెయిల్లోకి వెళ్ళి అక్కడ శత్రువుకి చిక్కిన యుగంధర్‌కి, తనేం సహాయం చేయగలడు? జెయిలులోకి కాదు గదా, జెయిలు గేటు దగ్గరకి వెళితేనే తనను కాల్చి చంపేస్తారు శత్రువులు. అయినా తప్పదు వెళ్ళాలి. జేబులోంచి పిస్తోలు తీసుకుని తూటాలు నింపుకున్నాడు. రాజు మేజర్ నియాజ్ విషయం పూర్తిగా మర్చిపోయాడు. తను ఏం చెయ్యాలి? యుగంధర్‌ని ఎలా రక్షించాలి? ఏమీ ఆలోచించలేదు. ఒక పథకమూ వేసుకోలేదు. రెండడుగులు వేశాడో లేదో జేబులో వున్న ట్రాన్స్ మీటర్ మళ్ళీ బీవ్... బీవ్.. బీవ్ అనడం ప్రారంభించింది. యుగంధర్ మళ్ళీ ఏదో వార్త పంపుతున్నాడు. రాజు ఆత్రంతో కాగితం. పెన్సిలు తీసుకున్నాడు. బీవ్.. బీవ్.. బీవ్ రాసుకుంటున్నాడు. అది యుగంధర్ పంపిన వార్త కాదు. కోడ్‌లో కాత్యా రాజుకి వార్త పంపిస్తోంది.

"విన్నావా? ఘోరమైన వార్త, దుర్వార్త. యుగంధరే లేకపోతే ఎలా బతకను? యుగంధర్‌ని పట్టుకున్నా వెంటనే చంపెయ్యరనీ, టిక్కాఖాన్ ఆజ్ఞ కోసం కాచుకుంటారనీ అనుకుంటాను. ఓ రాజూ నువ్వు తొందరపడక. ఏదో ఉపాయం ఆలోచిద్దాం. టిక్కాఖాన్ నా చేతిలో కీలుబొమ్మ యింకా. టిక్కా వస్తున్నాడు గదిలోకి. ఇప్పుడు నీకింకేం చెప్పడానికీ వ్యవధి లేదు" ఆగిపోయింది కోడ్‌లో వార్త.

బయలుదేరుతున్నవాడు తనూ ఆగిపోయాడు రాజు. ఏదన్నా ఉపాయం ఆలోచించాలి. తను కూడా తొందరపడి ప్రయోజనం లేదు. పూర్తిగా కాత్యామీద ఆధారపడి వుండడం న్యాయం కాదు. వెనక్కి వెళ్ళాడు. నియాజ్ వున్న గదిలోకి వెళ్ళి "మేజర్ నియాజ్. ఒక ఉత్తరం రాసియ్యి" అన్నాడు.

"ఏమని, ఎందుకు?" అడిగాడు నియాజ్.

"ఏమనో చెపుతాను. ఎందుకో అడక్క" అంటూ రాజు కాయితమూ కలమూ నియాజ్ చేతికిచ్చాడు.

"ఈ ఉత్తరం తెచ్చిన అతన్ని తిన్నగా నా ఆఫీసు గదిలోకి పంపించండి.

సెంట్రల్ జెయిల్ సూపరింటెండెంట్ నియాజ్"

నియాజ్ చేత యిలా రాయించాడు.

ఆ ఉత్తరం తీసుకుని తిన్నగా సెంట్రల్ జైల్‌కి బయలుదేరాడు రాజు.

## 21

"ఏమిటి చాలా కోపంగా, విసుగ్గా ఉన్నారు?" అడిగింది కాత్యా, టిక్కాఖాన్ గదిలోకి రాగానే.

"కోపమూ విసుగూ రాక ఏమౌతుంది? హిందుస్తాన్ సైన్యాలు దాదాపు డక్కా వరకూ వచ్చేశాయి" అన్నాడు టిక్కాఖాన్ మంచంమీద చతికిలబడి.

"అదేమిటి? అన్ని రంగాలలోనూ పాకిస్తాన్ సైనికులు జయం పొందుతున్నాయనీ, హిందుస్తాన్ సైనికులు పాకిస్తాన్ సైనికుల ధాటికి తట్టుకోలేక పారిపోతున్నారనీ యిప్పుడే కదా రేడియోలో వార్త విన్నాను" అన్నది కాత్యా.

"పిచ్చిపిల్లా ఇది యుద్ధం. ఎవరూ నిజం చెప్పరు. చెపితే ప్రజలలో భయమూ, అలజడి కలుగుతుంది. ప్రజలను ఉత్తేజపరచాలి" అన్నాడు టిక్కాఖాన్.

"అయితే పాకిస్తాన్ యుద్ధంలో"

"పాకిస్తాన్ పరాజయం ఎన్నటికీ కలగదు. మాకు యిద్దరు బలమైన మిత్రులు ఉన్నారు. వాళ్ళు చూస్తూ ఊరుకోరు. ఇటు కాశ్మీర్ వైపు అటు నీఫా వైపు చైనా మళ్ళీ దాడి చేస్తుంది. సరిహద్దులు కాచుకునేందుకు హిందుస్తాన్ తన సైన్యాలను తూర్పు బెంగాల్ నించి తరలించుకుపోతుంది. అంతేకాదు. అమెరికన్ సెవెంత్ ఫ్లీట్, ప్రపంచంలోకెల్లా బలమైన నౌకాదళం. బంగాళాఖాతంలో కొచ్చేసింది. ఏ క్షణానైనా అమెరికన్ సైన్యాలు చిట్ గాంగ్ హార్బర్‌లో దిగుతాయి. అమెరికన్ విమానాలు హిందుస్తాన్ దళాలమీద బాంబులు వేసి మనిషి మిగలకుండా చేస్తాయి" అన్నాడు టిక్కాఖాన్.

"నిజమా! అమెరికా, చైనాలు ఈ రకంగా జోక్యం కల్పించుకుంటే రష్యా ఊరుకుంటుందా? మళ్ళీ ప్రపంచ యుద్ధమౌతుందేమో?" అన్నది కాత్యా.

"మరీ మంచిది. అప్పుడు నేను పాకిస్థాన్, చైనా, అమెరికా ఎల్లయిడ్ ఫోర్సెస్ కమాండర్ జనరల్ అవుతాను" అన్నాడు టిక్కాఖాన్ గర్వంగా.

అంతలో టెలిఫోన్ మోగింది. వెంటనే ప్రెసిడెంట్ రమ్మన్నారని ఏ.డి.సి టిక్కాఖాన్‌కి చెప్పాడు. 'వస్తాను' అంటూ బయలుదేరాడు టిక్కాఖాన్.

"అటునుంచి అటే యుద్ధరంగానికి వెళ్ళిపోతారేమో, మళ్ళీ కనిపించరేమో?" అన్నది కాత్యా.

"అలా వెళ్ళిపోతానా? వెళ్ళను. ఇంకొక గంటలో నీకు ఫోన్ చేస్తాగా" అంటూ టిక్కాఖాన్ గదిలోంచి వెళ్ళిపోయాడు.

## 22

వార్డర్ కనీసం పదిమంది సైనికులతో తనను బంధించడానికి వస్తూఈ వుండి వుండాలి అనుకున్నాడు యుగంధర్. తను ఎదురు తిరిగి ప్రయోజనం లేదు. ఒకర్నో ఇద్దర్నో తను చంపవచ్చుకాని ఏం లాభం? కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. తుపాకీలతో యిద్దరు సైనికులు స్ప్రింగ్ డోర్స్ తెరుచుకుని వచ్చి, గుమ్మానికి ఇటూ అటూ నిలుచున్నారు. ఓహో తప్పించుకోడానికి ఎటువంటి అవకాశమూ ఇవ్వలేదు. జాగర్త పడుతున్నారు. టకటకమంటూ బూట్స్ చప్పుడు చేసుకుంటూ వచ్చి మరో యిద్దరు సైనికులు కిటికీ వద్ద నిలుచున్నారు.

"ఏమిటీ తతంగం?

ఎందుకీ హడావుడి అనుకున్నాడు యుగంధర్. మళ్ళీ స్ప్రింగ్ డోర్సు కీచుమన్నాయి. కనురెప్ప వాల్చకుండా అటే చూస్తున్నాడు యుగంధర్. లోపలికి వచ్చాడు పాకిస్థాన్ ప్రెసిడెంట్ యాహ్యాఖాన్. ప్రెసిడెంట్ వెనకే ఏ.డి.సి, ఏ.డి.సి వెనక వార్డర్ వచ్చారు గదిలోకి.

తనను పట్టుకునేందుకు ప్రెసెడెంటే స్వయంగా వచ్చాడా? తనని చాలా గౌరవం చేస్తున్నారన్నమాట అనుకున్నాడు యుగంధర్. వార్డర్ వేపు చూశాడు. వార్డర్ మొహంలో ఏ మార్పూ లేదు. రాతిబొమ్మలా నిల్చున్నాడు.

"మేజర్ నియాజ్! నేను వెంటనే షేక్ మజిబూర్ రహమాన్‌ని కలుసుకోవాలి" అన్నాడు యాహ్యాఖాన్.

**తనను నియాజ్** అంటున్నాడు ఇంకా. ప్రెసిడెంట్‌కి నిజం తెలియదా? వార్డర్ చెప్పలేదా? వార్డర్ కళ్ళలోకి చూశాడు యుగంధర్. కనీ కనిపించని ఓ చిన్న నవ్వు నవ్వి కన్ను గిటాడు వార్డర్. ఏమిటో దానికి అర్థం ఏమైనా వార్డర్ తనను పట్టివ్వలేదు. పట్టివ్వదల్చుకోలేదు.

"తాళం చెవి ఏ.డి.సి.కి ఇయ్యి నియాజ్" అన్నాడు ప్రెసిడెంట్. ఏ.డి.సి చెయ్యి జాపాడు. అప్పటికే ఆ చేతిలో యింకో తాళం చెవి వుంది. అది వార్డర్ దగ్గరున్న తాళం చెవి అయి వుండాలి అనుకున్నాడు యుగంధర్.

"షేక్ మజిబూర్ రహమాన్‌ని చూసుకునే బాధ్యత యివ్వాళనించీ బహుశా మీకుండదనుకుంటాను" అంటూ ప్రెసిడెంట్ యాహ్యాఖాన్ కుర్చీలోంచి లేచాడు. సెంట్రీలు ముందూ, తర్వాత ప్రెసిడెంటూ, వెనక ఏ.డి.సి వెళ్ళిపోయారు. గదిలో యుగంధరూ, వార్డరూ మాత్రం మిగిలారు.

"నువ్వాడుతున్న నాటకం ఏమిటి?" అన్నట్టు చూశాడు వార్డర్‌ని యుగంధర్. వార్డర్ జేబులోంచి సిగరెట్ పేకెట్ తీసి, అందులోంచి సిగరెట్ ఒకటి బయటికి లాగి, సిగిరెట్ పేకెట్ మీద నెమ్మదిగా కొడుతున్నాడు. యుగంధర్ చెవులు రిక్కించుకుని వింటున్నాడు. అది కోడ్. ఏకాగ్రతతో వింటున్నాడు.

"X 808?" అదీ కోడ్‌లో వార్డర్ అడుగుతున్న ప్రశ్న. యుగంధర్ తుళ్ళిపడ్డాడు.

"కర్నల్‌హాక్ బయట నిలుచుని వున్నాడు జాగ్రత్త. మాట్లాడవద్దు" హెచ్చరించాడు వార్డర్ యుగంధర్‌ని.

యుగంధర్ మునివేళ్ళతో బల్లమీద కొడుతున్నాడు. "నువ్వెవరు?"

వార్డర్ ప్రశ్నకి జవాబు చెప్పేలోగా కర్నల్ హాక్ గదిలోకి వచ్చాడు.

## 23

ఎవరూ అడ్డు పెట్టలేదు. మేజర్ నియాజ్ ఇచ్చిన ఉత్తరం చూపించగానే తిన్నగా లోపలికి పోనిచ్చారు రాజుని సెంట్రీలు. సూపరింటెండెంట్ ఆఫీసు గది ముందున్న హాల్లోకి వచ్చాక రాజు గుండె గతుక్కుమంది. స్వింగ్ డోర్స్‌కి ఉన్న తలుపుకి చెరొక పక్క తుపాకి పట్టుకున్న యిద్దరు సైనికులు నిలుచుని వున్నారు. పాకిస్తాన్ యింటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ కర్నల్ హాక్ యిటూ అటూ పచార్లు చేస్తున్నాడు. తను రావడం చాలా ఆలస్యం అయిపోయింది. ఇప్పుడిక తను యుగంధర్‌కి ఏమి సహాయం చేయగలడు అనే నిస్పృహతో రాజు భుజాలు కిందకు దిగజారిపోయాయి.

"ఎవరు నువ్వు?" అడిగాడు హాక్.

నియాజ్ ఉత్తరం హాక్‌కి ఇచ్చాడు రాజు. హాక్ ఆ ఉత్తరం చదువుతుండగానే, సూపరింటెండెంట్ గదిలోంచి యాహ్యాఖాన్, ఏ.డి.సి బయటకు వచ్చారు. ముందూ వెనకా సైనికులూ బయటికి వచ్చారు. ఒక ఊరేగింపులా వుంది. బయటికి వెళ్ళిపోయారు.

"సూపరింటెండెంట్ ఇవాళ చాలా బిజీగా వున్నారు. బహుశా యివ్వాళ నిన్ను చూడడేమో" అన్నాడు హక్ రాజుతో. రాజు గుండె బరువు తగ్గింది. మనసు తేలిక పడింది. హక్ తనను గుర్తుపట్టనందుకు కాదు. యుగంధర్ యింకా సురక్షితంగా వున్నందుకు. కర్నల్ హక్ స్వింగ్ డోర్స్ తోసుకుని సూపరింటెండెంట్ గదిలోకి వెళ్ళిపోయాడు. అక్కడే బయట తారట్లాడుతున్నాడు రాజు.

కర్నల్ హక్ గదిలోకి రాగనే యుగంధర్ ఊపిరి బిగపట్టాడు. తనను గుర్తుపడతాడా? హక్ యుగంధర్ని సరిగ్గా చూడనైనా చూడకుండా కుర్చీలో కూర్చున్నాడు. మొహం పీక్కుపోయింది. ఏదో దిగులుతో అతని కళ్ళు బరువుగా వున్నాయి.

"మేజర్ నియాజ్ మన దేశానికి యిది పరీక్షా సమయం ఏం జరగబోతుందో? నాకు భయంగా వుంది" అన్నాడు హక్.

"ఏం? ఇప్పుడేం జరిగింది?" అడిగాడు.

"అన్ని వేపులనుంచీ హిందూస్థాన్ సైన్యాలు ఢక్కాను చుట్టుముట్టాయి. ఆయుధ విసర్జన చేసి లొంగి పొమ్మని, తూర్పు బెంగాల్‌లో మన సైనిక నాయకులికి హిందూస్థాన్ సైన్యాధిపతి విజ్ఞప్తి చేశాడు. లొంగిపోకపోతే ఢక్కాలో వున్న సైన్యం అంతా నాశనమౌతుంది."

అదేమిటి కర్నల్ మన సైన్యాలు ఘన విజయాలు.."

కర్నల్ చెయ్యెత్తి విసుగ్గా బల్లమీద ఒక దెబ్బకొట్టి "అదంతా యుద్ధ ప్రచారం. మొదటి నుంచీ మన సైన్యాలు చావుదెబ్బలు తింటున్నాయి. మనకన్నా పదింతలు బలం గల దేశం హిందూస్తాన్. ఎలా గెలుస్తాం" అన్నాడు హక్.

ఈ విషయం ప్రెసిడెంట్‌కి ముందే తెలియదా? మనం ఎందుకు కయ్యానికి కాలు దువ్వాము?" అడిగాడు యుగంధర్.

"తెలుసయ్యా, తెలుసు. ఆ చైనా వాళ్ళు మనల్ని ఉసిగొల్పారు. 'మీరు ముందు యుద్ధానికి వెళ్ళండి, మేమూ వస్తాం ' అని ధైర్యం చెప్పారు. ఇప్పుడు వెనక్కి తగ్గారు. తాము మన తరఫున యుద్ధంలోకి వస్తే రష్యా హిందూస్తాన్ తరఫున యుద్ధానికి వస్తుందేమోనని భయపడ్డారు చైనావాళ్ళు. పిరికిపందలు."

"మరి ఎప్పుడూ మనకి మద్దత్తిచ్చే అమెరికా ఏమయింది?" అడిగాడు యుగ్మధర్.

"ఉంది. ఏమౌతుంది? ఇదిగో సెవెంత్ ఫ్లీట్ బంగాళాఖాతంలోకి వచ్చేసిందన్నారు. ఇప్పుడు జంకుతున్నారు."

"ఎందుకు? అడిగాడు యుగంధర్.

"ప్రపంచ యుద్ధం వస్తుందని భయంట వాళ్ళకు. వాళ్ళ బలాబలాలు తేల్చుకునేందుకు పాకిస్థాన్‌ని ఒక పావుగా ఉపయోగించుకున్నారు అగ్రరాజ్యాల వాళ్ళు. పాకిస్థాన్ విచ్ఛిన్నమైపోయింది."

"ఇప్పుడేం చేస్తాం?" అడిగాడు యుగంధర్.

"ఢక్కాలో వున్న మన సైన్యాలు లొంగిపోవడం, యుద్ధవిరమణ ప్రకటించి, హిందూస్థాన్‌తో సంధి కోరడం వివేకమైన పని" అని క్షణం ఆగి, మళ్ళా కర్నల్ హక్ చెప్పడం ప్రారంభించాడు.

"ఆ వివేకం మన ప్రెసిడెంట్‌కి ఎక్కడిది? లొంగిపోవద్దనీ ఆఖరి సైనికుడి ప్రాణం వున్నంతవరకూ యుద్ధం చెయ్యమనీ ఆదేశం యిచ్చాడు. మనకి అపజయం తప్పదు. తూర్పు బెంగాల్‌లోని లక్షలమంది సైనికులు ప్రాణాలు విడుస్తారు" కర్నల్ హక్ కళ్ళవెంట నీళ్ళు జల జలా కారుతున్నాయి. కర్నల్ హక్‌లో వున్న మానవతకి, అతనికి వున్న దేశభక్తికి అపారమైన గౌరవం ఏర్పడింది అతని మీద యుగంధర్‌కి.

"నా కొడుకులిద్దరూ ఢక్కాలో వున్నారు" బల్లమీదికి తలవాల్చి ఏడుస్తున్నాడు హక్.

ఓహో! ఇది దేశభక్తి కాదన్నమాట. తోడి మానవులందరూ చస్తారనే చింత కాదన్నమాట. తన కొడుకులు పోతారనే స్వార్థమన్నమాట. అంతలో గదిలోకి టిక్కాఖాన్, అతని వెనక హమీద్‌ఖానూ వచ్చారు. లేచి నిలుచున్నారు యుగంధరూ, హక్. టిక్కాఖాన్, హమీద్‌ఖాన్ మౌనంగా వున్నారు. ఎవరూ మాట్లాడలేదు. పది నిమిషాలు గడిచిపోయాయి. మళ్ళీ సెంట్రీలు లోపలికి వచ్చారు. వాళ్ళ వెనకే ప్రెసిడెంట్ లోపలికి వచ్చాడు. జనర్ల్స్ ఇద్దరూ లేవబోతుంటే కూర్చోమని తనూ కూర్చున్నాడు ప్రెసిడెంట్.

"చాలా మంచిగా చెప్పి చూశాను. ఆ షేఖ్ ముజిబూర్ రహమాన్ తన మొండిపట్టు వదలడంలేదు. ఇప్పటికయినా మించిపోయిందిలేదు. తూర్పు బెంగాల్‌లోకి హిందూస్థాన్ సైన్యాలు రావడం దురాక్రమణ అని ఒక్క ప్రకటన ఇయ్యమని అడిగాను. అంతకన్నా ఏమీ అడగలేదు. బంగ్లాదేశ్‌కి హిందూస్థాన్ మిత్ర రాజ్యమట. దేశద్రోహి ఇక జాలిపడవలసిన అవసరంలేదు. ఇప్పుడే ఇక్కడే షేఖ్ ముజిబూర్ రహమాన్‌కి మరణశిక్ష విధిస్తున్నాను. నేనిక్కడ వుండగానే, ఇప్పుడే ఆ దేశద్రోహిని చంపాలి. ఆ దేశద్రోహిని నా కళ్ళముందే పూడ్చాలి. కర్నల్ హక్, మేజర్ నియాజ్ మీరిద్దరూ వెళ్ళి వెంటనే యేర్పాట్లు చెయ్యండి. మేం ఎగ్జిక్యూషన్ ఛాంబర్‌లో కాచుకుని వుంటాము. వెళ్ళండి, షేక్‌ని తీసుకు రండి" అరిచాడు యాహ్యాఖాన్.

"షేక్‌ని యిప్పుడు చంపి ప్రయోజనం ఏమిటి?" భయంగా అడిగాడు కర్నల్ హక్.

"ప్రయోజనం ఒక దేశద్రోహిని శిక్షించటమే ప్రయోజనం. డోంట్ ఆర్గ్యూ" అన్నాడు ప్రెసిడెంటు.

సెల్యూట్ చేసి యుగంధరూ, హక్, వార్డరూ బయటికి వెళ్ళారు.

అప్పుడు చూశాడు బయట హాల్లో రాజుని యుగంధర్.

" మీరు రమ్మన్నారు. వచ్చాను. మళ్ళీ రమ్మంటే వస్తాను" గొణిగాడు రాజు.

యుగంధర్ మనస్సులో ఆలోచనలు ఒక దానినొకటి తరుముకుని పరుగెత్తుతున్నాయి. వార్డర్ తనని పట్టివ్వలేదు. అంతేకాదు తను ఎక్స్ 808? అని అడిగాడు. అంతేకాదు, ఇండియన్ ఇంటిలిజెంట్ డిపార్టుమెంటు ఉపయోగించే కోడ్‌ను ఉపయోగించి అడిగాడు. షేక్ మజిబూర్ రహమాన్‌ని రక్షించడానికి తనకన్నా ముందుగా వచ్చిన స్పెషల్ బ్రాంచి ఏజెంట్ X212 అయి వుండవచ్చు అనుకున్నాడు యుగంధర్.

"ఆ! నీ పేరేమిటి? రఫీకదూ నీకు ఉద్యోగం ఇస్తానన్నాను. అవును. ఎప్పాయింట్‌మెంట్ ఆర్డర్ తర్వాతిస్తాను. ఇప్పుడే ఉద్యోగంలో చేరు. వార్డర్ ఇతన్ని తీసుకుని మీరు ఎగ్జిక్యూషన్ ఛాంబర్‌కి వెళ్ళండి. షేక్‌ని తన కళ్ళముందే పూడ్చిపెట్టాలని ప్రెసిడెంట్ చెప్పారు. గొయ్యి తవ్వించి పెట్టండి. మేము షేక్‌ని తీసుకొస్తాం" అన్నాడు యుగంధర్. ఈ మాటలు వినిపించుకునే స్థితిలో లేడు హక్. తన దిగుల్లో తనున్నాడు. యుగంధరూ, హక్ షేక్ మజిబూర్ రహమాన్ బంధింపబడ్డ యింటిలోకి వెళ్ళిపోయారు.

## 24

రాజు మట్టి తీసి పోస్తున్నాడు బయట. దాదాపు మోకాలు లోతు తవ్వారు రాజూ జైలులో పనిచేస్తున్న యింకో మనిషి.

"ఇంకా ఎంత తవ్వాలి?" అడిగాడు రాజు.

"ఇంకొక్క అడుగు తవ్వితే చాలనుకుంటాను" అన్నాడు వార్డర్ చెమట తుడుచుకుని. మళ్ళీ తవ్వడం ప్రారంభించాడు రాజు. షేక్ మజిబూర్ రహమాన్‌ని విడిపించి, బంగ్లాదేశ్‌కి తీసుకుపోవాలని వచ్చిన తను, షేక్‌ని పూడ్చిపెట్టడానికి గొయ్యి తవ్వుతున్నాడు. ఏమిటిది? తనెందుకీ పని చేస్తున్నట్టు? యుగంధర్ మాత్రం యిప్పుడు షేక్‌ని ఎలా రక్షిస్తాడు?

అంతలో తలుపు దగ్గర చప్పుడైంది. ప్రెసిడెంట్ యాహ్యాఖాన్, ఏ.డి.సి యిద్దరు సైనికులు లోపలికి వచ్చారు. సైనికులిద్దరూ తుపాకీలతో తలుపుకు చెరో పక్కా నిలుచున్నారు. గదిలో ఒకే ఒక కుర్చీ వుంది మధ్యన. ప్రెసిడెంట్ ఆ కుర్చీలో కూర్చున్నాడు. ఒకవైపున టిక్కాఖాన్ మరోవైపున హమీద్‌ఖాన్, వెనక ఏ.డి.సి నిలుచున్నారు. తలుపుకి అవతల మళ్ళీ అడుగుల శబ్దం వినిపించేసరికి అటు చూశాడు. తుపాకీలు అవతల మళ్ళీ అడుగుల శబ్దం వినిపించేసరికి అటు చూశాడు. తుపాకీలు భుజాల మీద పెట్టుకుని రెండుబారులుగా వస్తున్నారు సైనికులు చాలామంది. వాళ్ళ మధ్యన నడుస్తున్నారు. ముందు యుగంధరూ తర్వాత షేక్ మజిబూర్ రహ్మాన్, ఆ వెనక చేతిలో పిస్టల్ పట్టుకుని కర్నల్ హక్. తలుపు వరకూ వచ్చాక సైనికులు ఆగిపోయారు. యుగంధరూ, షేక్ హక్, మాత్రం గదిలో కొచ్చారు. లోపలికి రాగానే హక్ తలుపులు మూసేశాడు. షేక్‌ని తీసుకెళ్ళి గోడ దగ్గర నిలబెట్టాడు.

"షేక్ మజిబూర్ రహ్మాన్, నువ్వు దేశద్రోహివి. నీకు మరణ శిక్ష విధించాను. చేసిన నేరానికి పశ్చాత్తాపం తెలియపరిస్తే యీ ఆఖరి క్షణాన్నైనా సరే శిక్ష రద్దు చేస్తాను" అన్నాడు యాహ్యాఖాన్.

షేక్ నోరు మెదపలేదు. కనురెప్ప కదల్చలేదు. నిశ్చలంగా చూస్తున్నాడు. యుగంధరు, రాజూ షేక్‌ని చూస్తున్నారు. ఆ క్షణాన వాళ్ళకు కనిపిస్తునంది షేక్ మజిబూర్ రమాన్ కాదు. దాస్యాన్ని భరించలేక స్వాతంత్ర్యం కోసం ప్రజల కోసం తమ ప్రాణాలని లెక్కచేయని ధీరోదాత్తులు, మహనీయులు ఎందరో కనిపిస్తున్నారు షేక్ మజిబూర్ రహ్మాన్ కళ్ళల్లో – అబ్రహామ్ లింకన్, గిరబాల్డీ, మహాత్మాగాంధీ లాంటివాళ్ళు.

"మాట్లాడవా? అంతేనన్నమాట. నీ ఖర్మ ఎగ్జిక్యూట్" అరిచాడు ప్రెసిడెంట్ యాహ్యాఖాన్.

"ఈ దేశద్రోహిని హతమార్చే గౌరవం నాకివ్వండి" అంటూ బెల్టులోంచి పిస్టల్ తీశాడు టిక్కాఖాన్. షేక్ మీదకు గురిపెట్టాడు. షేక్ పెదిమలు కదిలాయి. కళ్ళు మెరుస్తున్నాయి. ఏదో అంటున్నాడు.

"ఆగండి జనరల్. షేక్‌కి బుద్ధొచ్చినట్టుంది. ఏమిటంటున్నావ్ షేక్?" అడిగాడు ప్రెసిడెంట్.

"జై బంగ్లా" అన్నాడు షేక్ మజిబూర్.

"షూట్" అరిచాడు యాహ్యాఖాన్.

టిక్కాఖాన్ పిస్టల్ మీట మీద వేలు పెట్టి నొక్కుతున్నాడు.

టిక్కాఖాన్ చేతిలో పిస్టల్ ఒక్క ఎగురు ఎగిరి కిందపడింది. అదిరిపోయి పక్కకి చూశాడు టిక్కాఖాన్. పిడుగులా టిక్కాఖాన్ మీద పడ్డాడు యుగంధర్. బలం కొద్దీ ఒక్క తన్ను తన్నాడు. ఆ తన్నుతో టిక్కాఖాన్ షేక్‌ని పూడ్చడానికి తీసిన గోతిలో పడ్డాడు.

"ఏమిటిది?" అంటూ లేచాడు యాహ్యాఖాన్ కుర్చీలోంచి.

యాహ్యాఖాన్ ఛాతీమీద రెండు చేతులూ పెట్టి ఒక్క తోపు తోశాడు యుగంధర్. యాహ్యాఖాన్ కూడా గోతిలో వెళ్ళిపడ్డాడు టిక్కాఖాన్ మీద. ఆ సెంట్రీలు హడావిడిగా తుపాకీలు పైకెత్తారేగాని ఎవర్ని కాల్చాలో తెలియక, ఖంగారు పడుతున్నారు. ఇంతలో 'ఢాం ఢాం ' అని రెండుసార్లు పేలింది పిస్టల్. సెంట్రీల చేతుల్లో తుపాకీలు కింద పడ్డాయి. పిస్తోలు పేల్చింది రాజు. రక్తం కారుతున్న చేతులతో నేలమీదపడి దొర్లుతున్నారా సైనికులు.

"వీడే హిందూస్తాన్ గూఢచారి యుగంధర్. వదలొద్దు" అంటూ కర్నల్ హక్ యుగంధర్ మీద విరుచుకుపడ్డాడు. ఇద్దరూ దాదాపు సమ ఉజ్జీలు. ఏ.డి.సి మొలలోంచి పిస్టల్ తీస్తున్నాడు. ఒక్క ఉరుకున వెళ్ళి రాజు ఏ.డి.సి మీద పడ్డాడు. పడుతూ పిస్టలున్న చేతిని పైకెత్తేశాడు. 'ఢాం' అని పిస్తోలు పేలింది. గుండు పైకిపోయింది. యుగంధర్‌కి తగల్లేదు. గోతిలో పడ్డ టిక్కాఖాన్, యాహ్యాఖాన్‌ల మీద పిస్టల్ గురిపెట్టి అక్కడే నిలుచున్నాడు వార్డర్. గొయ్యి తవ్వడానికి వచ్చిన కూలీకూడా గోతిలోనే వున్నాడు. యుగంధర్‌కిగాని, రాజుకి గాని సహాయం రావడానికి వీలులేకుండా పోయిందతనికి. ఏ.డి.సి

రాజుకన్నా బలమైనవాడు. రాజును చేతులూ కాళ్ళూ పట్టుకుని విసిరేశాడవతలికి. రాజు షేక్ మజిబూర్ మీద పడ్డాడు. రాజును హతమార్చలనే దృఢ నిశ్చయంతో, ఏ.డి.సి మళ్ళీ రాజు మీదకొచ్చాడు. దగ్గరికి వచ్చాక తన రెండు కాళ్ళూ వెనక్కి లాక్కుని ఏ.డి.సి మోకాళ్ళమీద బలంగా తన్నాడు రాజు. ముందుకు పడ్డాడు ఏ.డి.సి. తన మీద పడకుండా రాజు కొంచెం పక్కకి జరిగాడు. కటిక నేలమీద ఏ.డి.సి బోర్లా పడ్డం వల్ల మొహం చితికినట్లయింది. రాజు ఒక్కసారిగా స్ప్రింగ్‌లా, లేచి ఏ.డి.సి జుట్టు పట్టుకుని అతని తలను బాదాడు. ఏ.డి.సి.లో చలనం పోయింది. ఇక తను యుగంధర్ సహాయానికి వెళ్ళాలి. యుగంధరూ హక్ నేలమీద దొర్లుతున్నారు. ఎవరు ఎవరో తెలియడంలేదు. ఒకళ్ళ గొంతు ఒకళ్ళు పట్టుకున్నారు. ఇద్దరి కళ్ళూ వెళ్ళుకొస్తున్నాయి. ఇద్దరికీ నాలికలు వుబ్బి బయట కొస్తున్నాయి. హక్‌ని ఒక తన్ను తన్ని లాగేద్దామని రాజు వెళ్ళాడు. ఎప్పుడు చూశాడో ఎలా చూశాడో హక్, దగ్గిరకు రానిచ్చి రాజునే ఒక్క తన్ను తన్నాడు. ఆ ఒక్క తన్నుకు రాజు దూరాన తలుపు దగ్గరకెళ్ళి పడ్డాడు. చట్టుక్కున యుగంధర్ మెడమీంచి చేతులు తీసేశాడు హక్. ఊపిరాడక సతమతమౌతున్నాడు యుగంధర్. పట్టు సడలింది. ఆ అవకాశం తీసుకుని, ఒక్క దులుపు దులుపుకుని హక్ లేచాడు. అతని కళ్ళలో మంటలు రేగుతున్నాయి. జేబులోంచి పిస్టల్ తీసి యుగంధర్ మీద గురిపెట్టాడు కాల్చబోతున్నాడు. చక్రంలా తిరిగాడు యుగంధర్. తిరుగుతూ హక్ రెండు కాళ్ళూ పట్టుకుని హక్‌ని కూడా చక్రంలా తిప్పడం ప్రారంభించాడు. అయిదు నిమిషాలు తిప్పి వదిలేశాడు. హక్ దూరంగా పడి గోడకు కొట్టుకున్నాడు. అంతే, హక్ కదలలేదు. లేచి నిలబడి ఆయాసం తీర్చుకుంటున్నాడు యుగంధర్. అప్పుడు చూశాడు షేక్ నేలమీద పడివుండడం. త్వరత్వరగా వెళ్ళి షేక్ నాడి పరీక్ష చేసి, "చిన్న దెబ్బే తగిలింది. ప్రమాదమేమీ లేదు. స్పృహపోయింది అంతే" అన్నాడు రాజుతో.

తర్వాత గొయ్యి దగ్గరకి వెళ్ళారు.

"గుడ్‌లక్! కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ యుగంధర్! నేను X 212" అని చెప్పాడు వార్డర్ వేషంలో వున్న ఇండియన్ ఎస్.బి.ఏజంట్.

"తెలుసు, గ్రహించాను. మీనించి కబురు రాకపోతే మీ తర్వాత వచ్చే ఏజంట్‌కి X నెంబర్ 808 అని బండార్కర్ ముందే చెప్పారన్న మాట. అప్పుడే కంగ్రాచ్యులేట్ చెయ్యకండి. ఇంకా చాలా వుంది మన పని" అంటూ ఆ గోతిలో చెరొక మూల నక్కి కూర్చున్న టిక్కాఖాన్‌నీ, యాహ్యాఖాన్‌నీ చూశాడు యుగంధర్.

"ఎందరి ప్రాణాలనో బలితీసుకుని, యుద్ధం ప్రారంభించి వేలకు వేల్ మనుష్యుల చావుకి కారకులైన మీరు మీ ప్రాణాలకు ముప్పు రాగానే ఏమిటీ వొణుకు? ఏమిటీ పిరికితనం. లెండి. గోతిలోంచి బయటకి రండి" అరిచాడు యుగంధర్.

టిక్కాఖాన్, యాహ్యాఖాన్ గోతిలోంచి బయటికి వచ్చి నిలుచున్నారు. భయంతో, సిగ్గుతో తలలు వంచుకున్నారు.

"ఎత్తండి తలలు. నా కళ్ళల్లోకి చూడండి. ఎవరినీ శిక్షించే అర్హత మీకు లేదు. షేక్ మజిబూర్ రహమాన్‌ని శిక్షిస్తారా? ధర్మం కోసం, మానవజాతి తరపున మీ యిద్దరికీ విధించాలి మరణశిక్ష. నా పేరే యుగంధర్. ఇతను నా అసిస్టెంటు రాజు. వార్డరుగా ఉన్నతను స్పెషల్ బ్రాంచి ఏజంటు. మేం ముగ్గురమూ ప్రాణాలకు తెగించిన వాళ్ళమని తెలుసా మీకు? మేం చెప్పినట్లు మీరు 'తు.చా తప్పకుండా ఆచరిస్తే మిమ్మల్ని ప్రాణాల్తో వదిలిపెడతాం."

"ఏం చెయ్యాలి?" అడిగాడు యాహ్యాఖాన్.

"ప్రెసిడెంట్. నీ వెనక నేను టిక్కా ఖాన్ వెనక రాజు పిస్తోళ్ళు పట్టుకు నడుస్తాము. జాగ్రత్త. పొరపాటు చేశారా, కాల్చి చంపేస్తాము. స్పెషల్ బ్రాంచి ఏజంట్, షేక్ మజిబూర్‌ని తన భుజం మీద వేసి తీసుకు వస్తాడు. మీ కారువరకూ వెళ్ళాలి. ఈలోగా ఎవరడ్డు వచ్చినా, ఏమడిగినా సర్దిచెప్పే బాధ్యత మీది" అన్నాడు యుగంధర్.

"తర్వాత?" అడిగాడు ప్రెసిడెంట్.

"కారెక్కిన తర్వాత అప్పుడు చెప్తాను" అన్నాడు యుగంధర్.

బీప్...బీప్...బీప్...

కాత్యా వ్రాసుకుంటోంది. సంతోషంతో ఆమె మొహం వెలిగిపోతోంది. సందేశం పూర్తయింది. ట్రాన్స్ మీటరు హేండ్‌బాగ్‌లో పడేసుకుని, 'విక్టరీ యీజ్ అవర్స్ ' అని పాడుకుంటూ బయలుదేరింది.

"ఎక్కడికి వెళుతున్నావ్?" అడిగింది పోలి.

"చెపుతాను – ఒక రహస్యం" నవ్వుతూ పోలీ చెవిలో చెప్పింది.

"జనరల్ టిక్కాఖాన్‌కే కాదు, జనరల్ యాహ్యాఖాన్‌కి కూడా పౌరుషం లేదట" కాత్యా ఏమి చెప్పిందో పోలీస్ గ్రహించే లోపునే కాత్యా బయటికి వెళ్ళిపోయింది.

"త్వరగా బ్రిటిష్ రాయబార కార్యాలయానికి నిమిషంలో తీసుకెళ్ళాలి" అన్నది కాత్యా టాక్సీ డ్రయివర్‌తో.

ఎవరూ అడ్డుపెట్టలేదు. ఏ ఆటంకమూ కలుగలేదు. జెయిలులో ఉద్యోగులూ, సైనికులూ ఆశ్చర్యంతో చూశారే తప్ప ఎవరూ ఏమీ అడగలేదు.

ప్రెసిడెంట్ కారు ఎక్కాడు, స్పృహలేని షేక్ మజిబూర్, టిక్కాఖాన్. డ్రయివర్ కారు స్టార్టు చేశాడు. ముందొక ఆర్మీ జీపు, తరువాత మోటారు సైకిళ్ళు, ఒక ఆర్మీ జీపు బయలుదేరాయి. జెయిల్ గేటు దాటి రోడ్డుమీది కెళ్ళారు. ముందున్న జీపు సైరన్ ఊదుతోంది. రోడ్డుమీద జనం తప్పుకుంటున్నారు. బళ్ళూ కార్లూ పక్కల ఆగిపోతున్నాయి.

" బ్రిటిష్ రాయబార కార్యాలయానికి వెళ్లమని డ్రైవర్‌కి చెప్పండి ప్రెసిడెంట్" అన్నాడు యుగంధర్.

"బ్రిటిష్ ఎంబసీకా? అది దౌత్య నియమాలకి విరుద్ధం" అన్నాడు ప్రెసిడెంట్.

"విషయాలాలోచించేందుకిది సమయంకాదు. ప్రెసిడెంట్ ప్రాణమే అపాయంలో వుంది" అన్నాడు యుగంధర్ నవ్వుతూ.

బ్రిటిష్ ఎంబసీకి వెళ్ళమని డ్రైవర్‌కి చెప్పాడు ప్రెసిడెంట్.

బ్రిటిష్ ఎంబసీ గేటు బార్లా తెరిచి వుంది. ప్రెసిడెంట్ కారు లోపలికి వెళ్ళగానే గేటు జవాను గేటు మూసేశాడు. ప్రెసిడెంట్ బాడీగార్డు మనుషులు లోపలికి రావడానికి వీలులేక పోయింది.

షేక్ మజిబూర్ రహ్మాన్‌ని ఎత్తుకుని X 212 ఎంబసీలోకి పరుగెత్తాడు. తర్వాత యుగంధరూ, రాజు లోపలికి వెళ్ళారు. హాల్లోనే కాత్యా ఎదురుపడింది.

"బ్రిటిష్ రాయబార్ని ఒప్పించడం కొంచెం కష్టమైంది, అయినా ఒప్పుకున్నాడు – ఆయనకి బంగ్లాదేశ్ ప్రజల పట్ల చాలా సానుభూతి వుంది కనక. రండి. మేడ మీద వెనక వేపు మనకి గదిచ్చారు" అంటూ యుగంధర్నీ రాజునీ కాత్యా తీసుకు వెళ్ళిపోయింది.

"దేశద్రోహి అయిన షేక్ మజిబూర్ రహ్మాన్‌కి శరణు యివ్వడానికి కానీ, యిండియన్ గూఢచారులకు ఆశ్రయం యివ్వడానికి కానీ, మీకేవిధమైన అధికారంలేదు. వెంటనే మా కప్పు చెప్పండి" అరిచాడు యాహ్యాఖాన్.

"క్షమించండి ప్రెసిడెంట్. మీరంటున్నారు ఆ విషయం తటస్థ దేశమైన మలేషియన్ పౌరులం అంటున్నారు వాళ్ళు. కనక వాళ్ళని యిప్పుడు అప్పచెప్పడానికి వీలులేదు. అంతేకాక మా ప్రభుత్వానికి తెలియజేసి లండన్ నించి ఆ దేశం వస్తేగాని నేనేం చేయలేను" అన్నాడు బ్రిటిష్ రాయబారి చాలా మర్యాదగా.

అంతలో రాయబారి సెక్రటరీ ఓ కాయితం తీసుకొచ్చి బల్లమీద పెట్టాడు. అది చదివి "ప్రెసిడెంట్, ఈ గొడవలో ఈ వార్త మీ వరకూ వచ్చి వుండదు. ఢక్కాలోని పాకిస్తాన్ సైన్యం, ఆయుధ విసర్జన చేసి లొంగిపోయిందట. భారత సైన్యం ఢక్కాలో ప్రవేశించిందట. షేక్ మజిబూర్ రహ్మాన్ విషయమై మీరింకా గొడవ చేయడం మంచిది కాదేమో? అన్నాడు బ్రిటిష్ రాయబారి.

అయినా ప్రెసిడెంట్ యాహ్యాఖాన్ తన పట్టువదల్లేదు. వాళ్ళను అప్పచెపితేగాని వీల్లేదని కూర్చున్నాడు. బయట జనం పోగయ్యారు. వీధిలో అలజడి ప్రారంభమైంది. గంటలు గడిచి పోతున్నాయి. రాయబారి సెక్రటరీ మరొక కాయితం తెచ్చి యిచ్చాడు రాయబారికి.

"ప్రెసిడెంట్ ఇంకొక శుభవార్త భారత ప్రభుత్వం ఇప్పుడే తనకై తాను యుద్ధ విరమణ ప్రకటించింది. అంగీకరించమని సలహా యిస్తున్నాను" అన్నాడు రాయబారి.

ప్రెసిడెంట్ యాహ్యాఖాన్ ఏమీ మాట్లాడకుండా రాయబార కార్యాలయం నించి వెళ్ళిపోయాడు.

## 25

ఢిల్లీ పాలం విమానాశ్రయంలో బ్రిటిష్ విమానం ఒకటి దిగింది. రంగు కాయితాలతొ, పువ్వులతో, జెండాలతో విమానాశ్రయం కళకళలాడుతోంది. విమానంలోంచి బయటకు వచ్చాడు షేక్ మజిబూర్ రహ్మాన్. చెవులు చిల్లులు పడేటట్లు "జై బంగ్లా, జైహింద్" నినాదాలతో ఆ ప్రదేశం మారు మోగింది. మోపులు మోపులు దండలు పడ్డాయి షేక్ మజిబూర్ రహ్మాన్ కు స్వాగతం చెపుతున్నారు.

ఈ కోలాహలంలో, షేక్ వెనకే విమానంలోంచి దిగిన యుగంధర్‌నీ, రాజునీ, X 212ని, కాత్యాని ఎవరూ గమనించలేదు.

ఎవరూ గమనించకూడదనే వాళ్ళూ జనంలో కలిసి వెళ్ళిపోతున్నారు. యుగంధర్ భుజం మీద చెయ్యి పడింది వెనకనించి. వెనక్కి తిరిగాడు. స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్ యుగంధర్ చేతులు పట్టుకుని "సాధించారు యుగంధర్. అసాధ్యమైన పని సాధించారు" అన్నాడు.

"అవును నేను ఒక్కణ్ణీ సాధించలేదు, మేము సాధించాము" జవాబిచ్చాడు యుగంధర్.